


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-2-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 25 పేజీలు: 10+4 వెల: 6.50


ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య 2

ట్రేడ్‌డీల్ రద్దు చేయండి -రాహుల్ గాంధీ డిమాండ్ 5

# మావోయిస్టులకు గట్టి దెబ్బ

## అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి, చొక్కారావు, నర్సింహారెడ్డి లొంగుబాటు



మంగళవారం హైదరాబాద్‌లో డిజిపి ఎదుట లొంగిపోయిన దేవ్‌జీ, రాజిరెడ్డి, చొక్కారావు, నర్సింహారెడ్డి తదితరులు

### గణపతి సహా లొంగు'బాట'లో మరికొందరు?

### ఆపరేషన్ కగార్‌లో కీలక పరిణామాలు

### దాదాపు ఉనికిని కోల్పోయిన మావోయిస్టు పార్టీ

### రాజకీయాల్లోకి వస్తా: దేవ్‌జీ.. మావోయిజం అంతరించదు: రాజిరెడ్డి

### మిగిలిన అతికొద్ది మంది కూడా లొంగిపోవాలి: డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ అగ్రనేతలు తిపిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, (62), మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రాం (76), బడె చొక్కారావు అలియాస్ దామోదర్ (47), నూనె నర్సింహారెడ్డి (62) అలియాస్ గంగన్నలు మంగళవారం డిజిపి శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. వారంరోజులుగా వీరు లొంగిపోతున్నట్లు వస్తున్న వార్తలను నిజం చేస్తూ బంజా రాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ ఆడిటోరియంలో నలుగురి లొంగుబాటు కార్యక్రమాన్ని పోలీసుశాఖ ఘనంగా నిర్వహించింది. కాగా వారం రోజుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన మరికొందరు అగ్రనేతలు లొంగిపోనున్నట్లు తెలిసింది. వీరిలో పార్టీ అగ్రనేత ముప్పాల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి కూడా వున్నారని ప్రచారం జరుగుతోంది. కాగా మావోయిస్టు పార్టీకి చెందిన నలుగురు అగ్రనేతల లొంగుబాటుపై డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ నక్సలిజానికి కాలం చెల్లిందని, అజ్ఞాతంలో వున్న వారు వెంటనే లొంగిపోవడం మంచిదని, పార్టీ అగ్రనేత గణపతి కూడా లొంగిపోతే మంచిదని అన్నారు. లొంగిపోయిన సందర్భంగా దేవ్‌జీ మాట్లాడుతూ తాను రాజకీయాల్లో వస్తానని, ప్రజా >>2

**గణపతి నేపాల్‌లో మకాం?** 3

## ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు

# జూన్ 2 తర్వాతే!

### కేంద్రంలో రిజర్వేషన్లు తేలాకే ముందుకు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి24:** బీసీలకు 42 శాతం బీసీలకు కేటాయిస్తామన్న రిజర్వేషన్ల కల్పనపై కేంద్ర ప్రభుత్వం ఏదో ఒకటి తేల్చిన తర్వాతే మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు వెళ్లే యోచనలో తెలంగాణ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ సమావేశంలో అధికారిక ఎజెండా ముగిసిన తర్వాత అధికారులు బయటకు వెళ్లిన తర్వాత పరిషత్ ఎన్నికలతో పాటు మరికొన్ని రాజకీయ అంశాలపై చర్చలు జరిపినట్లు తెలిసింది. బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానాన్ని, బిల్లును కేంద్రానికి పంపింది. దీనిపై కేంద్రం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలని, అప్పటి వరకు జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు నిర్వహించొద్దనే అభిప్రాయానికి సిఎం రేవంత్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై రాష్ట్ర మంత్రులు, ఇతర నాయకులు సీఎం మాటలకు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.తెలంగాణలోని మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరిషత్ ఎన్నికల్లోనూ అదే జోరు, ఉత్సాహాన్ని కొనసాగించేలా మంత్రులంతా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం.తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి బిల్లులు ఆమోదం పొందినప్పటికీ ఈ బిల్లు చట్టరూపం దాల్చేందుకు రాష్ట్రపతికి చేరింది. బీసీలకు విద్య, ఉద్యోగ, ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనేదే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. అయితే దీనికి రాష్ట్రపతి ఇంకా ఆమోదముద్ర వేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేసేందుకు ప్రయత్నించినా హైకోర్టు స్టే ఇచ్చింది. దీంతో ఈ ప్రక్రియ మరింత కష్టంగా మారింది. ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస పార్టీ సత్తా చాటింది. 93 >>2



### బతుకుతానో.. లేదో!

## ఎవరైనా చంపేస్తారేమో!

### రిసార్ట్ కాల్పుల తర్వాత ట్రంప్ నిర్వేదం

**ఫ్లోరిడా, ఫిబ్రవరి 24:** మార్‌ఎలాగో రిసార్ట్‌లోకి తుపాకీతో చొరబడేందుకు ప్రయత్నించిన ఆగంతుకుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపిన ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలిసారి స్పందించారు. ఈ భద్రతా లోపంపై ఆయన కాస్త ఆందోళన, మరికాస్త వ్యంగ్యంగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్ నేను ఇంకా ఎంతకాలం ఇక్కడ జీవించి ఉంటానో నాకు తెలియదు. నా కోసం తుపాకులు >>2

**ట్రంప్ మరిన్ని సుంకాలు!** 7

**నేటి నుంచి ఇంటర్ పరీక్షలు** 2

**విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పిరియడ్**

# కేరళ ఇక కేరళం

### రాష్ట్రం పేరు మార్పునకు కేంద్ర కేబినెట్ ఆమోదం



**రూ.12,236 కోట్లతో రైలు, మెట్రో, ఎయిర్‌పోర్టు ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్**

దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పివి వ్యాక్సిన్లు

**కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన నూతన పిఎంఓ బిల్డింగ్ సేవా తీర్థ్‌లో మంగళవారం మంత్రివర్గం సమావేశమైంది. కేరళ పేరు మార్పుతో సహా పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. సమావేశానంతరం ఆ వివరాలను కేంద్ర మంత్రి అశ్వని వైష్ణవ్ మీడియాకు తెలిపారు. కేరళ పేరును కేరళంగా మార్చే ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని, పేరు మార్పు బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదానికి పంపుతామని మంత్రి తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తరువాత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామని చెప్పారు. భాష ఆధారంగా రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి, కేరళకు కేరళం అని పేరు పెట్టాలనే డిమాండ్ ఉంది. ఈ సంవత్సరం జరగనున్న కేరళం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ చర్య తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. రూ.12,236 కోట్ల అంచనా వ్యయంతో రైల్వేలు, మెట్రో రైలు, ఏవియేషన్, మౌలికసదుపాయాల కల్పన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే విద్యుత్ రంగం సంస్కరణలపై కూడా విధానపరమైన నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.5.236 కోట్ల అంచనా వ్యయంతో గోండియా-జబల్‌పూర్ రైల్వే లైను డబ్లింగ్ పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.2,668 కోట్ల పెట్టుబడితో పునరాఖ్ - కియుల్ మధ్య 3,4వ రైల్ లైన్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. రూ.1,168 కోట్ల అంచనా వ్యయంతో గమారియా-చాందిల్ మధ్య 3,4వ రైల్వే లైన్ నిర్మాణానికి, రూ.1,667 కోట్లతో శ్రీనగర్‌లో కొత్త ఇంటిగ్రేటెడ్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్‌కు సమ్మతి తెలిపింది. రూ.1,067 కోట్లతో అహ్మదాబాద్ మెట్రో ప్రాజెక్టు ఫేజ్-2 విస్తరణకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా బాలికలందరికీ ఉచితంగా హెచ్ పీవీ వ్యాక్సినేషన్ చేయించాలని తీర్మానించింది. అలాగే 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్దాసిల్ ఇంజెక్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించింది. పవర్‌గ్రిడ్‌కు అదనపు బృందాన్ని నియమించడంతోపాటు, మహారత్న సిపిఎస్‌ఇలకు మరిన్ని అధికారాలు బదిలీ చేయాలనే ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, విద్యుత్ రంగంలో ఈక్విటీ పెట్టుబడి పరిమితిని 5 వేల కోట్ల నుండి రూ.7,500 కోట్లకు పెంచుతూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.




# ఇక 'ఈజ్ ఆఫ్ డూయింగ్' 2.0

### ప్రతి ప్రాంతాన్ని వృద్ధిపథంలోకి నడిపించడమే మా అజెండా

### 'క్యూర్ ప్యూర్ రేర్' దానిలో భాగమే

### గ్రోత్ ఎక్స్ 2026 సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలనే లక్ష్యంతో త్వరలోనే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0కు శ్రీకారం చుట్టబోతున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేలా, పెట్టుబడిదారులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేలా, ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా అందరితో చర్చించి ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామన్నారు. మంగళవారం జూబ్లిహిల్స్‌లోని జెఆర్‌సిసి కన్వెన్షన్ సెంటర్‌లో ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన "గ్రోత్ ఎక్స్ 2026 సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గ్రోత్ అంటే యాదృచ్ఛికంగా వచ్చేది కాదని, భావి తరాల భవిష్యత్తు కోసం శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విజన్ 2047ను రూపొందించిందన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న తెలంగాణను, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి "క్యూర్ ప్యూర్ రేర్" అనే త్రిముఖ వ్యూహానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామన్నారు. నగరం నుంచి గ్రామం వరకు ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ అజెండా అని స్పష్టం చేశారు. ఏఐ, ఇండస్ట్రీ 5.0 లాంటి టెక్నాలజీస్‌తో వర్క్ కల్చర్‌లో మార్పు వచ్చిందని, రాబోయే రోజుల్లో కంపెనీల కంటే ఎకో సిస్టంకే >>2

**మరణించిన మానవత్వం**

**ఏడుపు ఆపడం లేదని రెండు నెలల బిడ్డను కట్టెల పొయ్యిపై కాల్చేసింది**

# ఆమె కన్నతల్లేనా?

**దుండిగల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** పిల్లలను కంటికి రెప్పలా కాపాడాల్సిన తల్లి కసాయిగా మారింది. క్రూరమృగాలు సైతం సిగ్గు పడేలా తన కర్కశత్వాన్ని చూపుతూ పేగు తెంచుకొని పుట్టిన రెండు నెలల పసికందును అత్యంత కిరాతకంగా హతమార్చింది. ఈ అమానవీయ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మధ్యప్రదేశ్ రాష్ట్ర, బీనస్టేషన్‌సాగర్ జిల్లా, నవ్వగవ గ్రామానికి చెందిన రాజేంద్ర ఆదివాసీ, మమతాఅహిర్వార్(20) దంపతులు కొంతకాలం క్రితం జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి దుండిగల్ సర్కిల్, భౌరంపేట పరిధి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులోని సెనరెల్లి అపార్ట్‌మెంట్స్‌లో కూలిపనులు చేసుకుంటూ అక్కడే కూలీల కోసం ఏర్పాటు చేసిన రేకుల గదిలో నివాసం ఉంటున్నారు. వీరికి రెండు నెలల వయసున్న బాబు ఉన్నాడు. మంగళవారం ఉదయం రాజేంద్ర పనులకు వెళ్ళి తిరిగి మధ్యాహ్నం వారి గదికి చేరుకున్నాడు. తన >>2



పోలీసుల అదుపులో నిందితురాలు మమతా అహిర్వార్


"సాధారణ విద్యార్థులతో అసాధారణ విజయాలు"
సాదింపచేయడం కేవలం Resonanceకు మాత్రమే సాధ్యం




Resonance®
Junior Colleges with IIT-JEE & NEET

తెలుగు రాష్ట్రాలలో వరుసగా ఏడో సంవత్సరం కూడా
JEE Main Session 1 ఫలితాలలో మళ్లీ సత్తా చాటిన
Resonance Hyderabad

63 మంది Resonance Hyderabad విద్యార్థులు overall 99 పర్సెంటైల్ సాధించారు
505 మంది Resonance Hyderabad విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో 99 పర్సెంటైల్ సాధించారు

Think Results, Think Resonance
9121219858 | www.resonancecolleges.com



జార్ఖండ్ చత్రా జిల్లాలోని సిమారియా సమీపంలో కూలిపోయిన ఎయిర్ అంబులెన్స్ శిథిలాలను తొలగిస్తున్న సిబ్బంది

## ఆమెకన్నతల్లేనా?

>> బార్య మమతా తన బాబును కట్టెల పొయ్యపై కాల్చుతుండడాన్ని గమనించి ఆమెను పక్కకు తోసేసి చూడగా అప్పటికే తీవ్రగాయాలతో బాలుడు మృతిచెందాడు. బాలుడి నోట్లో గుడ్డలు కుక్కి, కాళ్ళు కట్టేసి అత్యంత కిరాతకంగా హతమార్చడాన్ని చూసి రాజేంద్ర కన్నీరుమున్నీరుగా విలపిస్తుండడం గమనించిన తోటి కూలీలు అక్కడి చేరుకొని 100డయల్ చేసి విషయం తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించి బాలుడి మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. రెండు రోజులుగా బాబు ఏడుస్తూ ఇబ్బంది పెట్టడంతో తన బార్య ఈదారుణానికి ఒడిగట్టినట్లు రాజేంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఏసిపి శంకర్‌రెడ్డి ఘటాస్థలిని పరిశీలించారు. కాగా బాలుడి హత్య ఘటన బయటకు పొక్కకుండా సెనెరెల్లి నిర్మాణ సంస్థ విశ్వప్రయత్నాలు చేయడంతో పాటు విషయం తెలుసుకొని అక్కడి చేరుకున్న మీడియా ప్రతినిధులను సైతం లోనికి రాకుండా అడ్డుకున్నారు. విషయం బయటకు తెలిస్తే తమ నిర్మాణ సంస్థకు సంబంధించి విక్రయాలపై ప్రభావం పడుతుందని సంస్థ ప్రతినిధులు పేర్కోనట్లు తెలుస్తుంది.

### బతుకుతానో.. లేదో!
## ఎవరైనా చంపేస్తారేమో!

>> పట్టుకుని ఎంతమంది వేచి చూస్తున్నారో చూశారుగా అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకులకే ఇలాంటి ముప్పు ఉంటుందని, అబ్రహం లింకన్, కెన్నడీ వంటి ప్రభావశీల్ల అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని ఆయన గుర్తుచేశారు. బహుశా నేను కొంచెం తక్కువ ప్రభావశీల నాయకుడిగా ఉంటే బాగుండేదేమో కాసేపు సాధారణ అధ్యక్షుడిలా ఉందామని చమత్కరించారు. ఈనెల 22 తెల్లవారుజామున 1:30 గంటల ప్రాంతంలో ఆస్టిన్ టక్కర్ మార్టిన్ (21) అనే యువకుడు షాట్ గన్, ఇంధనం క్యాన్‌తో మార్‌ఎలాగో ప్రహరీని దాటేందుకు ప్రయత్నించాడు. భద్రతా దళాలు హెచ్చరించినప్పటికీ, అతడు లొంగకుండా తుపాకీని ఎక్కుపెట్టడంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మార్టిన్ అక్కడికక్కడే మరణించాడు. గతంలోనూ ట్రంప్ పై హత్యాయత్నం ఆ సమయంలో ట్రంప్ దంపతులు వైట్ హౌస్‌లో ఉన్నారు. గతంలో కూడా ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. తాజా ఘటనలో చనిపోయిన యువకుడు ఎప్ స్టీన్ ఫైల్స్ విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై అసహనంతో ఉన్నట్లు కొన్ని టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారా వెల్లడైంది.

## ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు జూన్ 2 తర్వాతే!

>> మేయర్,చైర్మన్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోగా, బీఆర్ఎస్ 18 స్థానాలతో సరిపెట్టుకుంది. అయితే బీజేపీ ఒక మేయర్,ఒక చైర్మన్ స్థానంలో విజయం సాధించింది. మరో 5చోట్ల స్వతంత్ర అభ్యర్థులు ఛైర్మన్లుగా ఎన్నికయ్యారు. ఈ రకంగా మున్సిపాలిటీ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్ జిల్లా పరిషత్ ఎన్నికల్లోనూ తన బలాన్ని నిరూపించేందుకు అడుగులు వేస్తోంది. కాగా, కేంద్రంలో రిజర్వేషన్ల అంశం తేలేందుకు మరింత సమయం పట్టేలా ఉంది. దీంతో జెడ్పీటీసీ,ఎంపిటీసీ ఎన్నికలు జూన్ 2 తర్వాతే ఉండవచ్చునని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 3 నుంచి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం (జూన్ 2) వరకు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని చర్చించినట్లు తెలిసింది. ప్రతి ప్రభుత్వ శాఖలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నివేదిక తయారు చేయాలని సూచించినట్లు తెలిసింది. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా ఈ కార్యక్రమాలు రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు పార్టీ వర్గాల సమాచారం. సీఎస్ రామకృష్ణారావు దీనిపై వివరాలను మంత్రివర్గానికి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నివేదికలను పరిశీలించి ఎలాంటి కార్యక్రమాలను ఏ రకంగా చేపట్టాలో అధ్యయనం చేయాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. రానున్న మంత్రివర్గ సమావేశానికి ఈ ఉపసంఘం నివేదికను తయారు చేసి ఇవ్వాలని సూచించనట్లు తెలిసింది.

## ఇక 'ఈజ్ ఆఫ్ డూయింగ్' 2.0

>> ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందుకే భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానినే నిర్మించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. పరిశ్రమలకు కేవలం అనుమతులు ఇచ్చే వ్యవస్థలా కాకుండా, వారితో కలిసి నడిచే భాగస్వామిగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రముఖ వైద్యులు డా.నాగేశ్వర్ రెడ్డి, ఫ్యాప్సీ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, స్కై రూట్ ఏరో స్పేస్ ప్రతినిధి పవన్, గ్రోత్ ఎక్స్ 2026 కన్వీనర్ పంకజ్ దివాన్ తదితరులు పాల్గొన్నారు.

## మరో రెండు రోజులు వర్షాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో వచ్చే రెండు రోజులు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ నెల 23న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం మంగళవారం ఉదయం అదే ప్రాంతంలో కొనసాగుతున్నది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో విస్తరించి ఉంది. ఇది దాదాపు తూర్పు వైపు కదులుతూ రాబోయే 24 గంటల్లో క్రమంగా బలహీనపడే అవకాశం ఉంది. అలాగే మరో ద్రోణి దక్షిణ అంతర కర్ణాటక నుండి మరాఠ్వాడ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. యానాంలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య, ఆగ్నేయం దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా తెలంగాణలో రాగల రెండు రోజుల వరకు చెదురుమదురు వర్షాలు పడే వీలుందని తెలిపింది.

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
### విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పిరియడ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 24:** తెలంగాణ రాష్ట్రంలో నేటి(బుధవారం) ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పిరియడ్ ఇచ్చినట్టు అధికారులు ప్రకటించారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. మార్చి 18 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. ఈ ఏడాది 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వారిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,07,949 మంది ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. వాటిలో 404 ప్రభుత్వ కళాశాలల్లో, 221 ప్రభుత్వ సెక్టార్ కాలేజీల్లో,, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో పాటు మరో 7 స్కూల్స్, ఇతర విద్యా సంస్థలున్నాయి. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించబోతున్నామని, ప్రతి సెంటర్‌పై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని కృష్ణ ఆదిత్య తెలిపారు. విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పిరియడ్ ఇచ్చామని.. అయినప్పటికీ విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా, అందరికీ హాల్ టికెట్లు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. హాల్ టికెట్లపై ప్రిన్సిపాల్స్ సంతకం అవసరం లేదని, ప్రిన్సిపాల్ సంతకం లేదని విద్యార్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించకుండా ఎవరినీ ఆపొద్దని కృష్ణ ఆదిత్య మంగళవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 75 మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 200 మంది సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసి పరీక్షలను పర్యవేక్షించనున్నారు. పరీక్షల నిర్వహణ కోసం విద్యుత్, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు కృష్ణాదిత్య తెలిపారు. విద్యార్థులు పరీక్షలను టెన్షన్ లేకుండా, ప్రశాంతంగా రాయాలని సూచించారు.

### వారం - వర్జ్యం

25-02-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
నవమి రా. 2.41
రోహిణి మ. 1.38
వర్జ్యం : సా. 6.54-8.24
దు. ఉ. 11.58-మ. 12.45
రాహుకాలం - మ. 12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** గృహములోని ఖర్చులను తగ్గించు టకు చేసే యత్నములు అనుకూలించవు. మిత్రులను కలుస్తారు. శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** మీతో విభేదించిన సోదర, సోదరీ వర్గీయుల నుండి, సన్నిహితుల నుండి వినూత్న రీతిలో రాజీ యత్నములు వస్తాయి.

**మిథునం:** సంతానము మీ అభిప్రాయములతో ఏకీభవించడం మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. వాహనయోగం.

**కర్కాటకం :** ఇతరులు మీకు ఇచ్చిన మాటను నిలుపుకోరు. అవకాశవాదులుగా ప్రవర్తిస్తారు. ఆత్మీయుల నుండి శుభవార్తలు.

**సింహం:** మీ కార్యక్రమములకు, సంతానము యొక్క అభివృద్ధికి ఆటంకములను కల్పించే యత్నములు జరుగుతాయి.

**కన్య :** ముఖ్యముగా మీ ప్రతిష్ఠను దెబ్బతీసే యత్నములు అధికము కావచ్చును. ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుంది.

**తుల :** ప్రయోజనములు తాత్కాలికముగా మీ చేతికి అందకపోయినా ఉనికికి మాత్రం ముప్పు లేదు. నూతన విద్యావకాశాలు కలవు.

**వృశ్చికం:** శుభకార్యాలు పురోభివృద్ధి దిశలో ఉంటాయి. కోర్టు వివాదాలు వాయిదా పడతాయి. శ్రేయోభిలాషులను కలుస్తారు.

**ధనుస్సు:** విద్యా వాణిజ్య రంగములో, ఆర్థిక విషయములలో ప్రోత్సాహకర వాతావరణము సమకూరుతుంది.

**మకరం:** విరాళములు, చందాలు, ఋణములు వీటి విషయములలో ఒత్తిడి రావచ్చు. కొనుగోళ్ళ విషయంలో జాగ్రత్త.

**కుంభం:** సమాచారము తెలుసుకుంటారు. వత్తిడి వలన కొన్ని విషయాలు మరుపునకు లోనవుతాయి. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం :** ఇ-మెయిల్స్‌లను సకాలంలో చూసుకోవడం మరువకండి. ఉన్నత ఉద్యోగ అవకాశం లభిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మావోయిస్టులకు గట్టి దెబ్బ

>> సమస్యలపై పోరాటం చేస్తానని తెలపగా ప్ర జల కోసం నిరంతరం పనిచేస్తానని, అయితే మా వోయిజం ఎప్పటికీ అంతరించదని రాజిరెడ్డి వెల్లడించారు. తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతూనేవున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 31 మంది లొంగిపోగా తాజాగా నలుగురు అగ్రనేతలు లొంగిపోయారు. వీరిలో పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా ప్రచారం జరిగిన సెంట్రల్ మిలటరీ కమిషన్ అధినేత తిపిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, ఊరఫ్ రమేష్, ఊరఫ్ సంజీవ్, ఊరప్ చేతన్ వున్నారు. మావోయిస్టు ఉద్యమంలో నాలుగున్నర దశాబ్దాలుగా వున్న దేవ్ జీ స్వగ్రామం జగిత్యాల జిల్లా కోరుట్ల. విద్యార్థి దశలో రాడికల్ విద్యార్థి విభాగంలో చేరిన దేవ్ జీ 1982లో పీపుల్స్ వార్‌లో చేరారు. 1984లో గణ పతి సూచనల మేరకు రాజిరెడ్డితో కలిసి సాయుధ దళంలో పనిచేసేందుకు దండకారణ్యంలో వెళ్లారు. 1984 నుంచి 1987 వరకు ఛత్తీస్‌ఘడ్‌లోని సిరోంచా సాయుధ బలగం కమాండర్‌గా, 1987 నుంచి 1989 వరకు పెరిమిలి దళ కమాండర్‌గా పనిచేశాక గడ్చిరోలి డివిజనల్ కమిటీలో చేరారు . 1993 నుంచి 1995 వరకు అదే కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం స్పెషల్ జోనలఖ కమిటీ సభ్యుడుగా పదోన్నతి ఇచ్చి బండారా డివిజన్‌కు ఇంఛార్జిగా నియమించారు. 2001లో పార్టీ సెంట్రల్ మిలటరీ కమిషన్ సభ్యుడుగా నియమితులువగా 2017 వరకు అందులో కొనసా గి అనంతరం పొలిట్ బ్యూరో సభ్యుడుగా పదోన్నతి పొందారు. మల్లోజుల వేణుగోపాల్ రావు లొంగిపోయాక కొంతకాలం అధికార ప్రతినిధిగా పని చేసి, అనంతరం మిలటరీ కమిషన్ అధిపతిగా ఎంపికయ్యారు. పార్టీ చీఫ్ నంబాల కేశవ రావు అలియాస్ బసవరాజ్ పోలీసు కాల్పుల్లో చనిపోయాక ఆ స్థానంలో దేవ్‌జీ ఎంపిక కావాల్సి వుండగా కేంద్ర కమిటీ సమావేశం జరగలేదు. దేవ్‌జీతో పాటు లొంగిపోయిన రాజిరెడ్డి అలియాస్ సంగ్రాం మంథని స్వగ్రామం. ఐదు దశాబ్దాలకు పైగా మావోయిస్టు పార్టీ ఉద్యమంలో వున్న రాజిరెడ్డి 1971లో ఆర్ఎస్‌యులో చేరారు. ఈ క్రమంలో 1976లో అరెస్టు చేయగా ఏడాది తరువాత విడుదలై బొగ్గుగనుల ప్రాంతంలో మావోయిస్టు పార్టీ ఆర్గనైజర్‌గా పనిచేశారు. 1981లో గడ్చిరోలి డివిజన్ కార్యద ర్శిగా, 1985లో అక్కడే పదోన్నతి పొందారు. 1987లో రాష్ట్ర కమిటీ సభ్యుడుగా పదోన్నతి ఇచ్చి అటవీ శాఖ కార్యదర్శిగా, దండకారణ్య కమిటీ కార్యదర్శిగా నియమించారు. 1990లో సెంట్రల్ కమిటీ సభ్యుడుగా దండకారణ్య కమిటీకి మార్గనిర్దేశకుడిగా నియమించారు. 2001లో సౌత్, వెస్ట్ రీజనల్ బ్యూరో అధిపతిగా, 2007లో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడుగా 2010 నుంచి 2016 వరకు ఛత్తీస్‌ఘడ్, ఒడిషా స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా 2022లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధిపతిగా నియమించారు. బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ములుగు జిల్లా తాడ్వాయి స్వగ్రామం. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా వున్నారు. మూడున్నర దశాబ్దాలుగా పార్టీలో వున్న దామోదర్ 1991 నుంచి పార్టీలో చురుకైన కార్యకర్తగా వున్నారు. అనేక హోదాలో పనిచేశాక 2000లో ఏటూరు నాగారం డిప్యూటీ కమాండర్‌గా 2001లా కొత్తగూడెం, పాల్వంచ దళం కమాండర్‌గా, 2005లో ఏటూరు నాగారం, మహాదేవ్‌పూర్ ఏరియా కమిటీ కార్యదర్శిగా నియమించారు. ఆ తరువాత మరికొన్ని చోట్ల పని చేశాక 2019లో రాష్ట్ర కమిటీ ఇంఛార్జిగా నియమించారు. 2025లో పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించారు. నూనె నరసింహా రెడ్డి అలియాస్ గం గన్న పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ఒకటవ బెటాలియన్ కమిటీ సభ్యుడుగా వున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన గంగన్న 1994 నుంచి పార్టీ లో అనేక హోదాలో పనిచేశారు. 2025 నుంచి తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా వున్నారు. కాగా లొంగిపోయిన నలుగురు అగ్ర నేతలకు పున రావాసం కింద వున్న రివార్డులను డిజిపి శివధర్ రెడ్డి అందించారు.

**రాజకీయాల్లో వస్తా: దేవ్‌జీ**

కాగా లొంగిపోయిన సందర్భంగా దేవ్‌జీ మాట్లాడుతూ అనారోగ్య కారణాల వల్ల తాను లొంగిపోయానని, అజ్ఞాత జీవితం వదిలి జనజీవన స్రవంతిలోకి వచ్చానని తెలిపారు. తన తదుపరి లక్ష్యం రాజకీయాల్లో రావమమేనని, ఈ సందదర్భంగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపా రు. ఇంతకు మించి ఏమి మాట్లాడినా అపార్థాలకు, అనర్థాలకు దారితీసే ప్రమాదం వుందని ఆయన తెలిపారు. త్వరలో మరిన్ని విషయాలను వె ల్లడిస్తానని ఆయన తెలిపారు. ఆయనతో పాటు లొంగిపోయిన రాజిరెడ్డి మాట్లాడుతూ మావోయిజం ఎప్పటికీ అంతరించదని పేర్కొన్నారు. మారిన పరిస్థితుల్లో తాము లొంగిపోయామని, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా మారలేక పోవడం కూడా ఒక కారణమని ఆయన తెలిపారు. అయితే ఇక ముందు ప్రజల సమస్యలపై చట్టపరంగా నిరంతరం పోరాటం చేస్తానని ఆయన వెల్లడించారు.

**మిగిలిన వారు కూడా లొంగిపోవాలి: డిజిపి శివధర్ రెడ్డి**

మావోయిస్టు పార్టీకి సాయుధ పోరాటానికి కాలం చెల్లిందని ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు. ఆ పార్టీకి ప్రస్తుతం నాయకుడు అం టూ ఎవరూ లేరని, నక్సలైట్లు ఆయుధాలు పట్టుకుని అడ వుల్లో వుండడం కన్నా జనంలో వచ్చి ప్రభుత్వ అభివృద్ధిలో భాగస్వాములు కావడం మంచిదని ఆయన కోరారు. 2024 నుంచి తెలంగాణలో 591 మంది నక్సలెట్లు లొంగిపోయారని, వీరిలో కేంద్ర కమిటీ సభ్యులు నలుగురు రాష్ట్ర క మిటీ సభ్యులు 16 మంది, డివిజనల్ కమిటీ కార్యదర్శులు 26 మంది, ఎసిఎంలు 85 మంది సాధారణ సభ్యులు 460 వున్నారని ఆయన తెలిపారు. నక్సలైట్లు ఇంత భారీ సంఖ్యలో లొంగిపోవడం వెనుక పోలీసులసమిష్టి వ్యూహం, ప్రభుత్వ ప్రోత్సాహం వుందని ఆయన తెలిపారు. ఇది మావోయిస్టులపై పోలీసుల విజయంగా డిజిపి తెలిపారు. మావోయిస్టు పార్టీలో జాతీయ స్థాయిలో అజ్ఞాత కేడర్‌లో వున్న వారు తెలంగాణకు చెం దిన వారు 12 మంది వున్నారని డిజిపి తెలిపారు. వీరు కూడా జనంలోకి రావాలని ఆయన ఈ సందర్బంగా కోరారు. లొంగిపోయిన వారికి రివా ర్డులు ఇవ్వడంతో పాటు సాధారణ జీవితం గడిపేందుకు అవకాశం కల్పిస్తామని, వారిపై ఎలాంటి కేసులు వుండకుండా చూస్తామని ఆయన తెలిపా రు. మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి ఎక్కడ వున్నార నే దానిపై డిజిపి మాట్లాడుతూ ఆయన అడవుల్లో లేరని, ఎక్కడో షెల్టర్ జోన్‌లో వున్నా రని, ఆరోగ్యం కూడా అంతగా బాగాలేదని సమాచారం వుం దని తెలిపారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజిపి మ హేష్ భగవత్, ఇంటెలిజెన్స్ అదనపు డిజి విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజి సుమతి తదితరులు పాల్గొన్నారు.



గువహతిలో రాజ్ భవన్ ముందు 'ఛత్ర హుంకార్' పేరుతో జరిగిన నిరసన కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

### అంబర్‌పేటలో విషాదం:
## ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య
### ఉరి వేసుకుని భార్యాభర్త, మణికట్టు కోసుకుని కొడుకు బలవన్మరణం
### హోటల్ నిర్వహణలో నష్టాలతో అప్పులపాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆర్థిక ఇబ్బందులే ఈ ఘోర నిర్ణయానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. మృతులను రామరాజు (55), ఆయన భార్య మాధవి (50), వారి కుమారుడు శశాంక్ (24) గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. రామరాజు స్థానికంగా బిర్యాని హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో రామరాజు అప్పుల పాలయ్యారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రామరాజు ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. తలుపులు తెరిపించి చూడగా లోపల ముగ్గురూ విగతజీవులుగా కనిపించారు. రామరాజు, మాధవి ఉరివేసుకుని ప్రాణాలు తీసుకోగా, శశాంక్ తన మణికట్టు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల భారం పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై కుటుంబమంతా ఈ విపరీత నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. కేసు నమోదు చేసి ఆర్థిక లావాదేవీల కోణంలో విచారణ జరుపుతున్నారు. 'ఆర్థిక భారం కారణంగా సూసైడ్ చేసుకుంటున్నామని సూసైడ్ నోట్‌లో స్పష్టంగా రాశారు. తెల్లవారు 3.15 గంటలకు రవి అనే మిత్రుడికి రామ్‌రాజ్ వాట్సాప్‌లో మెసేజ్ చేశారు. వెంటనే రవి అంబర్‌పేటలోని తన మిత్రుడు రామ్‌రాజ్ ఇంటికి వచ్చి చూసేసరికి భార్యాభర్తలు ఇద్దరు హాంగింగ్లో కనిపించారు. వెంటనే 100 డైల్‌కి కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా మొదటగా భార్య సూసైడ్ చేసుకోగా తర్వాత భర్త రామరాజు ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోయాడని ఆ తర్వాత కొడుకు శశాంక్ చేతిని కత్తితో కోసుకుని తీవ్ర రక్తంతో చనిపోయాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అడిషనల్ డిసిపి నరసయ్య తెలిపారు.

# సంక్షేమ పథకాలకు ఎఐ
## అక్రమాలు, అనర్హులకు చెక్
### ఒకే ఫ్లాట్‌ఫాంపైకి శాఖల డేటా బేస్.. రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇప్పుడు అన్ని రంగాలలోనూ తనదైన ప్రభావాన్ని చూపిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు కోసం కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించాలని కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేయడం కోసం, నిజమైన లబ్ధిదారులకు అందించడం కోసం ఈ సాంకేతికతను వినియోగించాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. 16వ ఆర్థిక సంఘం నివేదికలు, అలాగే రాష్ట్ర ప్రభుత్వ సామాజిక తనిఖీలలో అనర్హులకు పెద్ద ఎత్తున పథకాలు అందుతున్నట్లు స్పష్టంగా వెల్లడైన నేపథ్యంలో సంక్షేమ పథకాలను అందించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఉపయోగిస్తే ఫలితం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల కాలంలో ఏకంగా ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ వివరాలను దాచిపెట్టి సంక్షేమ పథకాలను పొందుతున్నట్టు బయటపడడంతో ఈ వ్యవహారం అధికార యంత్రాంగాన్ని ఆందోళనకు గురిచేస్తుంది. ఏఐతో లబ్దిదారుల తనిఖీ ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసి నిజమైన అర్హులకు మాత్రమే పథకాలను అందజేయాలని భావిస్తున్న తెలంగాణ సర్కార్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా లబ్ధిదారుల జాబితాలను నిరంతరం అప్డేట్ చేయడం, నకిలీ ఎంట్రీలను తొలగించడం ఇతర ప్రభుత్వ విభాగాల డేటాతో అనుసంధానం చేసి లబ్ధిదారుడా కాదా అన్న వివరాలను గుర్తించడం చేయనుంది. ప్రభుత్వం నిర్ణయం ఈ సరికొత్త విధానం పైన సాంకేతిక సహకారం, విధివిధానాల రూపకల్పన కోసం వివిధ విభాగాల ఉన్నతాధికారులు ఇప్పటికే రాష్ట్ర ఐటీ శాఖతో ప్రాథమిక సంప్రదింపులు జరిపారు. ఢిల్లీలో జరిగిన ఈ సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పథకాల అమలు కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అధికారికంగా వినియోగించాలని నిర్ణయించారు. ఏఐ ఆల్గారిథమ్ లతో రెవిన్యూ, మున్సిపల్, వైద్య, పంచాయతీరాజ్, సివిల్ సప్లై సహా అన్ని శాఖల డేటాబేస్ అన్నింటిని ఒకే ప్లాట్‌ఫారం పైకి తీసుకుని వచ్చి అనుసంధానం చేయనున్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల జోక్యం లేకుండా పూర్తిగా అర్హత ఆధారంగానే లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా ఏఐ తో చెయ్యొచ్చని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.

## పోక్సో కేసులో నిందితుడికి 20 యేళ్ల జైలుశిక్ష

**గుంటూరు ఫిబ్రవరి 24, ప్రభాతవార్త ప్రతినిధి:** మైనర్ బాలికను మోసగించి అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో న్యాయస్థానం తీర్పు చెప్పింది. వివరాల్లోకి వెళితే 2021వ సంవత్సరంలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం, పోలకంపాడు గ్రామానికి చెందిన బాధితురాలు బిటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ క్రమంలో ఆమెకు దగ్గర నివాసి, అదే పోలకం పాడు గ్రామానికి చెందిన ఆరోగ్యస్వామి అజ య్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో వేధించడంతో పాటు బలవంతంగా ఆమె మెడలో తాళి కట్టాడు. అనంతరం ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని ఆమె తన కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గుంటూరు మహిళా పోలీస్‌స్టేషన్ లో బాలికపై లైంగిక దాడి, బాల్య వివాహానికి సంబంధించి కేసు నమొదయ్యింది. అప్పటి మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ రవికుమార్ కేసు దర్యాప్తు చేసి ఆధారాలను న్యాయస్థానానికి నివేదించారు. ప్రభుత్వ న్యాయవాది టి.దుర్గా ప్రసాద్ ప్రాసి క్యూషన్ తరపున వాదనలు వినిపించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి మహమ్మద్ పర్వీన్ సుల్తానా బేగం నిందితు డిని దోషిగా తేల్చి శిక్షలు ఖరారు చేశారు. మహిళలు, చిన్నారుల రక్షణ,భద్రతకు గుం టూరు జిల్లా పోలీస్‌శాఖ విశేష కృషి చేస్తుందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి తమపై జరిగిన, జరుగుతున్న నేరాల గురించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## శ్రీకాకుళంలో డయేరియా.. ఒకరు మృతి
### కలుషిత నీరే కారణం?

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** శ్రీకాకు ళంలోని దమ్మలవీధి, గోల్కొండరేవు రోడ్డు, మంగువారితోట, కాకివీధి, తదితర ప్రాంతా ల్లో సోమవారం ఒక్కరోజే 30కి పైగా డయేరియా కేసులు నమోదయ్యాయి. స్థాని కంగా ఉన్న వైద్యులు వండాన శిమ్మన్న చాలా మందికి హుటాహుటిన ప్రథమ చికి త్స అందించారు. ఈ విషయం బయటకు పొక్కడంతో సోమవారం సాయంత్రం కలె క్టర్, కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు అతిసారం ప్రబలిన ప్రాంతంలో పర్యటిం చారు. అక్కడ అస్థవ్యస్థంగా ఉన్న పారిశు ద్ధ్యాన్ని ఆగమేఘాల మీద చక్కదిద్దారు. ట్యాంకర్లతో మంచినీటిని రప్పించి వాటినే తాగాలని సూచించారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో అతిసారం ప్రబలిన నేపథ్యంలో మంగువారితోటకు చెందిన వ్యక్తి (42) అతిసారంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం కన్నుమూశాడు. అతిసారం ప్రబలిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అత్యంత అధ్వాన్నంగా ఉంది. ముఖ్యంగా గోల్కొండరేవు ప్రాంతంలో ప్రధాన రహదారిపైనే చెత్త నిత్యం కనిపిస్తూ ఉంటుంది. స్థానికులు చాలాసార్లు దీనిపై అధికారులకు విన్నవించినా ఫలి తం లేకపోయింది. సోమవారం రాత్రి కలెక్టర్, కమిషనర్ ఆ ప్రాంతంలో పర్యటించి పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సిబ్బంది వెంటనే చెత్తను తొలగించారు. అలాగే ఆ ప్రాంతంలో ఓ వ్యక్తి తన ఇంటిలోనే వాటర్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నాడు. చెత్తా చెదారం కలిసిన నీటిని ఆ ఏరియాలో అందరికీ విక్రయిస్తున్నాడు. అతడి వద్ద కొనుగోలు చేసిన నీటిని తాగడం వల్లే అతిసారం ప్రబలిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**నివారణకు పూర్తి స్థాయి చర్యలు : ఎమ్మెల్యే గొండు శంకర్**

శ్రీకాకుళం నగరంలోని గోల్కొండ రేవు, దమ్మల వీధి తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా అతిసార (డయేరియా) వ్యాధి ప్రబలడం పట్ల స్థానిక ఎమ్మెల్యేగా నేను పరిస్థితులను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాను. ఈ ఊహించని పరిణామంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికార యంత్రాంగానికి తక్షణ దిశానిర్దేశం చేశారు. మంత్రులిద్దరి మార్గదర్శకత్వంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నగరపాలక సంస్థ కమిషనర్ కూర్మనాథ్‌తో నిరంతరం సమన్వయం చేసుకుంటూ అధికారులను అప్రమత్తం చేసి నివారణా చర్యలను వేగవంతం చేసినట్లు తెలిపారు.

# వరంగల్ విమానాశ్రయానికి జూన్‌లో శంకుస్థాపన

### విమానయాన ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు

### వరంగల్, ఆదిలాబాద్, పెద్దపల్లితోపాటు పలు ప్రాజెక్టులపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** వరంగల్ విమానాశ్రయానికి మొత్తం 953 ఎకరాల భూమి అందుబాటులోకి వచ్చినట్లు, దీంతో 2500 మీటర్ల రన్‌వే నిర్మాణం చేపట్టనున్నట్లు 2026 జూన్ నెలలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించేలా కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో విమానయాన ప్రాజెక్టులపై న్యూఢిల్లీలోని రాజీవ్‌గాంధీభవన్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రం లోని విమానాశ్రయాల అభివృద్ధిపై పౌర విమానయాన శాఖ కార్యదర్శి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్‌తో సమగ్రంగా చర్చించారు. రాష్ట్రంలోని వివిధ విమానాశ్రయ ప్రాజెక్టుల పురోగతిని ఇద్దరు మంత్రులు సంయుక్తంగా సమీక్షించారు. ఈ సందర్భంగా వరంగల్, ఆదిలాబాద్, పెద్దపల్లి సహా తెలంగాణలో ప్రతిపాదిత, పనులు జరుగుతున్న విమానాశ్రయ ప్రాజెక్టులపై విస్తృతచర్చ జరిగింది. ప్రాజెక్టుల వేగవంతమైన అమలుకు అవసరమైన చర్యలు, కేంద్రరాష్ట్రాల మధ్య సమన్వయం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా వేగంగా పూర్తయ్యేలా సమయానుగుణంగా సమీక్ష నిర్వహించాలని ఇద్దరు మంత్రులు నిర్ణయించారు. ఏవైనా పరిపాలనా పరమైన, సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తినట్లయితే వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆదిలాబాద్‌లో విమానాశ్రయం కోసం భూసేకరణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని, అయితే రన్‌వే నిర్మాణానికి రక్షణ మంత్రిత్వ శాఖ (కేంద్రప్రభుత్వం) పరిధిలో ఉన్న ప్రస్తుత భూమిని వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. విమానాశ్రయాన్ని జస్ట్ యూసేజ్ విధానంలో ఉపయోగించే అంశంపై కేంద్రం పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖలు విధి విధానాలను ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు. పెద్దపల్లిలో విమానాశ్రయం కోసం 980 ఎకరాల భూమిని గుర్తించామని, దీనికి సంబంధించిన ఫీజిబిలిటీ స్టడీ కూడా జరుగుతున్నట్లు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో విమాన రవాణా అనుసంధానతను పెంచడం, పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధికి బాటలువేయడం తద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా ఈ విమానాశ్రయ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమానాశ్రయ మౌలిక వసతుల అభివృద్ధికి సంపూర్ణ మద్దతు అందించేందుకు కట్టుబడి ఉందని ఇద్దరు కేంద్రమంత్రులు స్పష్టం చేశారు.



భాగ్యలక్ష్మి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, కరీంనగర్ మేయర్ కె.శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై.సునీల్‌రావు

# పవర్ ఫైనాన్స్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ విలీనం

### అధ్యయనానికి ఉన్నతస్థాయి కమిటీ

### పర్యవేక్షణకు వర్కింగ్ గ్రూప్‌ల ఏర్పాటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌ల విలీనానికి కేంద్రం సిద్ధమవుతోంది. ఈ రెండు సంస్థలను విలీనం చేసే ప్రక్రియను పర్యవేక్షించడానికి, విధి విధానాలను అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని, అలాగే ఒక వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేసింది. వర్కింగ్ గ్రూప్ ఈ విషయాన్ని పరిశీలించి దాని సిఫార్సులను సమర్పిస్తుందని, కమిటీ విలీనం పురోగతిని పర్యవేక్షిస్తుందని విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ కమిటీలో ప్రభుత్వ యాజ మాన్యం లోని రుణ దాతల చైర్మన్, మేనేజింగ్ డైరెక్ట ర్లు, విద్యుత్ మంత్రిత్వ శాఖలో పంపిణీ కోసం జాయింట్ సెక్రటరీ ఉంటారు. వర్కింగ్ గ్రూపులో రెండు కంపెనీల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, అలాగే విద్యుత్ మంత్రిత్వ శాఖలో పంపిణీ డైరెక్టర్ ఉన్నారు. ఈ బృందం సిబ్బంది ఏకీకరణ, కార్పొ రేట్, క్రియాత్మక పునర్నిర్మాణం, సాంకేతిక ఏకీకరణ, వాటాదారుల ప్రయోజనాలను సమన్వయం చేయడం వంటి వాటిపై తన సిఫార్సులను అంది స్తుంది. ఈ బృందం కనీసం వారానికి ఒకసారి సమావేశమై ఉన్నతస్థాయి ప్యానెల్‌కు తన అభిప్రాయాలను తెలియచేసే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ప్యానెల్ విషయానికొస్తే, విలీనం సజావుగా సాగేలా వివిధ అంశాలపై సమీక్షించడానికి ప్రతివారానికి ఒకసారి కూడా సమా వేశం అవుతుందని తెలియచేశారు. కాగా నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు భారతదేశ విద్యుత్ రంగానికి కీలకమైన ఆర్థిక వేత్తలు, ఉత్పత్తి, ప్రసార, పంపిణీ ప్రాజెక్టులకు దీర్ఘకాలిక నిధులను అందిస్తాయి.

# హిందూ సమాజాన్ని ముక్కలు చేయటానికి యత్నాలు

### ఆలయాలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వం : కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్ (చార్మినార్), ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** పాతనగరం హిందు వులకు చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మీ అమ్మవారు రక్షణగా నిలుస్తున్నారని, అమ్మవారి ఆశీస్సులతోనే కరీంనగర్ మేయర్ పీఠాన్ని బిజెపి కైవసం చేసు కుందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో విజయం సాధించిన కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి మంగళవారం ఆయన చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మీ మంది రాన్ని సందర్శించారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్, కరీంనగర్ మేయర్ కె.శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై.సునీల్‌రావుతోపాటు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు మందిరంలో అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ పాతబస్తీలో ఎంఐఎం ఆరాచకాలు, కుట్రలు వల్లనే హిందువులు ఇక్కడ నుంచి వెళ్లి పోతున్నారని,పాతనగరం హిందువులకు చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారు రక్షణగా ఉంటున్నారని తెలిపారు. ప్రజా సంగ్రామ యాత్ర చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మీ అమ్మ వారి ఆశీస్సులతో ప్రారంభించానని, అప్పటి ప్రభుత్వం, పోలీసులు ఎన్ని అడ్డంకులు పెట్టిన భయపడకుండా 1,640 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేశామని ఆయన గుర్తు చేశారు. ఎంఐఎం కోసమే జిహెచ్‌ఎంసిని కాంగ్రెస్ ప్రభుత్వం మూడు కార్పొరేషన్లు చేసిందన్నారు. సికిందరాబాద్, బంజారాహిల్స్, సంతోష్‌నగర్, శంషాబాద్, చాంద్రాయణగుట్ట దేవాలయాలపై దాడులు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆయన విమర్శించారు. హిందూ సమాజాన్ని ముక్కలు చేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, హిందువులలో చైతన్యం రావాలన్నారు.

# నకిలీ విద్యుత్ కేబుళ్ల తయారీ

### రూ.5 లక్షల విలువైన వైర్లు, కేబుళ్లు స్వాధీనం

### భారతీయ ప్రమాణాల బ్యూరో తనిఖీలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నకిలీ విద్యుత్ కేబుళ్లు తయారవుతున్నాయి. ఎటువంటి అధికారిక పత్రాలు, గుర్తింపు లేకపోయినప్పటికీ ఐఎస్ఐ మార్కుతో విద్యుత్ వైర్లు, కేబుళ్లు తయారు చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఓ పరిశ్రమలో భారతీయ ప్రమాణాల బ్యూరో (బిఐఎస్) అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. చర్లపల్లి పారిశ్రామిక వాడలో ఉన్న ఓ పరిశ్రమలో కొన్నేళ్లుగా బీఐఎస్ అనుమతి లేకుండా కేబుళ్లను తయారీ చేయడంతో పాటు, నకిలీ ఐఎస్ఐ ముద్రలు, లైసెన్సు నెంబర్లతో ఉత్పత్తులు సరఫరా చేస్తున్నారన్న సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. బీఐఎస్ డైరెక్టర్ తన్నీరు రాకేశ్ నేతృత్వంలోని అధికారుల బృందం చేసిన ఈ తనిఖీల్లో వివిధ బ్రాండ్లకు చెందిన 200కు పైగా పీవీసీ ఇన్సులేటెడ్ విద్యుత్ వైర్లు, కేబుళ్లు నకిలీ ఐఎస్ఐ మార్క్‌తో నిల్వ ఉంచి విక్రయానికి సిద్ధం చేసినట్లు గుర్తించారు. గృహ వినియోగానికి సంబంధించిన విద్యుత్ ఉత్పత్తులన్నీ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ల పరిధిలోకి వస్తాయి. వీటన్నింటికీ బీఐఎస్ అనుమతి, ఐఎస్ఐ మార్కు తప్పనిసరి.



అయితే, సంబంధిత పరిశ్రమ నిర్వాహకులు బీఐఎస్ నుంచి ఎలాంటి అనుమ తులు పొందకుండానే నకిలీ ఐఎస్ఐ మార్కు, లైసెన్సు నెంబరును వినియోగించి బీఐఎస్ చట్టం 2016లోని సెక్షన్ 17ను ఉల్లంఘించినట్లు అధికారులు పేర్కొన్నారు. నకిలీ ఐఎస్ఐ ముద్ర ఉన్న డబ్బాలతో పాటు, రూ.5లక్షల విలువైన కేబుళ్లనూ జప్తు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ల పరిధిలోకి వచ్చే ఉత్పత్తులను బీఐఎస్ ధృవీకరణ లేకుండా తయారు చేయడం, దిగుమతి చేసుకోవడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం నిషేధం. ఇందులో తొలి ఉల్లంఘనకు రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా కనీసం రూ.2 లక్షల జరిమానా, తదుపరి ఉల్లంఘనలకు కనీసం రూ.5 లక్షల జరిమానా లేదా వస్తువుల విలువకు పదిరెట్ల వరకూ జరిమానా విధించే అవకాశం ఉందని, నిందితులపై చట్టపరమైన చర్యలు చేపడతామని అధికారులు స్పష్టం చేశారు.

# టెన్త్ విద్యార్థుల హాల్‌టికెట్లపై క్యుఆర్ కోడ్

### రిజిస్టర్డ్ ఫోన్‌నంబర్లకు డౌన్‌లోడ్ లింక్

### పరీక్షలకు హాజరుకానున్న 5.28 లక్షల మంది విద్యార్థులు

### మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు

### పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్‌నికోలస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులకు జారీ చేసే హాల్ టికెట్లను క్యూఆర్ కోడ్‌తో జారీ చేయనున్నట్టు పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. మొదటిసారిగా విద్యార్థుల రిజిస్టర్డ్ మొబైల్ (వ్యాట్సాప్)నంబర్లకు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి లింక్‌ను పంపించనున్నారు. ఈ నెలాఖరు నుంచి హాల్ టికెట్లను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడంతో వారి పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చని.. వారికి ఎంత దూరంలో ఉందో కూడా తెలుస్తుందన్నారు. తద్వారా వారు ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ముందుగానే ప్లాన్ చేసుకునే వెలుసుబాటు కలుగుతుందన్నారు. అలాగే మొదటిసారిగా విద్యార్థులు సమర్పించిన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు విద్యార్థుల హాల్ టికెట్ల లింక్‌ను పంపించనున్నారు. వారు నేరుగా నెట్ సెంటర్లకు వెళ్లి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఎస్ఎస్‌సి పరీక్షలకు 5,28,248 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. వారిలో రెగ్యులర్ విద్యార్థులు 5,17,727 మంది విద్యార్థులు కాగా.. 10,521 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరు కానున్నారు. వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 1582 ప్రభుత్వ స్కూల్స్ ఉండగా.. 1094 స్కూల్స్ ప్రైవేటు స్కూల్స్ ఉన్నాయి. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 4.70 లక్షల మంది ఉండగా.. తెలుగు మీడియం వారు 44,881 మంది ఉన్నారు. 3720 మంది ఉర్దూ మీడియం విద్యార్థులున్నారు. ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.

# కోఠి కాల్పుల కేసులో ఇద్దరు అంతర్రాష్ట్ర నేరగాళ్ల అరెస్టు

### నగదు, తూటాలు, తుపాకి జప్తు



కోఠి ఎస్‌బిఐ ఎటిఎం వద్ద కాల్పులు, నగదు లూటీ ఘటనలో అరెస్టయిన నేరగాళ్ల నుంచి జప్తు చేసిన నగదు, తుపాకి, తూటాలను మీడియాకు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్‌గైక్వాడ్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో గత నెల 31వ తేదీన ఉదయం ఏడు గంటల సమయంలో ఎటిఎంలో ఆరు లక్షల రూపాయల నగదును డిపాజిట్ చేసేందుకు వచ్చిన వ్యక్తిపై కాల్పులు జరిపి, నగదును దోచుకున్న ఘటనలో ఇద్దరు అంతరాష్ట్ర నేరగాళ్లను టాస్క్‌ఫోర్స్, ఖైరతాబాద్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 2.38 లక్షల రూపాయల నగదు, ఒక తుపాకి, 35 తూటాలు, రెండు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. ఈ కేసులో మరో ఐదుగురు నేరగాళ్లు పరారీలో వున్నారు. అరెస్టయిన ఇద్దరిపై యుపిలో పలు కేసులు న్నాయి. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్, ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి మంగళవారం మీడియాకు వెల్లడించారు. యుపికి చెందిన మహమ్మద్ తయ్యబ్ త్యాగి 2024లో పొట్టకూటి కోస డ్రైవర్‌గా పనిచేసేందుకు హైదరాబాద్‌కు వచ్చి చాంద్రాయణగుట్టలోని షాహీన్‌నగర్‌లో వుంటూ ఊబర్, ఓలా కార్లు నడుపు తున్నాడు. ఈ సమయంలో ఉదయం వేళ నగరంలోని అనేక ఎటిఎంలలో పలువురు లక్షల రూపాయలు డిపాజిట్ చేస్తున్న విషయం గమనించాడు. నేర ప్రవృత్తి కలిగిన ఇతను ఆర్థికంగా చితికిపోయి వుండడంతో ఎలాగైనా ఏదైనా ఎటిఎం వద్ద లూటీచేసి పెద్ద మొత్తంలో నగదును దోచుకోవాలని పథకం పన్నాడు. ఇందుకుగానూ యుపిలోనే గల తన బంధువులు నౌషద్, డానిష్ త్యాగిల తో మాట్లాడాడు.

ఈ క్రమంలో నౌషద్ తనకు తెలిసిన నేరగాళ్లు ఫుర్కాన్ అహ్మద్, అబిద్, ఫహీం అహ్మద్‌లతో మాట్లాడించి హైదరాబాద్‌లో భారీ దోపిడికి పథకం పన్నాడు. దీని తరువాత గత నెలాఖరున వీరంతా తుపాకులు, తూటాలతో హైదరాబాద్‌లో దిగారు. అనంతరం జనవరి 31వ తేదీ న ఉదయం ఆరు గంటల సమయంలో తయ్యబ్ త్యాగి, అబిద్ నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద వుండి ఎటిఎంలను గమనించసాగారు. ఇదే సమయం లో ఫుర్కాన్ అహ్మద్ (36), ఫహీం అహ్మద్ (30)లు కోఠిలోని బ్యాంక్ స్ట్రీట్‌లో గల ఎస్‌బిఐ ఎటిఎం వద్ద కాపుకాశారు. సరిగ్గా ఈ సమయంలోనే ఓ వ్యాపారి ఆరు లక్షల రూపాయలతో ఎటిఎంలోకి వెళ్లగా ఒక్క ఉదుటున వీరిద్దరు లోపలికి వెళ్లి ఆ వ్యాపారిని తుపాకితో బెదిరించి నగదును దోచు కునేందుకు యత్నించారు. ఈ సందర్భంగా పెనుగులాట జరిగింది. దీంతో ఫుర్కాన్ అహ్మద్ తన వద్ద వున్న తుపాకితో నేలపై ఒక రౌండు, వ్యాపారి కాలిపై మరో రౌండు కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో వ్యాపారి గాయపడి కిందపడిపోగా వెంటనే అతని వద్ద వున్న నగదును దోచుకుని ఇద్దరు బాధితుడి స్కూటర్‌పై నేరుగా పాతబస్తీలోని షాహీన్‌నగర్‌లో గల తమ దొంగల ముఠా లోని తయ్యబ్ త్యాగి బంధువు మహమ్మద్ మాత్లూబ్ ఇంటి కి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పారు. అనంతరం తాము దోచుకున్న నగదును లెక్కించగా ఆరు లక్షల రూపాయలుగా తేలింది. దీని తరువాత ఈ నగదును తలా కొంత పంచుకుని ఎవరి దారిన వారు సొంత ఊళ్లకు వెళ్లిపోయారు. కాగా ఈ కేసులో బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు సుల్తాన్‌బజార్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టి నేరగాళ్లను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలో దింపారు. నిందితుల కోస ం గాలిస్తున్న క్రమంలో మంగళవారం ఉదయం షాహీన్ నగర్‌లో ఫుర్కాన్ అహ్మద్, ఫహీం అహ్మద్‌లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి దోపిడికి గురైన నగదులో 2.38 లక్షల రూపాయల నగదు, ఒక తుపాకి, 35 తూటాలు, రెండు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. అరెస్టయిన ఇద్దరు నేరగాళ్లపై యుపిలో అనేక క్రిమినల్ కేసులున్నాయి. కాగా ఈ కేసులో మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ కేసులో నేరగాళ్ల పట్టివేతకు విశేష కృషి చేసిన పోలీసు బృందాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్, ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లిలు అభినందించారు. ఈ సమావేశంలో ఖైరతాబాద్ జోన్ అదనపు డిసిపి ఆనంద్ కూడా పాల్గొన్నారు.

# మావోయిస్టు అగ్రనేత గణపతి నేపాల్‌లో మకాం?

### అప్పగించాలని ఆ దేశానికి కేంద్రం లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీ అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి (76) ఆచూకీ పోలీసులకు లభ్య మయ్యింది. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నేపాల్‌లో తలదాచుకున్నట్లు పోలీసులకు సమాచారం అందినట్లు తెలిసింది. గణ పతి కోసం పోలీసులు చాలా కాలంగా గాలిస్తుండడం తెలిసిందే. అయితే ఆయన ఆచూకీ ఇప్పటి వరకు లభించలేదు. మావోయిస్టు ఉద్యమం దేశ వ్యాప్తంగా వున్న సమయంలో ఆయన ఛత్తీస్‌ఘడ్‌లోని నక్సల్స్ కోట అబూజ్‌మడ్‌లో తలదాచుని వున్నట్లు పోలీసులకు సమాచారం వున్నా దీనిని ఎవరూ నిర్ధారించలేదు. అయితే మావోయిస్టుల ఏరివేతకు ఈ ఏడాది మార్చి నెలాఖరుకు డెడ్‌లైన్ విధించిన కేంద్రం ఆపరేషన్ కగార్ పేరిట వేల స ంఖ్యలో పారామిలటరీ బలగాలను రంగంలో దించి ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్రలలో గాలిస్తుండడం తెలిసిందే. ఈ గాలింపు ఏడాదిగా సాగుతుండగా ఈ క్రమంలో వెయ్యి మందికి పైగా నక్సలైట్లు మరణించగా ఐదు వేల మందికి పైగా లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో అగ్రనేతలు అనేక మ ంది వున్నారు. ఇదే సమయంలో గణపతి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తుండగా ఆయన అబూజ్ మడ్‌లో లేరని నేపాల్‌లో అక్కడి మావోయిస్టుల కోట వున్న ఒక రహస్య ప్రాంతంలో సురక్షితంగా వున్నట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై నేపాల్ సర్కారుకు కేంద్రం లేఖ రాయడంతో పాటు ఆ యన ఎక్కడ తలదాచుకున్నారనే దానిపై వివరాలు అందించినట్లు తెలిసింది. గణపతి ని భారత్‌కు అప్పగించాలని భారత్ నేపాల్‌ను కోరినట్లు సమాచారం. కాగా గణపతి 2018లో వృద్ధాప్యం కారణంగా మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి పదవిని స్వచ్ఛందంగా వదులుకున్నారు. 1991లో ఆ యన కొండపల్లి సీతారామయ్య నుంచి ఆ బాధ్యతలు అందుకున్నారు.

# గాంధీ విగ్రహం కోసం ఇళ్లను కూల్చివేయొద్దు

### మహాత్మాగాంధీ మునిమనవడు తుషార్‌గాంధీ ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** మూసీ సుందరీకరణ పేరుతో.. ఆ నది ఒడ్డున గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే గాంధీ విగ్రహం కోసం ఇళ్లను కూల్చివేస్తున్నారు. దీన్ని ఖండిస్తూ మహాత్మాగాంధీ మునిమనవడు తుషార్ గాంధీ స్పందించారు. నివాసాలను కూల్చి గాంధీ విగ్రహం కోసం స్థలం సేకరించడం గాంధేయ విధానం కాదు అని ఆయన అన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో తుషార్ స్పందించారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూ.సే) శాఖ

ఫారం - VI

(సబ్ రూల్ (1) ఆఫ్ రూల్ 19-సెక్షన్ 11(1) ఆఫ్ ది యాక్ట్ 30/2013 చూడుము)

ప్రాథమిక ప్రకటన

జిల్లా కలెక్టరు ఫైల్ సంఖ్య: G/495/2026 తేది : 20.02.2026
RDO ఫైల్ సంఖ్య: సి/206/2026 తేది : 17.02.2026
గెజిట్ సంఖ్య : 03/2026 తేది : 20.02.2026

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ డివిజన్-V జనగాం గారు ఇచ్చిన రిక్విజిషన్ ప్రకారము ఈ దిగువ షెడ్యూల్‌లో నిర్దిష్ట పరచిన తిరుమలగిరి మండలము నందాపురం గ్రామ శివారులో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.10.02 గుంటలు ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా 3R of 7R Distributary of Chennur Main Canal of Chennur Tank of JCRDLIS-Phase-III-Package-VI కొరకు అవసరమైనదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013లోని సెక్షన్ 11(1) అనుసరించి భూసేకరణ నిమిత్తం ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 చాప్టర్ (2)లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు సెక్షన్ 10ఎ(బి) ఆఫ్ చాప్టర్-IIIA ప్రకారం ఆహార భద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.

కావున తిరుమలగిరి మండలము, నందాపురం గ్రామ శివారు పరిధిలో ఉన్న విస్తీర్ణం ఎ.10.02 గుంటలు మరియు ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

గ్రామము : నందాపురం మండలం: తిరుమలగిరి జిల్లా : సూర్యాపేట

3R of 7R Distributary of Chennur Main Canal of Chennur Tank of JCRDLIS-Phase-III-Package-VI

షెడ్యూల్

| క్రమ సంఖ్య | సర్వే నెంబర్ | యాజమాన్య పు రకం | భూమి రకం | సేకరించబడిన భూమి విస్తీర్ణం ఎకరం/ పరిధి గుంటలలో | పట్టాదారు పేరు & అనుభవదారు పేరు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు/ నిర్మాణాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 85 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 2 | 91 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 3 | 96 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 4 | 97 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 5 | 101 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 6 | 102 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 7 | 104 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 8 | 149 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 9 | 150 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| | | | మొత్తం | 10.02 | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013 (నెం.30/2013)లోని నియమంలోని సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్ట పరిహారము చెల్లించుటకుగాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టరు, సూర్యాపేట మరియు భూ సేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/ జిల్లా కలెక్టరు, సూర్యాపేట గార్లు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారము పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశంలోకి ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూ సేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకము, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూ సేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏవైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టరు, సూర్యాపేట మరియు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గార్లకు లిఖితపూర్వకముగా తెలియజేయవలసియున్నది. ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారికి లిఖితపూర్వకముగా తెలియజేయవలయును.

సం/-.రాజస్వ మండలాధికారి సూర్యాపేట | సం/- అదనపు కలెక్టర్, సూర్యాపేట | సం/-. జిల్లా కలెక్టర్ సూర్యాపేట

DIPR RO.NO:1214/LA/PP/Advt/Pub/2025-26

వార్త

తమ పూర్వీకులందరూ సాధించిన ఘన విజయాలను గురించి గర్వపడని వారు, ముందు తరాల వారు తమని గుర్తించగల ఏ కార్యాన్నీ సాధించలేరు.

-మెకాలే


# 'మాఫియా'కు చావుదెబ్బ

చెడునడత కలవారికి స్థానం లేదు. కాస్త ఆలస్యంగానైనా మానవ సమాజంలో ఈ విషయం ధృవపడే సత్యం. కానీ ఉత్తర అమెరికాలోని 'మెక్సికోలో మాదక ద్రవ్య వ్యాపారం. పేరు పడిన ఎల్‌మెంచో ఆదివారం మెక్సికో సైన్యం చేతిలో హతమయ్యాడు. అమెరికాకు, మెక్సికోకు అతను 'మోస్ట్ వాంటెడ్ క్రిమినల్' అతన్ని పట్టుకుంటే 136 కోట్ల నజరానా ఉంది. కానీ అతని ప్రియురాలి వద్ద ఉన్న అతన్ని మెక్సికో పోలీసులు మాటువేసి పట్టుకున్నారు. ప్రముఖ డ్రగ్స్ ముఠానేత నెమెసియో ఒసెగువెరా సర్వెంటెస్ ఎలియాస్ ఎల్‌మెంచోను చుట్టుముట్టారు. ఈ సందర్భంలో మెక్సికో అనుచరులు దాడులకు దిగి, 25 మంది నేషనల్ గార్డ్ సభ్యులను హత్యచేశారు. మెంచోను అతని స్వరాష్ట్రం హాలిస్కోలోని తపాల్పాలో మెక్సికో సైన్యం ఆదివారం నాడు భారీ ఆపరేషన్ చేపట్టి అదుపులోకి తీసుకుంది. ఆ సమయంలో అతడి అనుచరులు కాల్పులు జరుపగా సైన్యం ఎదురు కాల్పులకు దిగింది. దాదాపు 62 మంది డ్రగ్స్ ముఠా సభ్యులు హతమయ్యారు. అతను అంతర్జాతీయ నేరస్తుడైనా, పలు డ్రగ్స్ కేసుల్లో నిందితుడైనా మెక్సికోలోని పలు పట్టణాల్లో అతని అనుచరులు చేపట్టిన హింసాత్మకదాడులు కారణంగా మెక్సికో అట్టుడికిపోయింది. ఇలాంటి నేరస్తునికి కూడా ఇంత పెద్ద విస్తృత అనుచర వర్గం ఉందంటే విశేషమే. ఎల్‌మెంచోను పట్టుకోవడంలో మెక్సికో సైన్యానికి తాము కూడా నిఘా సహాయ హస్తమందించినందునే మెక్సికో ఆపరేషన్ సాధ్యమైందని అమెరికా గర్వంగా ప్రకటించింది. ఒక నేరస్తునికి అందున మాదక ద్రవ్య వ్యాపారికి ఇంత పెద్ద ఎత్తున నెట్‌వర్క్ ఉంటుందని నమ్మలేం. వ్యాపారానికి నెట్‌వర్క్ సహజమే. కానీ అతని హత్యను జీర్ణించుకోలేక తిరుగబడే భక్తులుంటారా! అనే భావన కలుగుతోంది. అతడి అనుచరులు వాహనాలను తగలబెట్టి విధ్వంసకాండకు శ్రీకారం చుట్టారు. ఆపై అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని భారత్‌తో సహా పలు దేశాలు మెక్సికోలో ఉన్న తమ పౌరులకు అడ్వైజరీ జారీ చేసి అప్రమత్తం చేశారు. ప్రపంచంలో ఎక్కడ జీవిస్తున్నా తమ దేశ పౌరులు ఇతర ప్రాంతాల్లో ఇబ్బంది పడ్తున్నట్లుగా ఉంటే వారిని కుశలాలడిగి భద్రత కల్పించడం బాధ్యతగా తీసుకునే లక్షణం భారతదేశానిది. అందుకే ఎక్కడెక్కడ జీవనోపాధిలో ఉన్నా భారతదేశస్థులను అప్రమత్తం చేసారు. ఎల్‌మెంచ్ హతమయ్యాక మెక్సికోలో జరిగిన విధ్వంసకాండ ఇంతా అంతా కాదు. అంటే అతని మాదకద్రవ్య సామ్రాజ్యం ఆ ప్రాంతంలో ఎంతగా వేళ్లూనుకుందో తెలుసుకోవచ్చు. ఏ దేశంలో, ఏ రాష్ట్రంలో ఇలాంటి ముఠాలున్నా వాటిని మట్టుబెట్టడం ఎంతో ముఖ్యం. కరుడుగట్టిన నేరగాడిగా తయారయ్యేందుకు ఎల్‌మెంచోకు ఎన్ని కారణాలున్నా అతనో నేర సామ్రాజ్యానికి అధిపతిగా ఉంది. మాదకద్రవ్య వ్యాపారంలో ప్రపంచాన్ని శాసిస్తున్నాడు. అదే అతను చేసిన తప్పిదం. మెక్సికో, వెనెజులా వంటిదేశాల్లో ఎంతగా మాదక ద్రవ్య సంస్కృతి పెరిగిపోయిందో ఆ మధ్య అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ప్రపంచానికి చాటి చెప్పారు. 'న్యూ జనరేషన్‌కు కార్టెల్' అనే క్రిమినల్ సంస్థకు మెంచో 'డాన్'. అలాంటి వారిని ఇంతకాలం ప్రజల్లో ఉంచడమే మెక్సికో చేసిన తప్పిదమయి ఉండొచ్చు. లేదా అక్కడి పాలకులకన్నా మెంచో బలవంతుడై ఉండాలి. ఏమయినా తోటకూరనాడే మెంచో తోక కట్ చేసి ఉంటే తొండ ముదిరి ఊసరవెల్లి అయిందన్న చందాన అలా తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించుకుని ఉండేవాడు కాదు. 1980లో ఎల్‌మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అనుభవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరిపోయాడు. ఎల్‌మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంఛర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధికారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. సైన్యానికి చెందిన హెలికాప్టర్లపైనా దాడి చేసి కూల్చివేసిన ఉదంతాలున్నాయి. విచిత్రమేమిటంటే మాఫియా డాన్ మెంచోను హతం చేసింది తామంటే తామని అమెరికా, మెక్సికో దేశాలు వాదించుకుంటున్నాయి. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. గత ఫిబ్రవరిలో అమెరికా మెంచో సంస్థను విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. భారత కరెన్సీలో అతనిపై రూ. 136 కోట్ల రివార్డు కూడా ఉంది. అమెరికాలో డ్రగ్స్ సరఫరాలో శిక్ష అనుభవించిన మెంచోను మెక్సికోలో పోలీసు ఉద్యోగం ఇవ్వడమే వారి ఆలోచనారహిత విధానానికి కారణం. అదే అతడిని డాన్‌ను చేసింది. మెక్సికో ఆపరేషన్‌లో మెంచోతోపాటు అతని అనుచరులు మరో ఆరుగురు కూడా మరణించారు. మెంచో ప్రధానంగా ఫెంటానిల్, మెథా ఫెటమైన్, కొకైన్‌లను అక్రమ రవాణా చేస్తుంటాడు. అదీ అమెరికాకు కావడంతో ఆ దేశం కూడా ఇతన్ని నార్కో టెర్రరిస్ట్‌గా ప్రకటించి పట్టుకోవాలని ఎన్నోసార్లు ప్రయత్నించింది. చివరకు మెంచోకు చావు తప్పలేదు. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించకూడదన్న హితవు ఇందులోనే ఉంది.



ఎక్కువ, తక్కువలు, కులమత భేదాలు ఉండటం మానవజాతికి అవమానకరం.

మహాత్మాగాంధీ



స్వానుభవంతో తెలుసుకొనేంత వరకు చాలా సత్యాల అర్థం మనకు తెలిసిరాదు.

జాన్ స్టూవర్ట్ మిల్

## ప్రజావాక్కు



### చట్టం అందరికీ సమానమే!

చట్టం అందరికీ సమానమేనని రాజ్యాంగం చెపుతోంది. కానీ ఆచరణలో మాత్రం డబ్బున్నవాడికి ఒకరకంగాను, డబ్బుల్లేనివాడికి ఒకరకంగా జరుగుతుందని ప్రత్యక్షంగా కనిపిస్తుంది. ఇల్లూ వాకిలి లేని ఒక పేదవాడు ప్రభుత్వ స్థలంలో ఒక చిన్నగుడిసె వేసుకుంటే, మరుక్షణమే బుల్‌డోజర్‌తో కూల్చివేసేఅధికారులు, దొంగబాబాలు కోట్లాది రూపాయలవిలువచేసే ప్రభుత్వభూములుఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తుంటే అధికారులు ఎందుకు గమ్మున ఉంటున్నారు? చెరొక న్యాయమని ఇక్కడనే కనిపిస్తుంది. ఇంకా ఎన్నాళ్లు ఇలా అధికారులు నాటకాలు ఆడతారు? బాబాలు స్వామీలు గడ్డాలు పెంచుకొని, కాషాయగుడ్డలువేసుకొని, ముఖంపై బూడిదపూసుకున్న వారిని ప్రశ్నిస్తే శాపంపెడతారని, అధికారులకు భయమా?

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ప్రయాణ సమయంలో నిషేధ వస్తువులు

ఏపి రాష్ట్రంలో ఇటీవల ప్రైవేట్ ట్రావెల్ బస్సులు అనుసరిస్తున్న అనధికార వస్తువుల రవాణా విషయంలో జిల్లా రవాణా అధికారులు వాటిని తనిఖీలో చూసివారిపై కేసులురాసి అపరాధరుసుం లక్షల్లో వసూలుచేశారు. రవాణా నియమాలలో అది చట్ట విరుద్ధం కావున రుసుము చెల్లించారు. ఇదివారికి కట్టడి చేసేందుకు ప్రభుత్వ చర్య. గానీ కొన్నినెలల ముందు ట్రావెల్‌బస్ కాలినదుర్ఘటనలో కొన్ని వస్తువులు ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఘోర ప్రమాదం, మరణాలకు ఏదైనా వస్తువు ఇతర ఇబ్బందివల్ల యాంత్రికంగా అగ్నిని తద్వారా మనిషిప్రాణాన్ని తీస్తుంది. కావున ఈ నివేదికలు రాష్ట్రకమిషనర్, వారి మంత్రిత్వశాఖలకు నివేదిస్తే దానిపై తదుపరి ప్రత్యేక ఆదేశాలు పూర్తి కట్టడికి పరిష్కారం లభించగలదు.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### గురుకులాలలో క్రమశిక్షణ

గురుకులాలలో ఇటీవల కాలంలో ప్రవేశపరీక్ష నిర్వహించడం జరిగింది. వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యార్థుల క్రమశిక్షణ, నైతిక విలువలు, క్రీడలు, ఆరోగ్యం, ఔటింగ్ సెలవులు వంటి విషయాల బాధ్యతలను ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌లకు, ఫిజికల్ డైరెక్టర్ (పి.డి)లకు సైనిక్ స్కూల్‌లో రిటైర్ మిలిటరీ సిబ్బందికీ అప్పగించాలి.

- రాపాక రవీందర్, జనగాం

### పోస్టల్ శాఖ వింత నిబంధనలు

పోస్టల్ సేవింగ్స్, రిక్కరింగ్ వంటిఖాతాలేమైనా రద్దు చేసుకోవాలంటే మదుపరులను పోస్టల్ శాఖవారు కాలం చెల్లిన నిబంధనలతో ఇబ్బంది పెడుతున్నారు. ఖాతాదారులు తమ ఖాతా తెరిచేవేళ జీవితభాగస్వామినైనా పిల్లలైనా నామినీగా తెలుపుతారు. ఒకవేళ ఖాతా తెరిచిన వ్యక్తి మధ్యలో చనిపోతే ఆ డిపాజిట్ సొమ్ము నామినీకి చెల్లించాలి. సందేహం వస్తే మిగతా వారసుల నుండి అంగీకార పత్రంతీసుకోవాలి. వీటిల్లో అక్రమాలకు ఆస్కారంవుండదు. ఏమైనా తేడా వస్తే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి. కానిచనిపోయిన వ్యక్తి నామినీకి డిపాజిట్ సొమ్ము చెల్లించకుండా, పోస్టల్ అధికారులు నామినీకి తెలిసిన ఇద్దరు వ్యక్తులు ఆధార్, పాన్ జిరాక్స్ కాపీలతో సంబంధిత పోస్టాఫీసుకి వచ్చి సంతకం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పనులుమానుకొని ఆఫీసులచుట్టూ తిరగాలంటేఎంతో ఇబ్బంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

నేటి భారతంలో తక్కువ డబ్బులతో అధిక డబ్బులు సంపాదించొచ్చు అనే ఆశతో ఆస్తులు పోగొట్టుకుంటున్న నిరు పేదవాళ్ల ఎందరో. అయినా మనగురించి, మనకు డబ్బుల అవసరం గురించి వాడికేందుకు అని ఆలోచించడు పేదవాడు ఎందుకో మరి. బెట్టింగ్‌ల పేరిట ఈ కేవైసీ అప్డేట్‌ల పేరిట రైతుల, పేదవాళ్ళ రక్తం నెత్తుటి చుక్కను మింగుతున్న సైబర్ నేరగాళ్ల ఎందరో. అందుకే సోదర ఎవరు మనకు డబ్బులు ఊరికే ఇవ్వరు అనేది ఆలోచించాలి. సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త వహిద్దం. పదిమందికి అవగాహన కల్పిద్దాం.

- మోటె శివకుమార్, హైదరాబాద్

### ఛార్జింగ్ పాయింట్లను నెలకొల్పాలి

భారతదేశం స్వచ్ఛమైన, సుస్థిరమైన, స్వయం సమృద్ధి కలిగిన రవాణా వ్యవస్థ వైపు తన ప్రయాణాన్ని అత్యంత దృఢంగా కొనసాగిస్తోంది. పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంధన దిగుమతుల భారాన్ని తగ్గించుకోవాలనే లక్ష్యంతో ఎలక్ట్రిక్ వాహనాల రంగాన్ని ప్రభుత్వం పెద్దపీటవేస్తోంది. అయితే, ఈరంగం ఆశించిన స్థాయిలో వృద్ధి చెందడానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న ఛార్జింగ్ పాయింట్ల కొరతను ఇప్పుడు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తున్నారు. ఛార్జింగ్ మౌలికసదుపాయాలు మెరుగుపడుతుండటంతో, సామాన్య ప్రజల్లో కూడా ఎలక్ట్రిక్ వాహనాలపై నమ్మకం గణనీయంగా పెరిగింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

**మనవి** **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జనాభా సరే.. ఆర్థిక అభివృద్ధి సాధించామా?

**ఇప్పుడు జనాభా నియంత్రణ నుంచిజనాభా నినాదానికి మార్చుకుంటున్నారు. మతానికి బలం చేకూర్చేందుకు పిల్లలు అవసరమైతే కనాలనే చెబుతున్నారు. మరి ఆర్థిక బలం సంగతేంటి? జనాభా తగ్గితే అభివృద్ధికి మూలం అన్నారు. ఇప్పుడేమో జనాభా పెరగాలంటున్నారు. ఇప్పటివరకు ఆర్థిక బలమూలేదు, అభివృద్ధి లేదు. కేవలం మతోన్మాద బలమే సాధించినట్లా? ఇతర ముస్లిం, క్రైస్తవ దేశాల్లో సంతానోత్పత్తితో సమానంగా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే చర్యలు పాటించినాయి. ఎంత పెద్ద కుటుంబమైనా, ఎంత మంది పిల్లలు ఉన్నా ఆర్థికభరోసాను బాధ్యతగా తీసుకున్నాయే తప్పఎలాంటి కట్టడిచర్యలు తీసుకోలేదు. మరిమనదేశంలో జరుగుతున్నదేంటి? పిల్లలను కనాలని చెబుతున్న కేంద్రప్రభుత్వం ఆర్థిక బాగోగులకోసం ఏంచేస్తుంది.**



పట్ట హరిప్రసాద్

ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకల్లో ఆ సంస్థ అధినేత మోహన్ భగవత్ మరో కొత్త నినాదాన్ని అందించారు. అదే ప్రతొక్కరూ ముగ్గురు పిల్లలు కనాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దేశంలో కొన్ని నివేదికలు కూడా జనాభా విషయంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది అవస రమని స్పష్టం చేశాయి. దీని ఆధారంగా దేశాన్ని దృష్టిలో ఉంచుకొని చెబుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశంలో సరిపడే జనాభా ఉండాలి, లేకుంటే దేశంలోని కాలానుగు ణంగా సమస్యలను ఎదుర్కోలేం, అందుకే ప్రతొక్కరూ ముగ్గురు మాత్రమే ఎక్కువ ఉండకూడదనేది అందరూ అంగీకరించాల్సిందేనని తెలిపారు. హిందూ సమాజాన్ని ఐక్యం చేసి సాధికారత కల్పించాలన్నారు. హిందూ కుటుం బాలు ముగ్గురు పిల్లలను కనాలి, అలాగే చొరబాటుదారులు, మతం మారినోళ్లను గుర్తించాలి, ఉద్యోగాల్లో ఉంటే వారిని బహిష్కరించాలి. ఇదే హిందూ సమాజానికి కీలక మందు. తగ్గుతున్న హిందూ జనాభాను చూస్తే ఆందోళనకరంగా ఉందని మోహన్ భగవత్ అన్నారు. ఇప్పటికే హిందూ కుటుంబాలు సగటు కంటే తక్కువగా సంతానోత్పత్తి ఉన్న సమాజాలు భవిష్యత్తులో నిర్వీర్యమవుతాయని, ప్రస్తుతం ముందున్న పరిష్కారం కొత్త జనరేషన్ కు ముగ్గురు పిల్లల అవగాహన కల్పించాల్సిందే, సృష్టిని ముందుకు తీసుకెళ్లడమే మన లక్ష్యం. పౌర సమాజమంతా ఒకే దేశం, ఒకే జన్మభూమిపై పట్టు బిగించాలి. కాలాను గుణంగా సనాతన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని దేశానికి ఆయన పిలుపునిచ్చారు. మన దేశ సాంప్రదాయం మహిళలకు గౌరవప్రదమైన స్థానం ఇస్తుంది, యావత్తు ప్రపంచంలోని సమస్యలకు పరిష్కార మార్గాలు మన దేశ నాగరికతలో ఉన్నాయి. అందుకోసం బలహీన వర్గాలకు మద్దతుగా నిలిచి సామాజిక సామరస్యాన్ని పెంపొందిం చాలని, పరోక్షంగా అమెరికా, చైనాలో కొన్ని శక్తులుదేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. కెరీర్ అంటే కేవలం ఎక్కువ సంపాదించడం లేదా వినియోగించడం కాదు. ఇతరులను పంచుకోవడం, సేవ చేయడమనేది పిల్లలకు నేర్పించాలి. ముఖ్యంగా దేశానికి అన్నిటికంటే ఉన్నత విలువలు ఉన్న కుటుంబాలను అందించాలి. సమాజానికి వ్యక్తి కాదు, కుటుంబమే ప్రాథమిక యూనిట్ అని, సామాజిక ప్రవర్తన దానిలోనే రూపుదిద్దుకుంటుందని భగవత్ అన్నారు. 1990లో దేశ జనాభా విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో యావత్ దేశం ఆందోళనలో పడింది. అప్పట్లో జనాభా నియంత్రణ కోసం అందుబాటులో ఉన్న అవకాశాలన్నీ ఉపయోగించేశారు. ముగ్గురు వద్దు, ఇద్దరు ముద్దు అనే నినాదాన్ని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ఉద్యమంలా ప్రచారాలు చేశాయి. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే పథకాలు రావని, అనర్హతగా పరిగణించి కట్టడి చర్యలు తీసుకున్నారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు కూడా ఇద్దరు పిల్లల నిబంధన గ్రామ, పట్టణ అమలు చేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నిబంధనలతో చట్టాలు చేసి అమలు చేస్తున్నారు. జనాభా పెరగడం వల్ల వచ్చే అనర్థాలను కళ్లకు గట్టినట్లు చెప్తూ ప్రచారం చేసేవారు. అయితే కాలం మారే కొద్దీ ఇద్దరు బిడ్డల నినాదం మరింత బలంగా మారి ఆర్థికఅవకాశాలకు తలొగ్గి ఒక్కరికే పరిమితమైన కుటుంబాలు పెరిగాయి. అధిక సంతానం వల్ల వారిని పోషించడంలో భారం, చదువు వ్యయం భరించలేమన్న భయం బాగా ఫలించింది.



కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. సరికొత్త నినాదం అమల్లోకి వచ్చింది. ఎక్కువ మందిని పిల్లలు ఉంటేనే జాతి నిర్వీర్యాన్ని అడ్డుకోగలమని ముందున్న లక్ష్యంగా మారింది. ఒకప్పుడు స్థానిక సంస్థలు, సర్పంచ్ ఎన్నికల్లోనూ ముగ్గురు పిల్లలు ఉంటే పోటీకి అనర్హులుగా ప్రకటించారు. సమాజంలో ఇద్దరు పిల్లలు నినాదాన్ని బలేపేతం చేసేందుకే ఆ నిబంధనను అనుచరించారు. తాజాగా మరిన పరిస్థితుల దృష్ట్యా నిబంధను కూడా ఎత్తివేసే పరిస్థితి వచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నిబంధన ఎత్తివేయడంపై చర్చనీయంగా మారింది. మొన్నటి వరకు పాత నిబంధననే అమలులో ఉంచారు. కొత్త చట్టాన్ని రూపొందించినప్పుడు ప్రభుత్వాలు మార్చుకోలేదు. పలు రాజకీయ పక్షాలతో పాటు ప్రముఖులు నిబంధన ఎత్తివేయాలని కోరడంతో ఇద్దరు పిల్లల నిబంధనకు చెక్ పడింది. తెలంగాణలో ఆమోదానికి రాలేదు కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చంద్రబాబు పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించి ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉన్నా పోటీ చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. మోహన్ భగవంత్ సంఘ్ సభలో ప్రకటించిన నినాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఇప్పుడిప్పుడే చెబుతున్నది కాదు ఎంతో కాలం నుంచి జనాభా విషయంలో అప్రమత్తంగా ఉండాలని, జనాభా పెరగాలని, చెప్పుకుంటూ వస్తున్నారు. అయితే అది ఒక వర్గానికి అనుసరించినదే. ఎన్నికల సమయంలో చంద్రబాబు కూడా ఇదేవిషయాన్ని నొక్కి చెప్పారు. అయితే ఒక బ్రహ్మచారి కుటుంబ విలువలు, భావనల కోసం చెప్పడం హాస్యాస్పదంగా ఉందనేది పలువురి ప్రముఖుల మాట. అన్ని మతాలను విమర్శించకుండా పిల్లలను కనాలని చెప్పడం వెనుక స్వార్థపూరితమైన లక్ష్యంకనబడుతోంది. ఎక్కువ మంది పిల్లలతో జిందగీని సాగించే వాళ్లకు తెలుస్తుంది నొప్పేంటోనని, సనాతన ధర్మాన్ని అడ్డు పెట్టుకొని స్వార్థ భావనలు ప్రచారం చేసిన వారికి కుటుంబ బతుకులంటే తెలియని బ్రహ్మచారులు, సాధువులు, మును లకు ఎలా తెలుస్తుంది?. ముందుగా ముగ్గురు పిల్లలను వర్గంలో ఎంతమంది కంటున్నారు, వాళ్లకు బతుకు భరోసా ఎలా ఉందో, జనాభా పెరగాలన్నే లక్ష్యానికి ఎంతమంది కట్టుబడి ఉన్నారో అనేది ఆచరణలో చూపించాలి. జనాభా రేటు తగ్గడమనేది నిరంతరంగా జరుగుతున్న ప్రక్రియనే. అయితే హిందూ సమాజం తగ్గుతోందనడం సరైనదికాదు. ఓట్ల కోసమే బలం మాటున భావనను ప్రదర్శిస్తున్నారనేది కనబడుతోంది. దేశంలో ముస్లిం, ఇతర మతాలు రాకముందు ఉన్న మతమేంటి? దానితో మనకు ఒరిగిందేమిటి? జనాభా పేరుతో హిందువులు తగ్గుతున్నారనేదే ముఖ్యమైన అంశం. ప్రస్తుతం హిందువుల మనుగడ పుట్టే పిల్లలపై ఆధారపడి ఉందనేది తెలుస్తుంది. మరోవర్గం ముస్లింలను అడ్డుకొనే శక్తి కోసమే పిల్లలు కనాలనేది కనబడుతోంది. హిందూ సమాజం నిర్వీర్యం అయితే ఏంజరుగుతుంది. ఇతర దేశాల్లోనూ మన దేశ సంతతివాళ్లు ఉన్నారు. మరి అక్కడ దేశ సంస్కృతులు పాటించకుండా ఉండలేరెమో కాదా? మన దేశంలో హిందు మాటున ఉన్న హింసాత్మక వ్యక్తుల మనుగడ కోసం నినాదాలను తీసుకొస్తున్నారు. దేశ ఆర్థిక బలం కోసం, మానవాభివృద్ధి పేరుతో సంతానోత్పత్తిని తగ్గించే చర్యలు కొనసాగుతున్నప్పుడూ జనాభాలో తగ్గుముఖంపడుతూనే వస్తోంది. అప్పటికి ఆర్థికబలమే నిజమైన నినాదం. మూలాలు అంటూ హిందు సమాజానికి పిలుపునిచ్చి ముందుకు తీసుకెళ్లారు. మరో పక్క ముస్లిం వర్గంలో మాత్రం పిల్లలు భవిష్యత్తు దేవుళ్లగా పరిగణించి ముందుకెళ్తున్నా వాళ్లనూ జనాభా సమతూకంలో ఉండాలని కట్టడి చర్యలకు గురి చేశారు. అయినా వాళ్లు పరోక్షంగా పిల్లల భవిష్యత్తేనే కొనసాగించారు. ఇప్పుడు జనాభా నియంత్రణ నుంచిజనాభా నినాదానికి మార్చుకుంటున్నారు. మతానికి బలం చేకూర్చేందుకు పిల్లలు అవసరమైతే కనాలనే చెబుతున్నారు. మరి ఆర్థిక బలం సంగతేంటి? జనాభా తగ్గితే అభివృద్ధికి మూలం అన్నారు. ఇప్పుడేమో జనాభా పెరగాలంటున్నారు. ఇప్పటి వరకు ఆర్థిక బలమూలేదు, అభివృద్ధి లేదు. కేవలం మతోన్మాద బలమే సాధించినట్లా? ఇతర ముస్లిం, క్రైస్తవ దేశాల్లో సంతానోత్పత్తితో సమానంగా అభివృద్ధిని ముందుకుతీసుకెళ్లే చర్యలు పాటించినాయి. ఎంత పెద్ద కుటుంబమైనా, ఎంత మంది పిల్లలు ఉన్నా ఆర్థికభరోసాను బాధ్యతగా తీసుకున్నాయే తప్పఎలాంటి కట్టడిచర్యలు తీసుకోలేదు. మరిమనదేశంలో జరుగుతున్నదేంటి? పిల్లలను కనాలని చెబుతున్నకేంద్ర ప్రభుత్వం ఆర్థిక బాగోగుల కోసం ఏం చేస్తుంది. ●

# ఆరోగ్యాన్ని హరిస్తున్న కల్తీపాలు

ఈ. శ్రీనివాస్ రావు

పాలు ఆరోగ్యానికి పోషకాహారం. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పాలు తాగుతుంటారు. టీ, కాఫీ, వంటల్లో ఇలా నిత్యం పాలను వాడుతూనే ఉంటాం. ఎముకల బలం కోసం చిన్నపిల్లలకు ఆ పాలను మరగించి ఇస్తాం. కానీ అదేపాలు ఈరోజు విషంగా మారుతున్నాయంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉందో అర్థం చేసుకోవాలి. తెలుగు రాష్ట్రాల్లో కల్తీ పాలదందా ఒక చీకటి పరిశ్రమగా విస్తరించింది. డిమాండ్ పెరిగిన చోట దందా పుట్టడం కొత్తేమీ కాదు. కానీ ఆహారంలో, ముఖ్యంగా పాలలో కల్తీ చేయడం మానవత్వాన్ని మించి లాభం చూసే దురాశకు ఉదాహరణ. చిక్కదనం కోసం పామాయిల్, ఉప్పు, మాల్టో డెక్సిన్, వెన్నశాతం పెరిగిందని చూపించేందుకు యూరియా నిల్వకాలం పెంచేందుకు బోరిక్ యాసిడ్, హైడ్రోజన్ పెరాక్సైడ్, క్లోరిన్, అమ్మోనియం సల్ఫేట్ ఇలా రసాయనాల మిశ్రమంతో కెమికల్ కాక్‌టెయిల్ తయారు చేసి పాల పేరుతో విక్రయిస్తున్నారు. 100 లీటర్ల పాలలో100 లీటర్ల నీరు కలిపి, తెల్లటి నురగ కోసం యూరియా వేయడం వంటి వార్తలు వినిపిస్తున్నాయి. ఇవి వదంతులు కావొచ్చు, వాస్తవాలు కావొచ్చు. కానీ ఇలాంటి సంఘటనలు వెలుగులోకి రావడం కూడా పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ఇలాంటి కల్తీ పాలు తాగడం వల్ల వచ్చే ఆరోగ్యప్రమాదాలు భయానకమైనవి. మూత్రపిండాల పనితీరు దెబ్బతినడం, జీర్ణాశయ సమస్యలు, అతిసారం, అల్సర్లు, కొలెస్ట్రాల్ పెరుగుదల, దీర్ఘకాలంలో క్యాన్సర్ ముప్పు. ఇవి కేవలం వైద్యపుస్తకాలలో ఉండే పదాలు కాదు మన ఇళ్లలోకి చొరబడే వాస్తవాలు. పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతినే ప్రమాదం మరింత ఆందోళనకరం. కల్తీపాల ఉత్పత్తుల్లో ఈకోలై, సాల్మనెల్లా వంటి ప్రమాదకర బ్యాక్టీరియా, రోటా వైరస్ వంటి సూక్ష్మజీవులు పెరుగుతాయి. ఒక్కగ్లాసు పాలు ఆరోగ్యం ఇవ్వాల్సింది పోయి ఆసుపత్రి బెడ్‌కు చేర్చే పరిస్థితి రావడం దురదృష్టకరం. ఇక్కడ ప్రధాన ప్రశ్న నియంత్రణ వ్యవస్థ ఎక్కడ విఫలమవుతోంది? ఫుడ్ సేఫ్టీ




విభాగాలు, స్థానిక అధికారులు, పోలీసులు కల్తీ దందాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు. అప్పుడప్పుడు దాడులు, అరెస్టులు, ట్యాంకుల స్వాధీనం వంటి వార్తలు వస్తున్నాయి. కానీ అవి తాత్కాలిక చర్యలుగానే మిగిలిపోతున్నాయా? కల్తీ మాఫియా కొత్త పేర్లు, కొత్త బ్రాండ్లు, కొత్త మార్గాలతో మళ్లీ పుట్టుకొస్తోంది. కేవలం జరిమానాలు సరిపోవు, కఠిన శిక్షలు, లైసెన్సుల రద్దు, నిరంతర తనిఖీలు, ప్రజలకు పారదర్శక సమాచారంఇవన్నీ సమాంతరంగా జరగాలి. ప్రజల బాధ్యత కూడా అంతే ముఖ్యమైనది. తక్కువ ధరకు ఎక్కువ లాభం అనేది అనుమానానికి కారణం కావాలి. వాసన, రుచి, మరిగించినప్పుడు ఏర్పడే పొర, నేలపై చుక్క వేసినప్పుడు కదలిక - ఇవి ప్రాథమిక పరీక్షలు మాత్రమే. కానీ శాస్త్రీయంగా పరీక్షించిన, నమ్మకమైన వనరుల నుంచి పాలు కొనడం ఉత్తమం. స్థానిక రైతుల నుంచి నేరుగా సరఫరా అయ్యే పాలు, విశ్వసనీయ డెయిరీలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్రాండ్లను మాత్రమే ఎంచుకోవడం అవసరం. అనుమానం ఉన్నప్పుడు ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇవ్వడం ప్రతి పౌరుడి కర్తవ్యం. కల్తీ పాలు కేవలం ఆర్థిక నేరం కాదు, ఇది నైతిక పతనం. సమాజం విశ్వాసాన్ని, ఆరోగ్యాన్ని, భవిష్యత్తును కొల్లగొట్టే దురాగతం. పాలపై నమ్మకం కోల్పోతే అది కేవలం ఒక ఉత్పత్తిపై కాదు ఆహార వ్యవస్థపై, మార్కెట్‌పై, నియంత్రణ వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది. అందుకే ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోవాలి. ప్రభుత్వం కఠిన చట్టాలతో ముందుకు రావాలి. గ్రామస్థాయిలో పరీక్షా కేంద్రాలు, మొబైల్ టెస్టింగ్ యూనిట్లు, హాట్‌లైన్ నంబర్లు, ఫిర్యాదులపై తక్షణ స్పందన ఇవి అమలు కావాలి. పాలు సరఫరా గొలుసును డిజిటల్‌గా ట్రాక్ చేయడం, ఉత్పత్తి నుంచి వినియోగదారుని దాకా పారదర్శక వ్యవస్థ తీసుకురావడం అవసరం. రైతులకు న్యాయమైన ధరలు అందిస్తే మధ్య వర్తుల దందా తగ్గుతుంది. పాలు పోషకాహారం కావాలి. విషం కాదు. ప్రతి ఇంటి గ్లాసులో ఆరోగ్యం నిండాలి - రసాయనాలు కాదు. కల్తీ పాల మాఫియాపై సమాజం, ప్రభుత్వం, వినియోగదారులు కలిసికట్టుగా పోరాడాలి. లేదంటే మన నిర్లక్ష్యం ప్రతి గ్లాసును మృత్యు సందేశంగా మార్చే ప్రమాదం ఉంది. జాగ్రత్తగా ఉండటం మాత్రమే కాదు - చైతన్యంగా స్పందించడం సమాజ ధర్మం. ●

# భవిష్యత్తు తరగతి గదుల్లోనా, బడ్జెట్ అంకెల్లోనా?

తిప్పర్తి శ్రీనివాస్

దేశ భవిష్యత్తు తరగతి గదులలోనే రూపుదిద్దుకుంటుంది అన్నది కేవలం భావోద్వేగ నినాదం కాదు, నిర్ధారిత సత్యం. కానీ ఆ సత్యాన్ని మన పాలక వ్యవస్థలు ఎంత వరకు గుర్తిస్తున్నాయో ప్రతి ఏటా ప్రవేశపెట్టే బడ్జెట్‌నే అద్దంలా చూపిస్తుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మొత్తం 53.47 లక్షల కోట్ల రూపాయలు. అయితే ఈ మహత్తర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన మొత్తం కేవలం 1,39,289 కోట్ల రూపాయలు మాత్రమే. శాతాల పరంగా ఇది దాదాపు 2.6 శాతం మాత్రమే. ఈ సంఖ్యలు చూస్తే దేశాభివృద్ధిలో విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత ఎంత పరిమితమో స్పష్టంగా అర్థమవుతుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రతి ప్రభుత్వం విద్యను జాతి నిర్మాణానికి పునాదిగా అభివర్ణిస్తూ వచ్చింది. కానీ ఆ మాటలకు ఆర్థిక ప్రాధాన్యత ఇచ్చే విషయంలో మాత్రం ప్రభుత్వాలు వరుసగా విఫలమవుతున్నాయి. ముఖ్యంగా 1964-66 మధ్యకాలంలో పని చేసిన కొఠారి కమిషన్ దేశ విద్యావ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి, జాతీయ ఆదాయంలో కనీసం 6 శాతం విద్యకు కేటాయించాలి అని స్పష్టంగా సిఫారసు చేసింది. ఆ సిఫారసుకు దాదాపు అరవై ఏళ్లు గడిచినా, ఇప్పటికీ 3 శాతం దాటని కేటాయింపులు కొనసాగుతుండటం దేశ పాలనా వైఫల్యానికి నిదర్శనం. విద్యారంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల అనేక మౌలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, డిజిటల్ వసతుల లేమి వంటి సమస్యలు విద్యా నాణ్యతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. అనేక గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా తాగునీరు, మరుగుదొడ్లు లేని పాఠశాలలు ఉండటంమనకు సిగ్గు కలిగించే వాస్తవం. ఉన్నత విద్య రంగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. విశ్వవిద్యాలయాలు నిధుల కొరతతో పరిశోధన కార్యక్రమాలను కుదించుకుంటున్నాయి. అధ్యాపక నియామకాలు నిలిచిపోవడం, ప్రయోగశాలల అభివృద్ధి జరగకపోవడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే స్థితి మన విద్యాసంస్థలకు లేకుండాపోతోంది.



ఫలితంగా ప్రతిభావంతులైన యువత చదువు, ఉద్యోగాల కోసం విదేశాల వైపు వెళ్లడం పెరుగుతోంది. ఇది కేవలం వ్యక్తిగత నష్టమే కాదు, దేశ మేధోసంపత్తి కోల్పోయే పరిస్థితి. ప్రభుత్వం తరచూ నూతన విద్యా విధానం - 2020 గురించి గొప్పగా ప్రచారం చేస్తోంది. కానీ విధానాలు అమలు కావాలంటే మాటలు సరిపోవు, నిధులు కావాలి. బహుభాషా విద్య, ఉపాధ్యాయుల శిక్షణ, నూతన పాఠ్యాంశాలు, డిజిటల్ బోధన, పరిశోధన ప్రోత్సాహం ఇవన్నీ అమలు చేయాలంటే భారీ పెట్టుబడులు అవసరం. కానీ 2.6 శాతం బడ్జెట్ కేటాయింపుతో ఈ లక్ష్యాలన్నీ సాధిస్తామని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమే అవుతుంది. ఇంకా విచారకరమైన విషయం ఏమిటంటే, విద్యను ఖర్చుగా చూడటం తప్ప పెట్టుబడిగా చూడని దృష్టికోణం ఇప్పటికీ పాలకుల్లో కొనసాగుతోంది. రహదారులు, వంతెనలు, భవనాలు అవసరమే. కానీ వాటిని నిర్మించి నిర్వహించేది చదువుకున్న, నైపుణ్యం కలిగిన పౌరులే అన్న సత్యాన్ని విస్మరించలేం. విద్యలో పెట్టుబడి పెట్టడమే దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధికి, సామాజిక సమానత్వానికి పునాది. విద్యకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే సామాజిక అసమానతలు మరింత పెరుగుతాయి. పేద, వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన విద్య అందని పరిస్థితి కొనసాగితే నిరుద్యోగం, అసంతృప్తి, సామాజిక అశాంతి పెరిగే ప్రమాదం ఉంది. ఇవన్నీ ప్రజాస్వామ్యానికి, దేశ ఐక్యతకు ప్రమాదకర పరిణామాలను తెస్తాయి. అందువల్ల కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. దేశ అభివృద్ధికి విద్య ముఖ్యమైన పునాది. పేదరిక నిర్మూలనకు విద్య ఒక శక్తివంతమైన సాధనం. శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాల అభివృద్ధి. సమాన విద్యావకాశాలు అందరికీ కల్పించడం, విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి 6శాతం నిధులు అవసరమని కొఠారి కమిషన్ భావించింది. కమిషన్ సూచించిన 6శాతం లక్ష్యం అసాధ్యమైనది కాదు. రాజకీయ సంకల్పం ఉంటే అది సాధ్యమే. విద్యారంగానికి ప్రాధాన్యత ఇచ్చే బడ్జెట్‌నే నిజమైన అభివృద్ధి బడ్జెట్‌గా పరిగణించాలి. లేకపోతే వికసిత భారత్ వంటి నినాదాలు కేవలం ప్రచార వాక్యాలుగానే మిగిలిపోతాయి. దేశభవిష్యత్తును అంధకారంలోకి నెట్టకుండా ఉండాలంటే, విద్యారంగానికి జరుగుతున్న ఈ అన్యాయాన్ని వెంటనే సరిచేయాలి. బడ్జెట్ పుస్తకాలలో మాత్రమే కాదు, తరగతి గదుల్లోనూ మార్పుకనిపించాలి. ●

# ట్రేడ్ డీల్ రద్దు చేయండి

- అమెరికా సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు - ఒత్తిడికి తలవంచారు, మోడీ రాజీపడ్డారు - కేంద్రంపై రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు
- వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు



**భోపాల్, ఫిబ్రవరి 24:** అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారతదేశ వ్యవసాయ రంగానికి గొడ్డలిపెట్టులాంటిదని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి ప్రధాని మోడీ దేశ ప్రయోజనాలను పణంగా పెట్టారని మండిపడ్డారు. భోపాల్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, అమెరికాతో ట్రేడ్ డీల్ చేసుకుని దేశాన్ని అమ్మేశారని, భారతీయుల డాటాను అమెరికా చేతిలో పెట్టారని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ ఒప్పందం భారతదేశం రాబోయే ఐదు సంవత్సరాలలో అమెరికా నుండి రూ. 9 లక్షల కోట్ల విలువైన వస్తువులను కొనుగోలు చేయవలసి వస్తుందని, ఇది దేశీయ పరిశ్రమలను ముఖ్యంగా వస్త్రాలు, వ్యవసాయాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. అమెరికాతో కుదిరిన ఈ ఒప్పందం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా ఉందని చెప్పారు. ఐదు నెలల పాటు వ్యవసాయ ఉత్పత్తుల అంశం కారణంగా ఈ ఒప్పందం నిలిచిపోయిందని, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రభుత్వం కూడా అంగీకరించలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ నుంచి బయటకు వెళ్లి నేరుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేసి ఒప్పందానికి సిద్ధమని చెప్పారని ఆరోపించారు. యుద్ధ నిర్ణయాల నుంచి అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వరకు అన్ని అంశాల్లో ప్రధాని నరేంద్ర మోడీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ భద్రత, రైతుల ప్రయోజనాలు, పార్లమెంటరీ వ్యవస్థ అన్నీ ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. 'అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోడీ మాత్రం మోనంగా ఉండిపోయారు. ఇదే వేదిక నుంచి మోడీని సవాలు చేస్తున్నా. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి' అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని రాహుల్ పునరుద్ఘాటించారు. 'నరేంద్ర మోడీ తన ప్రతిష్టను కాపాడుకోవడానికి, తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి, బెదిరింపులను నివారించడానికి ఒత్తిడికి లోనయ్యారు అని ఆయన పేర్కొన్నారు. ఒప్పందాన్ని రద్దు చేయమని ప్రధానమంత్రిని నేరుగా సవాలు చేశారు. హరిత విప్లవం, దేశ నిర్మాణంలో పార్టీ చారిత్రాత్మక పాత్రను ప్రార్థిస్తూ, కాంగ్రెస్ కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ సభ్యులు, మద్దతుదారులు రాజీ పడకుండా దృఢంగా నిలబడాలని ఆయన కోరారు. 'మీరు ఎవరితోనూ రాజీపడరు. మీలో కాంగ్రెస్ పార్టీ రక్తం ఉంది, దేశభక్తి రక్తం ఉంది. మీరు హరిత విప్లవాన్ని తీసుకువచ్చారు. మీరు మీ దేశానికి ఆహారం ఇచ్చారు, మీరు మీ దేశానికి ధాన్యాలు ఇచ్చారు, మీరు మీ పరిశ్రమను నిర్మించారు' అని ఆయన అన్నారు. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కిసాన్ సమ్మేళన్‌ల శ్రేణికి భోపాల్ ర్యాలీ నాంది పలికింది. ఈ ఒప్పందం భారత మార్కెట్లను చౌకైన యుఎస్ దిగుమతులతో నింపడం, పత్తి, సోయాబీన్, మొక్కజొన్న వంటి కీలక పంటలను ప్రమాదంలో పడేయడం. ఆహార భద్రత, గ్రామీణ జీవనోపాధిని దెబ్బతీయడం ద్వారా రైతులను మోసం చేస్తుందని కాంగ్రెస్ నాయకులు వాదించారు. దేశవ్యాప్తంగా రైతులను సమీకరించడానికి మహారాష్ట్రతో సహా రాష్ట్రాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనుంది. భోపాల్ సభకు ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు పాల్గొన్నారు.

### యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు

# ఉదయ్‌భాను చిబ్ అరెస్ట్

## ఎఐ సమ్మిట్ వద్ద నిరసనల కేసు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** దేశరాజధానిలో జరిగిన ఎఐ ఇంపాక్ట్ సదస్సులో నిరసన తెలిపిన యూత్ నేతల్లో కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలపై యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను పోలీసులు తెల్లవారుఝామున అరెస్టుచేసారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా చోటుచేసుకున్న అసాధారణ నిరసన నేపథ్యంలో, ఢిల్లీ పోలీసులు ఈ తెల్లవారుజామున ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ప్రపంచ దేశాల ప్రతినిధులు హాజరైన ఆ వేదికపై చొక్కాలు విప్పేసి నిరసన తెలపడం వెనుక ఉదయ్ భాను కీలక పాత్ర పోషించారనే ఆరోపణలతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ అరెస్ట్ ప్రక్రియ ఎంతో నాటకీయంగా సాగింది. నిన్న ఉదయమే విచారణ నిమిత్తం తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన అధికారులు, దాదాపు 15 గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఈ విచారణ అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొనసాగడం, చివరకు తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో ఆయన్ను అధికారికంగా అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. గత వారం జరిగిన ఆ నిరసనలో ఇప్పటికే పలువురు కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు, ఈ ప్లాన్ అంతా ఉదయ్ భాను నేతృత్వంలోనే జరిగిందనే ఆధారాలు లభించాయని పేర్కొంటున్నారు. మరోవైపు, ఈ అరెస్ట్‌పై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తమ యువ నేతను వేధిస్తున్నారని ఏఐసీసీ నేతలు మండిపడుతున్నారు. అంతర్జాతీయ వేదికపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టడమే తమ ఉద్దేశమని, కానీ దానిని నేరంగా పరిగణించడం దారుణమని వారు వాదిస్తున్నారు. ఈ అరెస్ట్‌తో ఢిల్లీలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలకు సిద్ధమవుతుండటంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

### విద్యాసంస్థలు, దేవాలయాల పరిసరాల్లో

# మాంసం సేల్స్ నిషేధం


## బీహార్ ప్రభుత్వం కీలక నిర్ణయం



**పాట్నా, ఫిబ్రవరి 24:** పాఠశాలలు ఇతర విద్యాసంస్థలు దేవాలయాల పరిసరాల్లో అన్ని రకాల మాంసం విక్రయాలు నిలిపివేయాలని బీహార్ ప్రభుత్వం ఆదేశించింది. బీహార్ డిప్యూటీ సీఎం, అర్బన్ డెవలప్‌మెంట్ మినిస్టర్ విజయ్ కుమార్ సిన్హా ఆదేశాలు జారీ చేశారు. ఇకపై విద్యాసంస్థలు, దేవాలయాల పరిసరాల్లో మాంసం, చేపలు, గుడ్లు వంటివి అమ్మడానికి వీల్లేదు. ఈ రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజయ్ కుమార్ హెచ్చరించారు. ఇటీవల తాను వివిధ ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా వచ్చిన ఫిర్యాదులు, సలహాల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజలు మాంసం తినడానికి మేం వ్యతిరేకం కాదు. వాటి నుంచి వచ్చే వాసనతో అటు విద్యార్థులు, ఇటు దేవాలయాల్లో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా టెంపుల్స్‌కు వచ్చే భక్తుల మనోభావాలకు ఇబ్బంది కలుగుతోంది. మాంసం షాపుల కారణంగా విద్యార్థుల హింసాత్మక ధోరణి పెరగొచ్చు. అందుకే స్కూల్స్, ఇతర విద్యాసంస్థలు, దేవాలయాలు, వాటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, సామాజిక సామరస్యానికి దోహదపడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. జిల్లా అధికారులు ఈ నిబంధనల్ని అమలు చేయాలని, ఒకవేళ రూల్స్ అతిక్రమిస్తే బిహార్ మున్సిపాలిటీ యాక్ట్ 2007 ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. వీటి వెనుక దురుద్దేశాలున్నాని విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో జంతువులను వధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదని,

మాంసం విక్రయించేందుకు ప్రత్యేక స్థలాలు కూడా లేవని మండిపడ్డారు. వీటన్నింటినీ పరిష్కరించిన తర్వాత ఇలాంటి నిర్ణయాలు అమలు చేయాలని ప్రతిపక్ష నేతలు సూచిస్తున్నారు.

# నీతి ఆయోగ్ సిఇఒగా సీనియర్ ఐఎఎస్ నిధి చిబ్బర్




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** కేంద్ర ప్రభుత్వ విధాన రూపకల్పనలో కీలకమైన నీతి ఆయోగ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా సీనియర్ ఐఏఎస్ అధికారిణి నిధి ఛిబ్బర్‌కు కేంద్ర ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుత సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం మూడేళ్ల పదవీకాలం మంగళవారంతో ముగియడంతో ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం నీతి ఆయోగ్ పరిధిలోని డెవలప్‌మెంట్ మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫీస్ (డీఎంఈఓ) డైరెక్టర్ జనరల్‌గా నిధి ఛిబ్బర్ పనిచేస్తున్నారు. ఈ హోదాలో కొనసాగుతూనే ఆమె సీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఛత్తీస్‌గఢ్ కేడర్‌కు చెందిన 1994 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి అయిన ఆమె, గతంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ఛైర్‌పర్సన్‌గా పనిచేసి కీలక సంస్కరణలు చేపట్టారు. పదవీ విరమణ చేసిన బీవీఆర్ సుబ్రహ్మణ్యం, వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధన కోసం రాష్ట్రస్థాయి పాలన, డిజిటల్ పరివర్తనపై దృష్టి సారించారు. 1987 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన గతంలో ప్రధానమంత్రి కార్యాలయం, వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ప్రపంచ బ్యాంకులో పనిచేశారు. జమ్మూకశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కూడా సేవలందించారు. ప్రణాళికా సంఘం స్థానంలో 2015 జనవరి 1న నీతి ఆయోగ్ ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈ కీలక పాలసీ థింక్ ట్యాంక్ సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములను చేస్తూ దేశాభివృద్ధికి కృషి చేస్తుంది.

# సహారాన్‌పూర్ జంట హత్యల కేసులో ఒకే కుటుంబంలో 13 మందికి జీవిత ఖైదు

**సహారాన్‌పూర్; యుపి, ఫిబ్రవరి 24:** యూపీలో పదేళ్ల క్రితం సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో స్థానిక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. భూవివాదం నేపథ్యంలో ఇద్దరు అన్నదమ్ములను హత్య చేసిన కేసులో ఒకే కుటుంబానికి చెందిన 13 మందిని దోషులుగా తేలుస్తూ, వారికి జీవిత ఖైదు విధించింది. ఈ ఘటన సహారాన్‌పూర్‌లో చోటుచేసుకుంది. సుమారు పదేళ్ల క్రితం భూమికి సంబంధించిన గొడవల్లో ఇద్దరు సోదరులు హత్యకు గురయ్యారు. ఈ కేసుపై సుదీర్ఘ విచారణ జరిపిన అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి వికాస్ గుప్తా తుది తీర్పును వెల్లడించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో 13 మందికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు అందరికీ కలిపి రూ. 10.73 లక్షల జరిమానా కూడా విధించినట్లు అదనపు జిల్లా ప్రభుత్వ న్యాయవాది దీపక్ సైనీ తెలిపారు. శిక్ష పడిన వారిలో సుబ్బా అనే వ్యక్తి నలుగురు కుమారులు మునవర్, ముస్తఫా, సనవర్, స్తఖీమ్‌లతో పాటు ముస్తఫా ఇద్దరు కుమారులు షోకీన్, మోహ్సిన్ కూడా ఉన్నారు. ఒకే కేసులో ఒకే కుటుంబానికి చెందిన ఇంతమందికి యావజ్జీవ శిక్ష పడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



### తహవ్వుర్ రాణా పౌరసత్వం

# రద్దుచేస్తున్న కెనడా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** కెనడా ప్రభుత్వం ముంబై ఉగ్రదాడుల ప్రధాన సూత్రధారి తహవ్వుర్ హుస్సేన్ రాణా పౌరసత్వాన్ని రద్దు చేసేందుకు చర్యలు చేపట్టింది. కెనడా ప్రధాని మార్క్ కార్నీ భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆ దేశ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తహవ్వుర్ రాణా ప్రస్తుతం భారత్‌లో ఎన్ఐఏ అధికారుల కస్టడీలో ఉన్నాడు. కాగా 1997లో రాణా కెనడాకు వలస వెళ్లాడు. 2001లో ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజెన్‌షిప్ కెనడా అతడికి కెనడా పౌరసత్వం ఇచ్చింది. ఇప్పుడు ఆ పౌరసత్వాన్ని రద్దు చేసేందుకు ఐఆర్‌సీసీ చర్యలు ప్రారంభించింది. దీనికి కారణం అతడిపై ఉన్న ఉగ్ర ఆరోపణలు కాదని, తప్పుడు పత్రాలతో పౌరసత్వం పొందడంపై ఈ చర్యలు చేపట్టామని వివరించింది. పౌరసత్వం కోసం రాణా దరఖాస్తు చేసుకున్న సమయంలో తాను టొరంటో‌లో నివాసినని పేర్కొన్నాడు. ఆ సమయంలో అతడు షికాగోలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొన్నేళ్లుగా దర్యాప్తు జరుగుతోంది. ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నాడన్న ఆరోపణలపై తహవ్వుర్ 2009లో అరెస్టయ్యాడు. అమెరికా జైల్లో శిక్ష అనుభవించిన అతడిని యూఎస్ అధికారులు గతేడాది భారత్‌కు అప్పగించారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఈనెల 26న భారత్‌కు రానున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, దౌత్య సంబంధాల పునరుద్ధరణకు ఆసక్తిగా ఎదురు చూస్తోందని కెనడా ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొన్నది. భారత పర్యటన అనంతరం కార్నీ ఆస్ట్రేలియా, జపాన్‌కు వెళ్లనున్నారు. కెనడా ప్రధాని భారత పర్యటనపై ఆ దేశంలోని ఫోరం ఆఫ్ ఫెడరేషన్స్ సీఈవో భారత్ కెనడా మధ్య రాజకీయ, వ్యవస్థీకృత సారూప్యతలు ఉన్నాయన్నారు.

# తండ్రిని ముక్కలుగా నరికి డ్రమ్ములో దాచిపెట్టిన కసాయి



**లక్నో, ఫిబ్రవరి 24:** నీట్ పరీక్షకు సిద్ధం కావాలని తండ్రి పదేపదే ఒత్తిడి చేయడంతో ఆగ్రహానికి గురైన ఓ కొడుకు అతడిని కాల్చి చంపి మృతదేహాన్ని ముక్కలుగా నరికి, ఇంట్లోని డ్రమ్ములో దాచిపెట్టిన అత్యంత దారుణమైన ఘటన లక్నోలో వెలుగులోకి వచ్చింది. చెల్లి కళ్లెదుటే ఈ ఘోరానికి పాల్పడి, విషయం బయటపెడితే చంపేస్తానని ఆమెను బెదిరించడం గమనార్హం. లక్నోలోని ఆశియానా ప్రాంతానికి చెందిన వర్ధమాన్ పాథాలజీ యజమాని మాన్వేంద్ర ప్రతాప్ సింగ్ (49), ఫిబ్రవరి 20 నుంచి కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు మాన్వేంద్ర కుమారుడు అక్షత్ ప్రతాప్ సింగ్ (19) ప్రవర్తనపై అనుమానం వచ్చింది. విచారణలో అతను పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించగా అసలు నిజాన్ని ఒప్పుకున్నాడు. డీసీపీ విక్రాంత్ వీర్ కథనం ప్రకారం నీట్ పరీక్ష ప్రిపరేషన్ విషయంలో తండ్రీకొడుకుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈనెల 20న ఇదే విషయమై వాగ్వాదం జరగడంతో ఆవేశంలో అక్షత్ తన తండ్రి లైసెన్స్‌డ్ రైఫిల్‌తో కాల్చి చంపాడు. అనంతరం మృతదేహాన్ని మూడో అంతస్తు నుంచి కిందికి తెచ్చి, ఆధారాలను నాశనం చేసేందుకు ముక్కలుగా నరికాడు. కొన్ని శరీర భాగాలను సదరోనా గ్రామం సమీపంలో పడేసి, మిగిలిన భాగాలను ఇంట్లోని ఓ డ్రమ్ములో దాచిపెట్టాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రమ్ములో ఉన్న మృతదేహం భాగాలను స్వాధీనం చేసుకున్నారు. ఫోరెన్సిక్ బృందం ఆధారాలు సేకరించింది. నిందితుడు అక్షత్‌ను అదుపులోకి తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# రాజకీయ భవిష్యత్తుపై ముఖ్యప్రకటన చేస్తా: శశికళ



**చెన్నై, ఫిబ్రవరి 24:** తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత జయంతి సందర్భంగా ఆమె నెచ్చెలి వి.కె. శశికళ తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణపై కీలక ప్రకటన చేయనున్నట్లు చెప్పడంతో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మంగళవారం ఎంజీఆర్, జయలలిత స్మారక స్థలాల వద్ద నివాళులర్పించిన అనంతరం భవిష్యత్తు రాజకీయంపై ప్రకటనచేస్తానని శశికళ వెల్లడించారు. జయలలితకు మూడు దశాబ్దాలకు పైగా అత్యంత సన్నిహితురాలిగా ఉన్న శశికళ, ఆమె పాలనలో తెరవెనుక శక్తిమంతమైన వ్యక్తిగా కొనసాగారు. 2016 డిసెంబర్‌లో జయలలిత మరణానంతరం క్రియాశీలక రాజకీయాల్లోకి ప్రవేశించి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. శాసనసభాపక్ష నేతగా ఎన్నికై ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడానికి సిద్ధమైన తరుణంలో రాజకీయ సమీకరణాలు నాటకీయంగా మారిపోయాయి. అప్పటి ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం ఆమె నాయకత్వంపై తిరుగుబాటు చేశారు. అదే సమయంలో అక్రమాస్తుల కేసులో కోర్టు తీర్పుతో శశికళ నాలుగేళ్ల జైలు శిక్షకు వెళ్లాల్సి వచ్చింది. జైలుకు వెళ్లే ముందు ఆమె ఎడప్పాడి పళనిస్వామిని ముఖ్యమంత్రిగా ప్రకటించారు.

# ఉక్రెయిన్‌కు స్లోవేకియా షాక్! విద్యుత్ సరఫరా నిలిపివేత

**కీవ్, ఫిబ్రవరి 24:** ఉక్రెయిన్ విద్యుత్ వ్యవస్థలే లక్ష్యంగా రష్యా భీకర దాడులు చేస్తున్న క్రమంలో.. కీవ్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఉక్రెయిన్‌కు అత్యవసర విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు స్లొవేకియా ప్రకటించింది. రష్యా నుంచి స్లొవేకియాకు సరఫరా అయ్యే చమురును కీవ్ ఆపడమే రెండు దేశాల మధ్య వివాదానికి దారితీసినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌లోని భూభాగం మీదుగా వెళ్లే డ్రుజ్బా పైప్‌లైన్ ద్వారా మధ్య ఐరోపా ప్రాంతానికి రష్యా ముడి చమురు సరఫరా అవుతోంది. అయితే, గత నెల 27 నుంచి స్లొవేకియా, హంగరీకి చమురు సరఫరా నిలిచిపోయింది. రష్యా జరిపిన భీకర డ్రోన్ దాడుల్లో డ్రుజ్బా పైప్‌లైన్ దెబ్బతిందని ఉక్రెయిన్ అధికారులు పేర్కొన్నారు. కానీ, కీవ్ ఉద్దేశపూర్వకంగానే చమురు సరఫరాను నిలిపివేసిందని స్లొవేకియా ఆరోపించింది. పైప్‌లైన్ బాగానే ఉందని, దాన్ని పరిశీలించేందుకు తమ రాయబారికి ఉక్రెయిన్ అనుమతి ఇవ్వడం లేదని పేర్కొంది. దీనిపై



చర్చించేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ నిరాకరిస్తున్నారని తెలిపింది.


### వారసత్వపోరులో

# కిమ్‌జాంగ్ సోదరికి ఉన్నత పదవి

**ప్యాంగ్యాంగ్, ఫిబ్రవరి 24:** ఉత్తర కొరియాలో అప్రతిహత అధికారాన్ని చెలాయిస్తున్న కిమ్ కుటుంబం, దేశంపై తన పట్టును మరింత పటిష్ఠం చేసుకుంటోంది. అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్‌కు కీలక పదోన్నతి లభించడమే ఇందుకు నిదర్శనం. దేశ భవిష్యత్ విధానాలను నిర్దేశించేందుకు జరుగుతున్న వర్కర్స్ పార్టీ కాంగ్రెస్ సమావేశాల వేదికగా ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ పరిణామం కిమ్ కుటుంబ పాలన మరింత బలపడుతోందన్న సంకేతాలను స్పష్టంగా పంపుతోంది. అధికారిక కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) నివేదిక ప్రకారం ఇప్పటివరకు వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా సెంట్రల్ కమిటీలో వైస్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న కిమ్ యో జోంగ్‌ను ఇప్పుడు ఓ డిపార్ట్‌మెంట్‌కు డైరెక్టర్‌గా నియమించారు. అయితే, ఆమెకు ఏ విభాగాన్ని కేటాయించారన్న అంశంపై స్పష్టత రాలేదు. ఐదేళ్ల తర్వాత జరుగుతున్న ఈ పార్టీ కాంగ్రెస్ సమావేశాల్లో కిమ్ జోంగ్ ఉన్ పార్టీ జనరల్ సెక్రటరీగా తిరిగి ఎన్నికయ్యారు. మరోవైపు కిమ్ జోంగ్ ఉన్ తర్వాత ఆయన వారసురాలిగా టీనేజ్ కుమార్తె కిమ్ జు యే ను సిద్ధం చేస్తున్నట్లు కనిపిస్తోందని దక్షిణ కొరియా గూఢచార సంస్థ ఇటీవల అంచనా వేసింది. ఇది నిజమైతే 1940ల నుంచి కొనసాగుతున్న కిమ్ కుటుంబ పాలన భవిష్యత్తులోనూ కొనసాగనుంది. కిమ్ కుటుంబంలో ఇతర సభ్యుల జీవితాలు విషాదాంతమైన నేపథ్యంలో కిమ్ యో జోంగ్ ఉన్నత స్థానానికి చేరుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. కిమ్ జోంగ్ ఉన్ తన సోదరుడు, రాజకీయ ప్రత్యర్థి అయిన కిమ్ జోంగ్ నామ్‌ను 2017లో హత్య చేయించారని బలమైన ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పార్టీ కాంగ్రెస్ సమావేశాల్లో దేశ దీర్ఘకాలిక లక్ష్యాలపై చర్చిస్తున్నట్లు కేసీఎన్‌ఏ తెలిపింది. అమెరికాతో విధానం, అణ్వస్త్ర ప్రణాళికలపై కిమ్ జోంగ్ ఉన్ ఇంకా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. దేశ అణు యుద్ధ నిరోధక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రణాళికలను ఈ సమావేశంలో స్పష్టం చేస్తానని ఆయన గత నెలలో ప్రకటించిన విషయం తెలిసిందే.

# సంక్షిప్తంగా..

## అమెరికాలో తీవ్ర హిమపాతం: 10వేల విమాన సర్వీసులు రద్దు



**వాషింగ్టన్, ఫిబ్రవరి 24:** అమెరికాలో మంచు తుపాను తీవ్రరూపం దాల్చింది. ఈశాన్య ప్రాంతంలో భారీగా మంచు కురుస్తోంది. దీంతో లక్షలాది మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మంచు తుపాను, బలమైన ఈదురు గాలుల కారణంగా రవాణా వ్యవస్థలు స్తంభించాయి. వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. తుపాన్ తీవ్రత దృష్ట్యా విమాన సర్వీసులు రద్దు చేస్తున్నట్లు విమానయాన సంస్థలు ముందుగానే ప్రకటించాయి. శనివారం నుంచి మంగళవారం మధ్య 10 వేల కంటే ఎక్కువ విమాన సర్వీసులు రద్దయినట్లు విమానాల ట్రాకింగ్ సర్వీస్ 'ఫ్లైట్‌అవేర్' పేర్కొంది. ఇందులో ఒక్క సోమవారం రోజే 5 వేల కంటే ఎక్కువ రద్దయ్యాయని తెలిపింది.

## భూకక్ష్యలోకి మళ్లీ చైనా రహస్య అంతరిక్ష విమానం



**బీజింగ్, ఫిబ్రవరి 24:** అంతరిక్ష ప్రయోగాల్లో చైనా దూకుడు ప్రదర్శిస్తోంది. తాజాగా తమ రహస్య అంతరిక్ష విమానం షెన్‌లాంగ్‌ను మరోసారి భూకక్ష్యలోకి ప్రవేశపెట్టింది. జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి లాంగ్‌మార్చ్–2ఎఫ్ రాకెట్ సాయంతో ఈ నెల 7న దీనిని అంతరిక్షంలోకి పంపించినట్లు తెలుస్తోంది. షెన్‌లాంగ్‌ను చైనా భూకక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఇది నాలుగోసారి. అయితే దీని యాత్రలకు సంబంధించిన సమాచారాన్ని బీజింగ్ ప్రభుత్వం అత్యంత రహస్యంగా ఉంచుతోంది. దీంతో ఈ ప్రయోగాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో అంతరిక్షాన్ని మరింత సమర్థంగా వినియోగించుకోవడం, అందుబాటు వ్యయాల్లో ప్రయోగాలను చేపట్టడం వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు వీలుగా తాము ఈ అంతరిక్ష విమాన ప్రయోగాలు చేపడుతున్నట్లు బీజింగ్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## మీరట్‌లో అగ్నిప్రమాదం, ఆరుగురు మృతి



**లక్నో, ఫిబ్రవరి 24:** యుపిలోని మీరట్‌లో జరిగిన అగ్నిప్రమాదం ఘటనలో ఓ ఇంట్లో ఆరుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అయిదుగురు చిన్నారులు ఉన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం. లిసాది గేటు ప్రాంతంలో ఉన్న ఓ ఇంట్లో ఈ ప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి కిద్వాయ్‌నగర్‌లో ఉన్న ఇంటి నుంచి మంటలు వ్యాపించాయని కాలిన గాయాలతో ఉన్న ఏడుగురిని ఆసుపత్రిలో చేర్పించామని, దాంట్లో ఆరుగురు మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారని మీరట్ ఎస్పీ అవినాశ్ పాండే పేర్కొన్నారు. ఇక్బాల్ అహ్మద్ అనే వ్యక్తి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం వచ్చిందని పోలీసులు చెప్పారు. దీంతో ఆ ఇంటి వద్దకు అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు. మంటల్ని అదుపులోకి తెచ్చారు.

## ఐర్లాండ్‌లో భారతీయులే లక్ష్యంగా జాత్యంహాకార దుష్ప్రచారం



**డబ్లిన్, ఫిబ్రవరి 24:** ఐర్లాండ్‌లో ఒక ఫుడ్ బ్యాంక్ వద్ద తీసిన సాధారణ ఫొటో అక్కడ నివసిస్తున్న భారతీయులపై సోషల్ మీడియాలో జాత్యహంకార దాడులకు కారణమైంది. విద్యార్థులు ఎదుర్కొంటున్న జీవన వ్యయ సంక్షోభంపై ప్రచురితమైన ఒక వార్తా కథనం, భారతీయులను లక్ష్యంగా చేసుకుని విద్వేష ప్రచారానికి దారితీయడం ఆందోళన కలిగిస్తోంది. ఐర్లాండ్‌లోని గాల్వే విశ్వవిద్యాలయంలో విద్యార్థులు నిర్వహిస్తున్న స్పెయిర్ స్టూడెంట్ ప్యాంట్రీ అనే ఫుడ్ బ్యాంక్ గురించి ది ఐరిష్ టైమ్స్ పత్రిక ఒక కథనంప్రచురించింది. దేశంలో పెరిగిన ధరల వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఈ వ్యాసంలో వివరించారు. అయితే ఒక ఫొటోలో, ఫుడ్ బ్యాంక్ వద్ద పలు దేశాలకు చెందిన విద్యార్థులు క్యూలో నిలబడి ఉన్నారు. అయితే, సోషల్ మీడియాలో కొందరు ఈ ఫొటోలోని భారతీయ విద్యార్థులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం మొదలుపెట్టారు.

# ఉద్యోగులకు క్యాష్‌లెస్ హెల్త్‌కార్డుల మంజూరుపై హర్షం

## భవిష్యత్తులోనూ పిఆర్‌సి, పెండింగ్ బిల్లులను నెలకు రూ. 700 కోట్ల నుంచి రూ. 1,500 కోట్లు సాధించుకుంటాం

### మీడియా సమావేశంలో తెలంగాణ ఉద్యోగ జెఎసి నేతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు క్యాష్‌లెస్ హెల్త్‌కార్డులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ(టిజిఈజేఏసీ) ధన్యవాదాలు తెలిపింది. సోమవారం జరిగిన కేబినెట్‌లో తీసుకున్న పలు నిర్ణయాలపై జేఏసీ నేతలు హర్షం ప్రకటించారు. కేబినెట్ నిర్ణయాలపై జేఏసీ నేతలు మంగళవారం నాంపల్లిలోని టిఎన్‌జీవో సెంట్రల్ యూనియన్ ఆఫీసులో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ...ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పేరు మార్చి డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మారుస్తూ, ఉద్యోగులకు రూ. 1.20 కోట్ల ప్రమాద బీమా, 60 సంవత్సరాల లోపు సహజ మరణం చెందితే రూ. 10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ మంజూరు జేయడం వంటి నిర్ణయాలను తీసుకున్న కేబినెట్‌కు తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, కార్మిక, ఉపాధ్యాయుల, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉద్యోగుల ఉపసంఘం చైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహ ఐఎఎస్ అధికారుల కమిటీ సభ్యులైన నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, ప్రతేకించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుకు ధన్యవాదములు తెలిపారు. గతంలో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులను ప్రపంచ బ్యాంకు షరతులు అంగీకరించి నాటి ప్రభుత్వం వైద్య విధాన పరిషత్ ఏర్పాటు చేసి ఎంతో మంది ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురిచేసిందని, వైద్యవిధాన పరిషత్ ఉద్యగులకు నెలనాడు జీతాలు రాక, ప్రభుత్వం నుండి లభించే ఎలాంటి సౌకర్యాలు లభించేవి కావన్నారు. వారి సమస్యల పరిష్కారానికి టిజిఈజేఏసీ తరుపున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చామని, ప్రజాప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 12500 మంది ఉద్యోగస్తులకు అలాగే 200 హాస్పిటల్స్ ఒక గొప్పవరంగా మారిందన్నారు. ఇక నుండి తెలంగాణ వైద్య విధాన పరిషత్(టివివిపి) వారికి 010 పద్దు కింద నెలసరి జీతభత్యాలు, ఇతర ప్రయోజనాలు పొందుతారని అలాగే వైద్యవిధాన పరిషత్ లో పనిచేసే స్టాఫ్ నర్స్‌లకు నర్సింగ్ ట్యూటర్‌గా వెళ్ళే అవకాశం లభిస్తుందన్నారు. ఇది టిజిఈజేఏసీ సంఘాల ఐక్యతకు నిదర్శనమన్నారు. తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, కార్మిక, ఉపాధ్యాయుల, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ బాగస్వామ్యంతో నిరంతర కృషి వల్ల ఉద్యోగుల ఆరోగ్య కార్డులు (ఈహెచ్ఎస్) వైద్య విభాగం 010 పద్దుక్రింద జీతాలు తిసుకునే ప్రక్రియా సాధ్యమైందన్నారు. అలాగే భవిష్యతులో కూడ ప్రధాన డిమాండ్‌లైనా పిఆర్‌సి, పెండింగ్ బిల్లులను నెలకు రూ. 700 కోట్ల నుంచి రూ. 1500 కోట్లు ఇచ్చేలా ఐక్యంగా పోరాడి సాధించుకుంటామన్నారు. మీడియా సమావేశంలో మారం జగదీశ్వర్, చైర్మన్, ఏలూరిశ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్, పి. దామోదర్ రెడ్డి, అడిషనల్ సెక్రటరీ జనరల్, కోచైర్మన్స్ చావా రవి, వంగా రవీందర్ రెడ్డి, జి. సదానందంగౌడ్, దాస్యా నాయక్, సి.హెచ్. అనిల్ కుమార్, కోచైర్మన్స్ టి. లింగారెడ్డి, మధుసూధన్ రెడ్డి, ఎం. మణిపాల్ రెడ్డి, జి. శ్రీనివాస్ రెడ్డి, జి. దామోదర్ రెడ్డి, కె. లక్ష్మయ్య, పి. కృష్ణ మూర్తి, అంజి రెడ్డి, వైస్ చైర్మన్స్ చంద్రమోహన్, నూనే శ్రీధర్, డా. నరహరి, ఎం.చంద్రశేఖర్ గౌడ్, తిప్పర్తి యాదయ్య, ఎ. సత్యనారాయణరెడ్డి, మోహన్ నారాయణ, జి. నరసయ్య, ఉమారెడ్డి, డి.సైదులు, రాజాగంగారెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్, రవీందర్‌కుమార్, డా. మార్తా రమేష్, టి కృష్ణమోహన్, డిప్యూటీ సెక్రటరీ జన రల్ ఎస్‌కె హుస్సేని (ముజీబ్), ఎ. సత్యనారాయణ, స్థితప్రజ్ఞ, ఫైనాన్స్ కార్యదర్శి, కె. వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి, బి. శ్యామ్, కార్యదర్శ పద్మావతి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పరిశీలనలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికుల సమస్యలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని.. వాటి పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూప నుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో మంత్రి మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు తనకు కుటుంబ సభ్యులని, ప్రభుత్వ భాగస్వామ్యులన్నారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల గుర్తింపు అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, మిగిలిన అన్ని అంశాలు ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి దృశ్య ఒక్కొకటిగా నెరవేరుస్తున్నామన్నారు. నేను మీ మంత్రిగా, మీ కుటుంబ సభ్యుడుగా, తెలంగాణ ఉద్యమ భాగస్వామిగా ఏ సమస్య అయినా చర్చించి మాట్లాడుకుందాం.. ఆందోళనలు, ప్రేరేపిత నిరసనలు జరగకుండా సంస్థను కాపాడుకుంటూ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తూ సంస్థ పురోగతికి కార్మికుల సంక్షేమానికి కృషి చేద్దాం.. నేను మీతో కలిసి ఉన్న విద్యార్థి నాయకుడిగా, కార్మికుల సమస్యలపట్ల అవగాహన కలిగిన వ్యక్తిగా మీకు విశ్వాసం ఇస్తున్న.. మీ సమస్యలు చెప్పుకోవడానికి మీ కుటుంబ పెద్దగా మా తలుపులు ఎల్లవేళలా తెరిచి ఉంటాయని ముఖ్యమంత్రి తన మాటగా చెప్పమన్నారు. తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సంస్థ పురోగతి, ప్రయాణికుల సౌకర్యం మూడు ఎజెండాల మీద పని చేస్తుందని, కార్మికు లంతా సహకరించాలని కోరుతున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

# సుమన్ బెయిల్‌ను అడ్డుకుంటున్న ప్రభుత్వం

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రఆరోపణలు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం మంటగలుస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు బెయిల్ రాకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. క్యాతనపల్లి ఘటనలో కేసు నమోదు కాగా ప్రస్తుతం అదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న బాల్క సుమన్, నాయకులను సోమవారం కలిసి మూలా ఖాత్ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరి తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. చైర్మన్ ఎన్నిక పూర్తయ్యే వరకు సుమన్‌ను జైలులోనే ఉంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆరోపించారు. ప్రజా స్వామ్యబద్ధంగా జరిగిన మున్సిపల్ ఎన్నికలను వక్రీకరించేందుకు మంత్రి వివేక్ సహా కాంగ్రెస్ నాయకులు నీచ రాజకీయాలకు తెరలేపారన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు నడుం బిగించిన సుమన్‌తోపాటు బిఆర్ఎస్ నాయకులపై అక్రమకేసులు బనాయించి జైలుకు పంపించారాని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అపహస్యంచేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, దీనిపై న్యాయ పోరాటం కొనసాగిస్తామని కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. ఆయన వెంట శాసనసభ్యులు కోరుకంటి చందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# హిందూత్వతో బిజెపి ఉనికి కోసం కేంద్రమంత్రి సంజయ్ ఎత్తులు

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** కరీంనగర్ నగరపాలక బిజెపి కార్పొరేటర్లను హైదరాబాద్ భాగ్యలక్ష్మి ్మ అమ్మవారి దగ్గరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీసుకువచ్చి మతతత్వ రాజకీయాలు మాట్లాడి హైదరా బాద్‌లో బిజెపి ఉనికిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు.

మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరీంనగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ మత విద్వేషాలు రెచ్చగొట్టినా మెజారిటీ రాలేదనీ, హైదరాబాద్ నగరంలో హిందుత్వ రాజకీయాలు చేసి ప్రజల్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీకి మూటలు మోస్తున్నారా లేక నీ తోటి మంత్రులను, బిజెపి నాయకులను కలిసి రాష్ట్ర అభివృద్ధి కోసం మాట్లాడు తున్నారా అనేది మీకు తెలియదా? అని ఆయన ప్రశ్నించారు. చట్టాల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, డిజిపి శివధర్ రెడ్డికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చెప్పాల్సిన అవసరం లేదని చామల అన్నారు.

బిఆర్ఎస్ హయాంలో పోలీసులను ఏవిధంగా వాడుకున్నారో స్వంత మీ చెల్లి చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని కవిత చెప్పారనీ అన్నారు. రెడ్‌బుక్, పింక్‌బుక్, అధికారంలోకి వస్తామనే ఆలోచనలు కెటి రామారావు బంద్ చేయాలని హితవు చెప్పారు. కెటిఆర్ లాగా మేము చట్టాన్ని చుట్టంలాగా వాడుకోవడం లేదని తెలిపారు. మీ పదేళ్ల పాలన చూసి ప్రజలు మిమ్మల్ని శాశ్వతంగా ఇంటికి పంపించారని ఎద్దేవా చేశారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

# ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలుచేయాలి

### టిజిఎస్‌ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని టీజేఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు ఈ.వెంకన్న, టి.థామస్‌రెడ్డి, మహ్మద్ మౌలానాలు డిమాండ్ చేశారు. మంగళవారం టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఆర్టీసీ రక్షణ, సంఘాల కోసం, సమస్యల సాధనకై చలో సెక్రటేరియట్ పేరుతో వేలాది మంది ఆర్టీసీ ఉద్యోగులతో కలసి, భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వారికి అండగా ఉండి, వారి పక్షాన పోరాడతామని హామీ ఇచ్చారు. జేఏసీ నేతలు మాట్లాడుతూ 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్మెంట్‌తో అమలుచేయాలని, మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బులు ప్రతినెల 350 కోట్లు కోత విధించకుండా చెల్లించాలని, ప్రభుత్వం ఇవ్వాల్సిన పాత బకాయిలన్నీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కే.యాదయ్య, ఎస్.సురేష్, బి.యాదగిరి, సంపత్, కమలాకర్‌గౌడ్, రాఘవులు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగా 12 సహకార సంఘాలకే అవకాశం

### ప్రతిపాదిత 345 సంఘాలకు నో

### నాబార్డు అధ్యయనంలో వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయతలపెట్టిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. తెలంగాణలో కొత్తగా వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఏర్పాటుకు సంబంధించి చేసిన 345 ప్రతిపాదనల్లో 12 మాత్రమే అన్ని అర్హతలు ఉన్నట్లు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) అధ్యయనంలో వెల్లడైంది. అయితే కొత్త సహకార సంఘాల ఏర్పాటు కన్నా ముందుగా ప్రస్తుతం ఉన్న సొసైటీలను పటిష్ట పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 906 వ్యవసాయ సహకార, పరపతి సంఘాలు ఉండగా, దూరంగా ఉండి రైతులకు అందుబాటులో లేని ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఇందుకు అను గుణంగా అన్ని జిల్లాలల్లోని సహకార సంఘాల అధికారులు (జిల్లా కోపరేటివ్ అధికారుల (డిసిఒ)) నుండి ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించింది. అధికారులతో పాటు, ప్రజాప్రతినిధులు సైతం తమకు అవసరమైన ప్రాంతాల్లో సహకార సంఘాల ఏర్పాటుకు లేఖలు పంపించాలని కోరింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లా సహకార సంఘాల అధికారుల నుండి 273 వ్యవసాయ సహకార పరపతి సంఘాలను కొత్తగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. అలాగే ప్రజాప్రతినిధుల నుండి మరో 72 సహకార సంఘాల ఏర్పాటుకు లేఖలు వచ్చాయి. ఈ మొత్తం 345 ప్రతిపాదనలపై అధికారులు క్షేత్రస్థాయిలో అధ్య యనం చేశారు. వీటిలోని 260 సహకార సంఘాల పరిధిలోని రైతులు ఇప్పటికే తమ తమ సొసైటీల ద్వారా పంట రుణాలు, ఎరువులు తదితర సేవలను పొందుతున్నట్లు నాబార్డు అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

# కుమ్మెర దోషులపై కఠినచర్యలు తీసుకోవాలి

### ఎంపిల ఫోరం రాష్ట్ర కన్వీనర్ మల్లు రవి

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** కుమ్మెర జాతరలో కులవివక్ష చిన్నారి మృతికి కారణమై సంఘటనలో బాధ్యులు ఎవరైనా నిష్పక్షపాతంగా చట్టరీత్యా దోషులని తేలితే వారు ఎంతటి వారైనా దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని వారిని రిమాండుకు పంపించాలని తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి డిమాండ్ చేవారు. డాక్టర్ మల్లురవి చిన్నారి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని బిసి కమిషన్ నిరంజన్‌ను కోరారు., జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్‌తో, జిల్లా ఎస్పీ సింగ్‌తో ఫోన్‌లో మా ట్లాడి సంఘటన జరిగిన తీరు,పోలీసులు అనంతరం వ్యవహరించి తీరును ఆయన తెలుసుకొన్నారు. కుమ్మెర సంఘటనపై చట్టం తన పని తాను చేసు కొంటూ పోవాలని అధికారులకు ఆయన తెలిపారు.

# ఇఎస్ఐ ఆస్పత్రుల సేవల్లో విప్లవాత్మక మార్పులు

### మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్ (సంజీవరెడ్డినగర్), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఇఎస్ఐ హాస్పిటల్స్ సేవల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. మంగళవారం హైదరాబాద్ సనత్ నగర్ ఇఎస్ఐ హాస్పిటల్ 75 ఫౌండేషన్ డే కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అవయవ దాతలు, డిపెండెంట్ బెనిఫిట్ లబ్ధిదారులు, ఇఎస్ఐ పెన్షనర్స్, సీనియర్ ఇన్సూరెన్స్ లబ్ధిదారులకు సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సనత్ నగర్ ఇఎస్ఐకి మంచి పేరుందని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ముందు ఆలోచనతో కార్మికుల భద్రత కోసం ఈ ఇఎస్ఐ కార్పొరేషన్ స్థాపించారని అన్నారు. దివంగత కాకా వెంకటస్వామి కార్మిక మంత్రిగా ఎన్నో సేవలందించారని, ఆ రోజు ఒక పేషెంట్‌ను చూడటానికి వచ్చినటి ఫెసిలిటీస్‌కి ఇప్పటికి చాలా మార్పులు వచ్చాయన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్స్ గురుంచి చాలా మంది కంప్లెంట్ చేస్తారు కానీ ఇఎస్ఐ హాస్పిటల్ గురించి ఎక్కడ కంప్లైంట్ రాలేదని అన్నారు. హైదరాబాద్‌లో మరో ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మించాలని అన్నారు. దేశంలో పేదలకు కావా ల్సింది విద్యా, వైద్యం. కార్పొరేట్ హాస్పిటల్స్ లక్షలల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయని, కానీ ఇఎస్ఐ లాంటి హాస్పి టల్స్‌లో కార్మికులకు మంచి సేవలు అందుతున్నాయని అన్నారు. తమ ప్రభుత్వం కూడా ప్రోగ్రెసివ్‌గా ఉందని, ఇఎస్ఐ కార్పొరేషన్ ద్వారా మంచి సేవలు అందుతు న్నాయని, శంషాబాద్‌లో హాస్పిటల్ నిర్మాణానికి ల్యాండ్ ఇవ్వడానికి సిఎం ఒప్పుకున్నారని అన్నారు. మన కార్మికులకు మంచి జరుగుతుందని, ఇఎస్ఐ హాస్పిటల్‌లో ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం ఆర్గాన్ డోనర్స్ అందరికీ అభినందనలు తెలిపారు. ఇఎస్ఐ ద్వారా ఇంకా సేవలు విస్తృతంగా పెరగాలని, దానికి కావాల్సిన సాకారం ప్రభుత్వం తరపున ఉంటుందన్నారు.



ఇఎస్ఐ హాస్పిటల్ 75 ఫౌండేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి

# పరీక్ష విద్యార్థి జీవితంలో కొత్త అవకాశాలకు నాంది

### ఇంటర్ విద్యార్థులకు పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ శుభాశీస్సులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** విద్యే భవిష్యత్తుకు బాటలు వేస్తుందని, ఏడాది పాటు విద్య అభ్యసించి రాసే వార్షిక పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో కొత్త అవకాశాలకు నాంది కాగలదనీ ఇంటర్ విద్యార్థులు ఏలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు విజయవంతంగా రాయాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ శుభాశిస్సులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులు జీవితంలో కీలకమైన మెట్టుపైకి పోవడానికి ఈ పరీక్ష ఒక అవకాశం అని మహేష్‌కుమార్‌గౌడ్ హితువచెప్పారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సలహా ఇచ్చారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు మానసికబలం అందించి, ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలని కోరారు. క్రమశిక్షణ, సమయపాలన, పునశ్చరణ వంటి అంశాలు విజయానికి దోహదం చేస్తాయని చెప్పారు. విద్యా ర్థుల శ్రమకు తగినఫలితాలు దక్కాలని ఆకాంక్షిస్తూ, ప్రతి ఒక్కరూ ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నతలక్ష్యాలను చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.




శాలరీ ప్యాకేజీ మేళాలో మాట్లాడుతున్న జైళ్లశాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర

# ఫీజుల రియంబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చే కుట్ర



### వారం రోజుల్లో బకాయిలు విడుదల చేయకపోతే అసెంబ్లీ ముట్టడిస్తాం

### అఖిలపక్ష సమావేశంలో పార్టీలు, విద్యార్థి సంఘాల హెచ్చరిక

**హైదరాబాద్,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడవసారి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్నా గత ఐదు సంవత్సరాలుగా ఉన్న 7వేల కోట్ల ఫీజుల బకాయిలు మాత్రం విడుదల చేయకుండా పేద విద్యార్థుల ఉసురు తీసుకుంటుందని అఖిలపక్ష పార్టీల నేతలు విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకపడ్డారు ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "కాలేజీ విద్యార్థుల కన్నీటి చదువులు "అనే అంశంపై అఖిలపక్ష పార్టీలు సమావేశం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. దీనికి హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజ్‌గిరిఎంపీ ఈటల రాజేందర్, టిఆర్ఎస్ మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జూలూరి గౌరీ శంకర్, తెలంగాణ విటల్, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యాపై పెట్టిన పెట్టుబడిని పెట్టుబడి కోణంలో చూడకుండా మానవ వనరుల అభివృద్ధిగా చూడాలన్నారు. ముఖ్యంగా బడుగుల విద్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిరక్ష్య వైఖరి తగదని తక్షణమే పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల రియంబర్స్మెంట్ సమస్యను ప్రైవేట్ కళాశాల యజమాన్యాల సమస్యగా చూస్తుందని, ఈ సమస్య రాష్ట్రంలో ఉన్నత విద్యను చదువుకుంటున్న లక్షల మంది విద్యార్థుల బాధగా చూడాలని అన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ చలనం లేని గాంధీ విగ్రహానికి 5 వేల కోట్లు ఖర్చు పెడతామని చెబుతున్న ప్రభుత్వం, 22 లక్షల మంది పేద విద్యార్థులు ఫీజుల రియంబర్స్మెంట్ రాక ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వానికి కనికరం లేదని గాంధీ విగ్రహానికి అయ్యే ఖర్చు ఫీజుల రియంబర్స్మెంట్కు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బిసి జేఏసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జైళ్ల సిబ్బందికి శాలరీ ప్యాకేజీ మేళా

### డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర

**హైదరాబాద్ (సైదాబాద్), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** జైళ్ల శాఖ ఆధ్వర్యంలో జైళ్ల శాఖలోని సిబ్బందికి మెరుగైన బ్యాంకింగ్, ఆర్థిక భద్రత సదుపాయాలు అందిం చేందుకు ప్రత్యేకంగా మంగళవారం సికాలో శాలరీ ప్యాకేజి మేళాను నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర హాజరయ్యారు. మేళాను ప్రారంభించిన అనంతరం డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర మాట్లాడుతూ మొత్తం 1,332 మంది జైలు సిబ్బంది పోలీస్ శాలరీ ప్యాకేజీలో కవర్ చేయబడతారని అన్నారు. బీమా రక్షణ, ప్రమాద బీమా, జీవిత బీమా, వైమానిక ప్రమాదబీమా, జీతంపై ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం, రుణ సదుపా యాలు, లాకర్ కేటాయింపులో రాయితీలు వంటివి శాలరీ ప్యాకేజీలో కవర్ కానున్నాయి. సిఎస్ఆర్ కింద ఎస్‌బిఐ, కెనరాబ్యాంక్‌లు జైళ్ల శాఖకు బ్యాటరీ ఆధా రిత వాహనాలను అందజేశాయి. ఎస్‌బిఐలో ఉన్న ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమీషనర్ కార్యాలయానికి చెందిన 350 ఖాతాలు ఎస్‌జిఎస్‌పి శాలరీ ప్యాకేజీలోకి రానున్నాయి.

# కేంద్రం తక్షణమే కగార్ ఆపరేషన్-2 నిలిపివేయాలి

### మావోయిస్టులపై అక్రమ కేసులను తొలగించాలి

### సిపిఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్షాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టులు ప్రజా క్షేత్రంలోకి రావాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ నిర్వహించింది. రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు బండారి రాజ్‌కుమార్, చలపతిరావు( సిపిఐ న్యూడెమోక్రసీ ), రమా (సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్) జానకి రాములు (ఆర్ఎస్‌పి) రమేశ్ రాజా( సిపిఐ ఎంఎల్ లిబరేషన్), పౌర హక్కుల సంఘం నాయకులు నారాయణరావు పాల్గొని ప్రసంగించారు. మావోయిస్టులు లొంగిపోయేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే సుద్భావ వాతావరణాన్ని కల్పించి ఏలాంటి కక్ష ్య సాధింపు చర్యలకు పాల్పడకుండా గౌరవ ప్రదమైన పునరావాసం కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులది మార్క్సిజమే అంతమ లక్ష ్యమని, దానిని నుండి వైదోలగాల్సిన అవసరం లేకుండా మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమ పంథాను మాత్రం మార్చుకోవాల్సిన అవసరముందని ఆ దీశగా మావోయిస్టులు ఆలోచించి జనజీవన ప్రవంతిలోకి రావాలిని కోరారు. మారుతున్న పరిస్థితులు, అందివచ్చిన సాకేంతిక పరిజ్ఞానం నేపథ్యంలో సాయుధ పోరాటం అనేది ఇప్పుడు అసాధ్యమన్న అభిప్రాయాన్ని కూనంనేని వ్యక్తం చేశారు. తుపాకుల ద్వారా కాకుండా ప్రజాస్వామిక ఉద్యమాలు, ప్రజా పోరాటాల ద్వారా సైతం విప్లవాన్ని సాధించవచ్చాని అందుకు నేపాల్ లాంటి దేశాలు ఉదాహరణ అని సాంబశివరావు పేర్కొన్నారు. సిద్ధాంతాలు, రాద్ధాంతాలతో పని లేకుండా కమ్యూనిస్టులందరూ ఏకం కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని దిశగా అందరూ కలిసి అడుగులు వేద్దామన్నారు. రాజ్యానికి దయ, రాజ్య హింసకు కనికరం ఉండదని, ప్రశ్నించే వారి గొంతును నులిమివేయడమే లక్ష ్యంగా ఉంటుందని గుర్తు చేశారు. ఎవరూ ఎవరిని చంపిన చట్ట ప్రకారం నేరమని, మావోస్టులు తప్పులు చేస్తే చట్ట పరిధిలో శిక్షి ంచాలే తప్ప 2026 మార్చి 31 అంటూ లక్ష ్యం పెట్టుకుని చంపివేయడమేంటని కూనంనేని ప్రశ్నించారు. కేంద్రం తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని, మావోయిస్టులు జనజీవన ప్రవంతిలోకి రావాలని కూనంనేని సాంబశివరావు కోరారు. మావోస్టుల సిద్ధాంతాలతో ఏకీభావం ఉండకపోవచ్చుగాని వారిని శత్రు పూరితంగా, ప్రజా కంటకులుగా చూసే దోరణి మాత్రం సరైంది కాదని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. మావోయిస్టులు సైతం బయటికి వచ్చేందుకు సుముఖంగా ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి ఈ సమస్యను శాంతి యూతంగా పరిష్కరించాలని కోరారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 319

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 319 దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 102 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 39 దర ఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 118 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 60దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్,అదనపు కలెక్టర్ సూర్యప్రకాష్, ఎసిపి కిరణ్‌కుమార్ ప్రవాసీ ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్‌రెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# గ్రామీణ మంచినీటి సరఫరాపై పటిష్ట చర్యలు

## మిషన్ భగీరథ ద్వారా ప్రత్యేకడ్రైవ్‌లు చేపట్టండి

### సిబ్బందికి దిశానిర్దేశం చేసిన మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** గ్రామీణ ప్రజలకు నిరంతర, నాణ్యమైన తాగునీటి సరఫరా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న మిషన్ భగీరథ కార్యాలయంలో గ్రామీణ తాగునీటి సరఫరా, వేసవి సన్నద్ధతపై మంగళవారం నిర్వహించిన సమగ్ర సమీక్ష సమావేశంలో ఆమె అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, సీఈలు, ఎస్ఈలు పాల్గొన్నారు.సమీక్షలో భాగంగా మిషన్ భగీరథ సోర్స్ పాయింట్లు, రిజర్వాయర్లలో నీటి లభ్యత, పంపింగ్ వ్యవస్థ, గ్రామాల వారీగా సరఫరా పరిస్థితులపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో తగినంత నీరు నిల్వలో ఉందని, వేసవిలోనూ పెద్ద ఇబ్బందులు ఉండవని వివరించారు.అయితే మంత్రి ప్రతి ఎస్ఈ పరిధిలో ఇంటింటికి తాగునీరు అందుతున్న పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకుని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 24 వేల ఆవాసాల్లో కేవలం 150 ఆవాసాలకు మాత్రమే మిషన్ భగీరథ నీరు అందడం లేదని, ఇటీవల కొత్తగా 397 ఆవాసాలు ఏర్పాటయ్యాయని అధికారులు తెలిపారు. కొండలపై, అటవీ ప్రాంతాల్లో పైప్‌లైన్ వేయడం సవాల్‌గా ఉన్నచోట్ల స్థానిక జల వనరులను వినియోగించి ప్రత్యామ్నాయ పద్ధతుల్లో నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని మంత్రి ఆదేశించారు.ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే మిషన్ భగీరథ లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు. వేసవి దృష్ట్యా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని సూచించారు. సర్పంచ్‌లతో సమన్వయం చేసుకుని గ్రామాల వారీగా సరఫరా పరిస్థితిని సమీక్షించి, సరఫరా జరిగిందని వారి సంతకాలు తీసుకోవాలని తెలిపారు. సర్పంచ్‌ల ఫోన్ కాల్స్‌కు తక్షణ స్పందన ఇవ్వాలని, సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.అలాగే గ్రామాల వారీగా తాగునీటి అవసరాలు, సరఫరా పరిస్థితులపై సర్పంచ్‌లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించాలని మంత్రి సూచించారు. అప్పుడే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయి. ప్రజలకు ఏ ఇబ్బంది ఉన్నా వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవచ్చు అని ఆమె పేర్కొన్నారు.గతంలో మాదిరిగా వాస్తవాలను దాచిపెట్టి 100 శాతం నల్లా నీటి సరఫరా జరుగుతోందని నివేదికలు ఇవ్వాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఉన్న వాస్తవా లను నిజాయితీగా తెలియజేసి సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. గ్రామీణ తాగునీటి సరఫరా కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ ప్రజల అవసరాలు తీర్చుతోందని చెప్పారు. ఈ రంగానికి తగిన నిధులు విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు పెంచాలని, ప్రజల్లో మిషన్ భగీరథ నీటిపై నమ్మకం పెంపొందించాలన్నారు. గ్రామసభల్లో మిషన్ భగీరథ నీటి వినియోగంపై తీర్మానాలు చేయించి అవగాహన పెంచాలని సూచించారు. సమ్మక్క-సారలమ్మ మహా మేడారం జాతర సందర్భంగా ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా సమర్థవంతంగా పనిచేసిన మిషన్ భగీరథ ఇంజనీరింగ్ సిబ్బందిని మంత్రి సీతక్క అభినందించారు. వారికి శాలువాలు కప్పి, మోమెంటోలు అందజేసి సత్కరించారు.



# జ్యోతిష్కుడికి 200 యేళ్ల జైలుశిక్ష విధించిన పోక్సో కోర్టు!

**చెన్నై, ఫిబ్రవరి 24:** బాలికలపై లైంగిక వేధింపులకేసులో ఒక జ్యోతిష్కుడికి పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 200 ఏళ్ల జైలుశిక్ష విధించింది. బాధితులకు రూ.2 లక్షలపరిహారం చెల్లించాలని తమిళనాడుప్రభుత్వాన్ని సైతం ఆదేశించింది. 2021లో శివగంగ జిల్లా మానగిరివాసి రామకృష్ణన్ అనే 52 ఏళ్ల జ్యోతిష్కుడిని ఒక మహిళ ఆశ్రయించింది. తన కుమార్తెలకు చదువులో పురోగతి లేదంటూ రామకృష్ణన్‌ను సంప్రదించింది. తనవెంట ఇద్దరు కూతుళ్లను తీసుకుని ఆతడివద్దకువెళ్లి పరిష్కారం చూపించాలనికోరింది. ఇద్దరు బాలికలను తన ఇంటికి తీసుకురావాలని చెప్పిన జ్యోతిష్కుడి మాటలు నమ్మిన ఆ మహిళ ఇద్దరు కూతుళ్లను పూజారి ఇంటికి తీసుకెళ్లింది.తల్లిని వేరే గదిలో ఉంచి ఇద్దరు బాలికలను మరో గదికి తీసుకెళ్లాడు. తర్వాత వారిద్దరిపైనా లైంగిక దాడికి పాల్పడినట్లు ఆమహిళ ఆరోపించింది. బయటపెడితే తల్లితండ్రులకు కీడుజరుగుతుందని బెదిరించాడు. కొంతకాలంగా బాలికలకు అనారోగ్యసమస్యలు తలెత్తడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీనితో వైద్యులు బాలికలకు లైంగిక వ్యాధి ఉందని తెలిపారు. దీనితో పిల్లల్ని విచారిస్తే జ్యోతిష్కుడి నిర్వాకం బయటపడింది. పోలీసుల ఫిర్యాదుతో పూజారిపై తిరుపత్తూరు మహిళాపోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసునమోదుచేసారు. ఈ కేసు విచారణలో మంగళవారం శివగంగ జిల్లాపోక్సో కోర్టు జ్యోతిష్కుడికి 200 సంవత్సరాల జైలుశిక్ష, రూ.2 లక్షలజరిమానా విధిసునతన్నట్లు జడ్జి గోకుల్ మురుగన్ తెలిపారు. బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించారు.

# లంచ్ బ్రేక్ అరగంటే.. ముచ్చట్లు కుదరవు

## విద్యుత్ సౌధలో ఉద్యోగులకు రూల్స్!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి24:** హైదరాబాద్ విద్యుత్ సౌధలో పని చేస్తున్న ఉద్యోగులకు కొత్త రూల్స్ పెడుతూ ట్రాన్స్‌కో ఎండీ కృష్ణభాస్కర్ ఉత్తర్వులు ఇచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల మధ్య అరగంట మాత్రమే లంచ్ బ్రేక్ ఉంటుందని తెలిపారు. డ్యూటీ సమయంలో వాకింగ్,ముచ్చట్లు పెట్టడం కుదరదని స్పష్టం చేశారు. ఎమర్జెన్సీ, ముఖ్యమైన కాల్స్‌కు మాత్రమే మొబైల్ ఫోన్ వాడాలని పేర్కొన్నారు. డ్యూటీ ఆవర్స్‌లో కచ్చితంగా సీట్లలో అందుబాటులో ఉండాల్సిందేనని చెప్పారు.

# జెఇఇ మెయిన్ పేపర్-2లో ఇద్దరు తెలంగాణ విద్యార్థులకు 99.99 పర్సంటైల్

## ఫలితాలను విడుదల చేసిన ఎన్‌టిఎ

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** మంగళవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్-2026 సెషన్ 1 పేపర్-2 ఫలితాలను విడుదల చేసింది. ఫలితాల్లో తెలంగాణకు చెందిన ఇద్దరు విద్యార్థులు టాప్ స్కోర్‌ను సాధించారు. పేపర్-2లో బీఆర్క్ అడ్మిషన్ల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తెల్లూరి శ్రేయాస్ రెడ్డి 99.9911995 పర్సంటైల్ సాధించగా, మద్దూరి నాగ ప్రద్యుమ్న రెడ్డి బీప్లానింగ్ ప్రవేశ పరీక్షలో 99.9905065 పర్సంటైల్ సాధించారు. ఇద్దరు అభ్యర్థులు తమ తమ విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్లుగా నిలిచారు. కేరళకు చెందిన సూర్యతేజస్ ఎస్, గౌరీ శంకర్ వి బీఆర్క్, బీప్లానింగ్ ప్రవేశ పరీక్షలలో వరుసగా 100 పర్సంటైల్ సాధించి దేశంలోనే టాపర్లుగా నిలిచారు. మొత్తం 64,786 మంది అభ్యర్థులు పేపర్-2కి రిజిస్టర్ చేసుకోగా వారిలో 45,452 మంది బీఆర్క్ పరీక్షకు హాజరయ్యారు. బీ ప్లానింగ్‌కి దేశంలో 32,366 మంది రిజిస్టర్ చేసుకోగా వారిలో 21,067 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఫలితాలను ఎన్‌టిఏ తన అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చింది.

# హాల్‌టికెట్ ఉంటే ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు ఎక్కడైనా దిగవచ్చు

## పరీక్షలు జరిగే రోజుల్లో ఆర్టీసీ ప్రత్యేక ఆపరేషన్స్

### బాగా రాసి మంచి మార్కులు సాధించాలి

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యం లో ఆర్టీసీ బస్సు ఆపరేషన్స్‌పై సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నేటి నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానుండగా, మార్చ్ 14 వ నుండి పదవ తరగతి పరీక్షలు ఉండడంతో పరీక్షల సమయాల్లో ఉదయం, మధ్యాహ్నం సమయంలో అదనంగా బస్సులు ఉంచేలా చర్యలు తీసుకున్నట్టు ఆర్టీసీ అధికారులు మంత్రికి తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రభుత్వం పక్షాన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి ఇతర ఆర్టీసీ అధికారులతో ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల సమీపిస్తుండడంతో విద్యార్థులకు బస్సులు ఇబ్బందులు లేకుండా కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్షించుకోవడం జరిగిందనీ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు బస్సులు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బస్సుల ఆపరేషన్ మరింత కిందిస్థాయి వరకు పంపించడం జరిగిందన్నారు. పరీక్షా సమయంలో బస్సుల హాల్టు స్టాప్ ఉన్నా లేకున్నా బస్సులు ఆగేలా హాల్ టికెట్ ఆధారంగా పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను దిం పేందుకు చర్యలు తీసు కోవడం జరిగిందన్నారు. దీనిని ప్రతి డిపో మేనేజర్ ద్వారా ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ సౌకర్యాన్ని విద్యార్థులు వినియోగించుకుని ఎలాంటి మానసిక ఆందోళన చెందకుండా పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని శుభాకాంక్షలు తెలియజేశారు. హాల్ టికెట్ ద్వారా విద్యార్థులకు కావాల్సిన స్టాప్ దగ్గర దిగడానికి ఉపయోగించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. పరీక్షలు మీ జీవితంలో ఒక ముఖ్యమైన దశ...ఈ పరీక్షలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని, మీరు సంవత్సరం పొడవునా కష్టపడి చదివిన ప్రతిఫలం తప్పకుండా మీకు దక్కుతుందన్నారు. ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయండి. సమయపాలన పాటించండి. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆశిస్తూ ప్రతి ఒక్క విద్యార్థికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నానని మంత్రి తెలిపారు.

**మీ టికెట్ పేరుతో మొబైల్ యాప్ సచివాలయంలో ప్రారంభించిన మంత్రి పొన్నం**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) ప్రయాణికుల సౌలభ్యం కోసం మీసేవ మీ టికెట్ మొబైల్ యాప్ ద్వారా సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించి యాప్‌ను మంగళవారం సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ యాప్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్



రాజ్, ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి, మీసేవ కమీషనర్ రవికిరణ్ పాల్గొన్నారు. ఈ కొత్త విధానం ద్వారా మీ టికెట్ మొబైల్ యాప్ ఆన్‌లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం(ఓపిఆర్ఎస్) సేవలను కూడా అనుసంధానిస్తుంది.

ప్రయాణీకులు సుదూర ప్రయాణాలు, ఇంటర్‌సిటీ బస్సు టిక్కెట్లను డిజిటల్‌గా బుక్ చేసుకోవడానికి వీలు కల్పించనుంది. యాప్ ఆవిష్కరణ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ మీ సేవ మొబైల్ యాప్ ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడి నుండి ఎక్కడికైనా ప్రయాణం చేయడానికి మీ టికెట్ తీసుకునే అవకాశాన్ని ఆర్‌టిసి కల్పించిందన్నారు. ఇది ఆర్టీసీలోని ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, మెట్రో, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లతో పాటు అన్ని బస్సుల్లో ఈ సదుపాయాన్ని కల్పించిందన్నారు. టికెట్లు, పాస్ లు, టి24 టికెట్స్ ఏదైనా మీ సేవ మొబైల్ యాప్ ద్వారా తీసుకోవచ్చని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక టెక్నాలజీ అనుగుణంగా ప్రయాణికుల సౌకర్యం కోసం తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఆర్టీసీ తీసుకొచ్చిన డిజిటల్ సర్వీసులను ప్రజలంతా ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు. ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి మాట్లాడుతూ.. మీ సేవా మొబైల్ యాప్ ద్వారా ఐదు రకాల బస్సు పాసులు అందుబాటులో ఉన్నాయన్నారు. సిటీ ఆర్డినరీ బస్సుపాస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్, గ్రీన్ మెట్రో లగ్జరీ పాస్, పుష్పక్ పాసులు ఈ యాప్ ద్వారా తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఆర్టీసీ నూతనంగా తీసుకొచ్చిన మీ సేవా మొబైల్ యాప్‌ను ప్రజలంతా ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిజీఎస్ ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్, వెంకన్న, ఖుస్రో షా ఖాన్, రాజశేఖర్, ఫైనాన్స్ అద్వైజర్ విజయపుష్ప, సిటీఎం శ్రీదేవి, సిఈ(ఐటి) శ్రీదేవి, హైదరాబాద్, రంగారెడ్డి ఆర్ఎంలు సుధాపరిమళ, శ్రీలత పాల్గొన్నారు.

# ట్రంప్ మరిన్ని సుంకాలు!

## వాణిజ్య విస్తరణ చట్టం 1962, 1974లను ప్రయోగించాలని కసరత్తులు



**వాషింగ్టన్, ఫిబ్రవరి 24:** ట్రంప్ విధించినసుంకాలు చెల్లనేరవని రద్దుచేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అధ్యక్షుడి వైఖరిలో మార్పురావడంలేదు. 15 శాతం సుంకాలు తప్పవని ప్రకటించిన ట్రంప్ తన సోషల్‌మీడియాలోప్రకటించవరకే పరిమితం అయ్యారు. వాటిపై ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు వెలువడకపోవడంతో ఇపుడు వాటి అమలుకూడా అనుమానంగానే కనిపిస్తోంది. ఈలోపు మళ్లీ ట్రంప్ యంత్రాంగం కొత్త మెలిక పెడుతోంది. కొత్త జాతీయ భద్రత ట్యారిఫ్ నిబంధనల కింద సుంకాలు వేయాలని యోచిస్తోంది. కొత్తగా ఉన్న నేషనల్ సెక్యూరిటీ ఇన్వెస్టిగేషన్స్‌ను అమలు చేసేందుకు నిర్ణయించారు. వాణిజ్యవిస్తరణ చట్టం సెక్షన్ 232ను ప్రయోగించి మళ్లీ సుంకాలు రాబట్టేయోచనలో ట్రంప్ ఉన్నారు. ఇదే చట్టంలోని సెక్షన్ 301 ప్రయోగించి అక్రమ వాణిజ్య విధానాలపై దర్యాప్తుచేసి మేజర్ వాణిజ్య భాగస్వాములపై చర్యలకు ఉపక్రమించడంద్వారా అదనపు సుంకాలు వసూలుచేయవచ్చన్న భావనతో ఉన్నారు. ఈచట్టం అమలులోకి వస్తే కొత్తసుంకాలు అమలుకు దారులు తెరుచుకుంటాయి. ఇప్పటికే వాణిజ్యపరంగా అనేక రంగాల దిగమతులు ప్రభావంచూపిస్తున్నాయన్నది ప్రత్యేకపరిశీలనచేస్తున్నారు. వాటిలో బ్యాటరీలు, కాస్ట్ ఐరన్, ఐరన్ ఫిట్టింగ్స్, విద్యుత్‌గ్రిడ్ సామగ్రి వంటివి ఉన్నాయి. ఈ ప్రతిపాదించే విచారణలు ట్రేడ్‌విస్తరణ చట్టం 1962లోని సెక్షన్ 232 ప్రకారం జరుగుతాయి. ఈ ప్రొవిజన్‌కిందజాతీయ భద్రత సాకుతో సుంకాలు వేసే అవకాశం కల్పిస్తోంది. అమెరికా వాణిజ్య మంత్రి జమీసన్ గ్రీర్ మాట్లాడుతూ మాయంత్రాంగం 1974 వాణిజ్యచట్టం సెక్షన్ 301 ప్రకారం కూడా విచారణలు, దర్యాప్తులుచేస్తుందని ఈ ప్రకారం చూస్తే సుంకాలు వేయవచ్చని ఇతర దేశాలు ఎక్కడయినా తమ వాణిజ్యచట్టాలు ఉల్లంఘిస్తున్నట్లు తేలితే భారీ సుంకాలు ఉంటాయనిగ్రీర్ హెచ్చరించారు. మరోపక్క సుప్రీంకోర్టు తీర్పును సాకుగా తీసుకుని లబ్ధిపొందాలనిచూస్తే దేశాలపై మరింతగా భారీ సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. ఈప్రకారం చూస్తుంటే ఎట్టిపరిస్థితుల్లోను సుంకాల బాటను ట్రంప్ వీడే ధోరణిలో లేరని స్పష్టం అవుతోంది.

# ఆత్మవిశ్వాసమే విజయానికి నాంది

## ధైర్యంగా ముందుకు సాగండి

### ఇంటర్ విద్యార్థులకు

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పిలుపు

**హైదరాబాద్ ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:** నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విద్యార్థులకు బెస్ట్ అఫ్ లక్ చెప్పారు. పరీక్ష భవిష్యత్తుకు ముగింపు కాదని, కొత్త ఆరంభానికి నాందని, భయాన్ని దూరం పెట్టి, ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకుంటే విజయం మీ వెంట వస్తుందని స్పష్టం చేశారు.

విద్యార్థుల జీవిత ప్రయాణంలో ఈ పరీక్షలు ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొంటూ, ప్రశాంతమైన మనసుతో, సమయపాలనతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. భయం విజయానికి అడ్డుకట్ట.. ఆత్మవిశ్వాసం విజయానికి మెట్టు అని స్పష్టం చేశారు. ఎస్సీ గురుకులాలు, ఎస్టీ గురుకులాలు, ఎస్సీడీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాల విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సీ గురుకుల పరిధిలో, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 14,267 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 13,928 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఎస్టీ గురుకుల పరిధిలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 7,468 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 7,155 మంది ఉన్నారు. అలాగే ఎస్సిడిడి ఆధ్వర్యంలో నడుస్తున్న కళాశాల విద్యార్థులు కూడా మొదటి సంవత్సరం వారు 4643 మందికాగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3399 మంది ఉన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మొత్తం 100 మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు.

**ఇంటర్ స్టూడెంట్స్‌ఆల్ ది బెస్ట్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులందరికీ రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ పరీక్షలు ప్రతి విద్యార్థి భవిష్యత్ నిర్ధేశించి ఎదుగుదలకు తోడ్పడుతోందని అని పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, ధైర్యంగా,ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు.

తల్లిదండ్రులు కూడా పిల్లలకు మానసిక బలం అందించి, ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలని కోరారు. క్రమశిక్షణ, సమయపాలన, పునశ్చరణ వంటి అంశాలు విజయానికి దోహదం చేస్తాయని ఆయన చెప్పారు.విద్యార్థుల శ్రమకు తగిన ఫలితాలు దక్కాలని ఆకాంక్షిస్తూ, ప్రతి ఒక్కరూ ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు.విద్యే భవిష్యత్తుకు బాటలు వేస్తుందని, ఈ పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో కొత్త అవకాశాలకు నాంది కావాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదు

## ఇంటర్, ఎస్ఎస్‌సి పరీక్షలపై కలెక్టర్లు, ఎస్పీలతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 24:** రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్ మీడియేట్, ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రరీక్ష ప్రారంభం తర్వాత ఐదు నిమిషాల వరకు హాజరయ్యేందుకు అనుమతినిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్.పీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నేడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ ఫిబ్రవరి 25 వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలు మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమ వుతున్నాయని, ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈసారి పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత విజిలెన్స్‌గా ప్రత్యేక దృష్టి సాధించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్‌ల సౌకర్యాలు కల్పించడంతో పాటు సి.సి టీవీ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ కేంద్రంలో ఒక ఏ.ఎన్.ఎం, ఫస్ట్ ఎయిడ్




కిట్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదని అన్ని కేంద్రాలలో బెంచీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్షలకు 4,89,055 మంది ఫస్ట్ ఇయర్ కు 4,53,832 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ కు హాజరవుతున్నారని అదేవిధంగా 5,28,239 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు.

పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్‌లు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను అనుమతించడం లేదని కేవలం పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే ఎమర్జెన్సీ పరిస్థితులలో ఉపయోగించడానికి సెల్ ఫోన్ ను అనుమతిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లోక్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఏ పరీక్షా కేంద్రంలో నైనా ఏవిధమైన అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ప్రతీ పరీక్ష ప్రశ్న పత్రానికి ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్, సీరియల్ నెంబర్ ఉంటుందని పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగా మాత్రమే ప్రశ్నా పత్రాలను ఓపెన్ చేయాలని స్పష్టం చేసారు. ఈసారి మొదటి సారిగా విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు.

కాగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లను ఆదేశించారు.



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# నాగర్‌కర్నూల్ పసిపాప మృతి ఘటనపై సిఎం దృష్టికి

## న్యాయం కోరుతూ ఆర్.కృష్ణయ్య ర్యాలీ

### బాధిత కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం డిమాండ్.. బిసి నేతల సంఘీభావం

**హైదరాబాద్ ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిపాప మృతి ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్న నేపథ్యంలో, బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని కోరుతూ బీసీ ఉద్యమ నేత , బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి దృష్టికి అంశాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనపై తక్షణమే నిష్పాక్షిక, వేగవంతమైన దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మల్లన్న జాతర సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణలో రజక కుటుంబానికి చెందిన శిశువు మృతి చెందడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఆర్.కృష్ణయ్య స్వయంగా నాగర్‌కర్నూల్‌కు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

కుటుంబ సభ్యుల వేదనను తెలుసుకుని సంఘీభావం ప్రకటించిన ఆయన, చిన్నారి ప్రాణం కోల్పోయిన ఈ విషాదాన్ని సాధారణ ఘటనగా చూడరాదు. ఇది సమాజ మనస్సాక్షిని కదిలించిన సంఘటన అని పేర్కొన్నారు. ఘటనపై ఎటువంటి రాజకీయ లేదా స్థానిక ప్రభావాలు లేకుండా పారదర్శక దర్యాప్తు జరపాలని, అవసరమైతే ప్రత్యేక దర్యాప్తు బృందం నియమించాలని ఆర్.కృష్ణయ్య సూచించారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం సహా వర్తించే అన్ని కఠిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# తమిళనాడులో మరో రాజకీయ పార్టీ

## పార్టీ జెండాను ఆవిష్కరించిన జయలలిత నెచ్చెలి శశికళ

**రామనాథపురం, ఫిబ్రవరి 24:** తమిళనాడులో మరో కొత్త రాజకీయ పార్టీ ప్రారంభం అవుతోంది. దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వీకే శశికళ కొత్త పార్టీ ప్రకటించారు . రామనాథపురం సభలో పార్టీని ప్రకటించిన శశికళ త్వరలోనే పార్టీపేరును కూడా వెల్లడిస్తానని చెప్పారు. అంతేకాకుండా పార్టీ జెండాను ఆవిష్కరించారు. మనం కొత్త రాజకీయ అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నాం. ఈ పార్టీ పేదలు, అణగారిన వర్గాలు మరియు సామాన్య ప్రజల కోసం పనిచేస్తుంది అని శశికళ పేర్కొన్నారు. పార్టీ ద్రవిడ ఉద్యమాన్ని అనుసరిస్తుందని, ఎంజీఆర్, జయలలిత వంటి నేతల బాటలో నడుస్తుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో శశికళ కొత్త పార్టీ జెండాను కూడా ప్రవేశపెట్టారు. ఈ జెండా నలుపు, తెలుపు, ఎరుపు రంగులను కలిగి, పెరారిగ్నార్ అన్నా, ఎంజీఆర్, జయలలిత చిత్రాలను కలిగి ఉంది. 2016లో జయలలిత మరణం తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు శశికళను ముఖ్యమంత్రిగా కోరినప్పటికీ, ఆమె నిరాకరించిందని, పన్నీర్‌సెల్వం ముఖ్యమంత్రిగా కొనసాగినట్లు తెలిపారు. ఆ తర్వాత ఆమెపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల కారణంగా ఎఐఎడిఎంకె నుండి బహిష్కరణకు గురయ్యారు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది ప్రథమార్థంలో జరగనుండగా ఇప్పుడు కొత్త పొలిటికల్ పార్టీతో మరింత హీట్ పెంచినట్టు అయ్యింది.



రాజకీయాల్లో నా మార్క్ ఏంటో చూపిస్తాను అని ప్రకటించిన శశికళ జయలలితను నేనే చంపానని దుష్ప్రచారం చేశారని ఫైర్ అయ్యారు. పళనిస్వామిని సీఎం చేసి తప్పు చేశాను నన్ను పార్టీ నుంచి అవమానకరంగా గెంటేశారు అంటూ శశికళ ఆవేదన వ్యక్తం చేశారు.



వైరాలోని ఐఎంఎల్ డిపో ఏదురుగా జాతీయ ప్రధాన రహదారిపై మంగళవారం ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు సుమారు రూ. 67.20 లక్షలు విలువ చేసే గంజాయిని పట్టుకున్న దృశ్యం

# వైరాలో రూ.67. 20 లక్షలు విలువ చేసే గంజాయి పట్టివేత

**వైరా టౌన్ ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త)** వైరాలోని ఐఎంఎల్ డిపో ఏదురుగా జాతీయ ప్రధాన రహదారిపై మంగళవారం ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు సుమారు రూ. 67.20 లక్షలు విలువ చేసే గంజాయిని పట్టుకున్నారు. 101.5 కిలోల ఎండు గంజాయి తో పాటు 2.7 కిలోల హాషీష్ ఆయిల్ ను ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర ఎన్ ఫోర్స్ మెంట్ జాయింట్ కమిషనర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ సిహెచ్ శ్రీహరిరావు, సిబ్బంది మంగళవారం వైరాలోని ఐఎంఎల్ డిపో ఏదురుగా జాతీయ ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా హెచ్ ఆర్ 07 ఎన్ 6184 నెంబర్ గల మారుతి కారును అధికారులు పరిశీలించగా.. ఆ కారులో 101.5 కేజీల ఎండు గంజాయి తో పాటు 2.7 కేజీల హాషీష్ ఆయిల్ లభ్యమైంది. వీటి విలువ సుమారు రూ.67.20 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్ కు చెందిన మహమ్మద్ అస్లామ్ ఒడిశా రాష్ట్రం కలిమెల నుంచి హైదరాబాద్ కు ఎండు గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నట్లు ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల విచారణలో తేలింది. పట్టుబడిన గంజాయి తో పాటు హాషీష్ ఆయిల్, గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న మారుతి కారును, రవాణా దారుడు మహమ్మద్ అస్లామ్ తో పాటు అతని సెల్ ఫోన్ ను వైరా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా సంబంధించిన సమాచారం తెలిసిన వారు 18004252523 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుళ్ళు ఎంఏ కరీం, బాలు, కానిస్టేబుళ్ళు సుధీర్, వెంకట్, హరీష్, వీరబాబు, హనుమంతరావు, విజయ్, ఉపేందర్ పాల్గొన్నారు.

# ఎసిబి వలలో మాసబ్ ట్యాంక్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్


ఎసిబి అధికారులకు పట్టుబడిన ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏవో)మామిడి శెట్టి శ్రీనివాస్ రావు

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** మాసాబ్ ట్యాంక్ ఎలక్ట్రిసిటీ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏవో) మామిడి శెట్టి శ్రీనివాస్ రావు వినియోగదారుడు నుంచి 16 వేల రూపాయల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మంగళవారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. హైదరాబాద్ సిటీ ఆంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) డీఎస్పి గంగసాని శ్రీధర్ కథనం ప్రకారం...మాసాబ్ ట్యాంక్ ఎలక్ట్రిసిటీ కార్యాలయం పరిధిలోని ఓ బాధితుడు కరెంటు మీటర్ ట్యాంపరింగ్ కి పాల్పడ్డాడని కేసు నమోదు చేస్తానని బెదిరించి, మీటర్ ను అసిస్టెంట్ ఇంజనీర్ (ఏవో) తీసుకొని వచ్చాడు. అంతే కాకుండా కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూపాయలు 17 వేల రూపాయలు లంచం ఇవ్వాలని బాధితుని అసిస్టెంట్ ఇంజనీర్ (ఏవో) డిమాండ్ చేశారు. అయితే బాధితుడు 16 వేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని రిమాండ్ కు తరలించినట్లు ఏసీబీ అధికారి శ్రీధర్ తెలిపారు. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే సెల్ ఫోన్ నెంబర్ 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు లేదా 9440 4461 06 కు ఫోన్ చేయాలని తెలిపారు. బాధితుడు, ఫిర్యాదుదారుడి పేరు మరియు వివరాలను గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు.

# సైబర్ నేరగాళ్ల పట్టివేతకు దేశ వ్యాప్తంగా దాడులు

## 16 రాష్ట్రాల్లో 104 మంది అరెస్టు, రూ.36 లక్షలు, 200 సెల్‌ఫోన్లు జప్తు


సైబర్ నేరగాళ్ల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల భరతం పట్టేందుకు హైదరాబాద్ సైబ ర్ క్రైం పోలీసులు దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాలలో దాడులు చేబట్టి 104 మందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి బాధితుల నుంచి కాజేసిన 36 లక్షల రూపాయల నగదుతో పాటు 200పైగా సెల్‌ఫోన్లను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు మంగళవారం మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఇటీవల వెలుగు చూసిన భారీ సైబర్ నేరాలపై నమోదైన కేసులను విచారించే క్రమంలో దర్యాప్తు అధికారులకు కీలక సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు 16 రాష్ట్రాలలో పది రోజుల పాటు 32 సైబర్ క్రైం పోలీసు బృందాలు దాడులు చేబట్టాయి. ఈ సందర్భంగా 104 మంది కరడుగట్టిన సైబర్ నేరగాళ్లు అరెస్టయ్యారు. అరెస్టయిన నేరగాళ్లలో మ్యూల్ ఖాతాలను విదేశాల్లో వుండే సైబర్ నేరగాళ్లకు ఇచ్చిన లోకల్ నేరగాళ్లు 86 మంది వుండగా, వీరితో పాటు వుండి నేరాలలో పాలుపంచుకున్న మరో 17 మంది వున్నారు. వీరితో పాటు సైబర్ నేరాలలో నేరగా ళ్లకు సహకరించిన బందన్ బ్యాంకు అధికారి ఒకరు వున్నారు. వీరంతా దేశ వ్యాప్తంగా 1055 సైబర్ నేరాలలో పాలుపంచుకున్నారు. ఈ కేసుల్లో వీరు 127 కోట్ల రూపాయలను బాధితుల నుంచి దోచుకున్నారు. నిందితుల నుంచి 204 సెల్‌ఫోన్లు, 141 సిం కార్డులు, 152 బ్యాంక్ పాస్ పుస్త కాలు, 234 డెబిట్ కార్డులు, 26 లాప్‌టాప్‌లు, 36 లక్షల రూపాయల నగదు, వివిధ కంపెనీలకు చెందిన 56 నకిలీ రబ్బరు స్టాంపులు జప్తు చే శారు. మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, కర్నాటక, యుపి, గుజరాత్, హరియాణా, పంజాబ్, ఎపి, అస్సాం, మధ్యప్రదేశ్, బిహార్, ఉత్తర్‌ఖండ్. ఒడిషా రాష్ట్రాలలో ఈ దాడులు జరిగాయి. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని అరవింద్ బాబు కోరారు.

# రాష్ట్రంలో 16.15 లక్షల టన్నుల పత్తి కొనుగోలు

## మద్దతు కంటే తగ్గిన మండీ ధరలు - భారీగా నష్టపోయిన పత్తి రైతులు


**హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**: రాష్ట్రంలో ఇప్పటి వరకూ 16.15 లక్షల టన్నులకు పైగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోలు చేసింది. పొడవైన పత్తికి క్వింటాలుకు రూ.8,110, మధ్యస్థ పత్తికి రూ.7,710 కనీస మద్దతు ధరను కేంద్రం నిర్ణయించింది. అయితే అధిక తేమ 8 నుండి 12 శాతం పరిమితి మించి ఉందన్న కారణంగా సిసిఐతో పాటు, ప్రైవేటు వ్యాపారులు మరింత తక్కువ ధరలకు కొనుగోళ్లు చేసినట్లు రైతులు వాపోతున్నారు. ఈ నేపధ్యంలో ఈ నెలలో స్థానిక మండీలలో ధరలు క్రమేపీ మారుతూ వచ్చాయి. కొన్ని ప్రాంతాలలో క్వింటాలుకు రూ. 4,500 మరియు రూ.7,700 మధ్య ధరలకు కొనుగోలు చేయడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో కొంతమంది రైతులు కఠినమైన తేమ శాత ప్రమాణాలు, సేకరణ పరిమితులతో సమస్యలను ఎదుర్కొన్నారు. దీని ఫలితంగా ప్రైవేట్ వ్యాపారులకు భారీగా అమ్మకాలు జరిగాయి. కాగా పత్తి సాగు చేస్తున్న రైతులు ఈ ఏడాది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పత్తి ఏరివేతకు అవసరమైన కూలీలు దొరకకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు గ్రామాల్లో చేన్లలోనే దూదిపూలు మిగిలిపోయి రాలిపోతున్నాయి. కూలీల కొరత కారణంగా పంటను సకాలంలో ఏరలేక రైతులు ఆందోళన చెందు తున్నారు. ప్రధానంగా వలస కూలీలు అందుబాటులో లేకపోవడం, ఉపాధి హామీ పనులు కొనసాగుతుండడం, వంటి కారణాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. రోజుకు కూలీ ధర కిలోకు 15 నుంచి 20 పెరిగినా పనికి వచ్చే వారి సంఖ్య తగ్గిపోవడంతో పంట నష్టపోయే పరిస్థితి నెలకొంది. పత్తి పూలు పూర్తిగా ఏరుకోకపోతే దిగుబడి తగ్గడంతో పాటు నాణ్యతపై కూడా ప్రభావం పడే అవకాశాలు ఉండటంతో రైతులు ఏం చేయాలో దిక్కుతో చని పరిస్థితిలో ఉన్నారు. ఈ ఏడాది భారీ వర్షాల కారణంగా పత్తి పంట పూర్తిగా దెబ్బతినగా ఉన్న కాస్త పత్తి పంట ఏరివేతకు కూలీలు దొరకక చేసిన అప్పులు తీర్చలేక ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా ఈ వానాకాలంలో పత్తి దిగుబడి తగ్గడంతో రైతు లు తీవ్ర నిరాశ చెందారు. మొలక దశ నుంచి అతి వృష్టి కలుపుతీత, పంట పెట్టుబడి ధరలు అమాంతం పెరుగడంతో రైతులు పంట చేతికివచ్చే వరకు నష్టాలు.

# కల్తీ లడ్డూలు 20 కోట్లు

## వెంకటేశ్వర స్వామికి తీరని అపచారం

### సుబ్బారెడ్డి పిఎ చిన్నప్పన్న చేతి వాటం రూ. 4.5 కోట్లు

### టిటిడిని రాజకీయ పునరావాసంగా మార్చారు..



గత ప్రభుత్వంలో జరిగిన లడ్డూ కల్తీపై 'మహాపాపం' పేరిట అసెంబ్లీలో సిఎం చంద్రబాబు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్

ఆలయాలపై దాడులను ప్రశ్నిస్తే వేధించిన గత ప్రభుత్వం

కల్తీ నెయ్యి తయారీకి ముఠాగా ఏర్పడ్డారు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి 24,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ హయాం లో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని సీఎం చంద్రబాబు తెలిపారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని అన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసన సభలో నిర్వహించిన స్వల్పకాలిక చర్చలో సీఎం మాట్లాడుతూ "మహాపాపం" పేరిట గత ప్రభుత్వం లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎవరికి ఏ బాధవచ్చినా వేంకటేశ్వర స్వామిని మొక్కుకుని ఆయనతో చెప్పుకుంటాం. 201924 మధ్య చాలా సార్లు వేంకటేశ్వర స్వామికి జరిగిన అపచారం పట్ల ఆవేదన చెందాం అన్నారు. ఈ ఘటనపై బాధపడ్డాం..ఎన్నో ఆందోళనలు కూడా చేశామని అన్నారు. వేంకటేశ్వరస్వామికి అన్యాయం జరగుతోంది, దేవాలయాలపై దాడులు జురుగుసత్నాయని పోరా డితే కేసులు పెట్టి వేధించారని అన్నారు. అందులో నేనూ బాధితు న్నేఅన్నారు. రామతీర్థంలో రాముడి తల నరికారని అక్కడికి వెళ్తే నాపైనా కేసుల పెట్టారని అన్నారు. నేను సీఎం అయ్యాక మొదటి సంతకం ప్రిన్సిపల్ సెక్రటరీ నియామకం కోసం..రెండోది టీటీడీ ఈవో నియామక దస్త్రంపై చేశానని అన్నారు. నాకు నెయ్యి అంశంపై ఎన్డీడీబీ రిపోర్టు నుంచి వచ్చినదాన్ని బట్టే ఎన్డీయే సమావేశంలో నేను చెప్పానని తెలిపారు. 45 ఏళ్లుగా నేను రాజకీయాల్లో ఉన్నాను. నేను ఎప్పుడూ వేంకటేశ్వరస్వామి మా ఇంటి దైవంగాచూస్తా. ఏ కష్టం, బాధ వచ్చినా ఆయన్ను తలుచు కుని ముందుకెళ్లడం తప్ప మరో మార్గం లేదన్నారు. ప్రతి రోజూ రెండు నిమిషాలు వేంకటేశ్వరస్వామిని తలచుకుని మంచి పని చేయడానికి ఆశీర్వాదం ఇవ్వండని కోరుకుంటాను, అదే నా శక్తి అని అన్నారు. నాపై 23 క్లేమోర్ మైన్స్ బ్లాస్ట్ చేస్తే వేంకటేశ్వరస్వామి కాపాడారు. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా క్యూలో వెళ్లే దర్శించుకున్నాఅన్నారు.

ఆయన సేవలో ఉంటే రాష్ట్రానికి, మనకు మంచి జరుగుతందని అన్నారు. బ్రిటిష్ వాళ్ల పాలించే రోజుల్లో కూడా వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లలేదుఅన్నారు కానీ గత పాలనలో వారు ఏం చేశారో చూస్తేబాధ,

ఆవేదన కలుగుతాయని అన్నారు. ఒక కుట్ర ప్రకారమే సిండికేట్ గా ఏర్పడి కల్తీ నెయ్యి కుట్ర చేశారుఅన్నారు 59.71 లక్షల కల్తీ నెయ్యి సరఫరా చేశారు.మా దృష్టికి వచ్చాక సిట్ వేయాలని ఆలోచించాంఅన్నారు.

# గోపన్‌పల్లి ఎటిఎం డబ్బు చోరీ నిందితుడి అరెస్టు

## - రూ.34.90లక్షలు స్వాధీనం - ఏ క్షణమైనా దొరుకుతానని.. చోరీ సొమ్ముతో జల్సాలు..


నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

**గచ్చిబౌలి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త** తాను పనిచేస్తున్న సీఎంఎస్ సంస్థ ఉద్యోగులకు గత మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో సదరు సంస్థ మీద కోపం పెంచుకొని చోరీ చేయాలని నిర్ణయం తీసుకున్నాడు. అదను కోసం 20 రోజుల పాటు వేచి చూసి సందు దొరికిన వెంటనే ఏటీఎంలలో నింపే డబ్బు, వాహనంతో ఉడాయించాడు. తాను ఏ క్షణమైనా పోలీసులకు దొరికిపోతానని ముందే నిర్ణయానికి వచ్చి చోరీ చేసిన సొమ్ముతో మద్యం తాగుతూ, ఖరీదైన హోటళ్లలో ఉంటూ జల్సాలు చేశాడు. రాష్ట్రాలు, నగరాలు తిరుగుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరిగిన గోపన్‌పల్లి ఏటీఎం డబ్బు చోరీ డ్రైవర్ చివరికి చిక్కాడు. శంషాబాద్‌లో నిందితుడిని అరెస్టు చేసిన పోలీ సులు అతని వద్ద నుంచి చోరీ నగదు 34.90 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసుకు సంబంధించిన వివరాలను డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నార్సింగి ఏసిపి రమణకుమార్ వెల్లడించారు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా రాయదుర్గ పరిధిలోని బొమ్మనహాల్ గ్రామానికి చెందిన బడిగ్రి అజిత్‌కుమార్(34) నగరంలోని సికింద్రాబాద్‌లో నివాసం ఉంటూ గత ఆరు నెలలుగా సంగం సెక్యూరిటీ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. ఏటీఎంలలో డబ్బులు నింపే సీఎంఎస్ వ్యాన్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్న అజిత్‌కుమార్ తమ సంస్థ ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా వేదిస్తుండడంతో కోపం పెంచుకున్నాడు. కళ్ల ముందు రోజు లక్షల రూపాయల నగదు కనిపిస్తుండడంతో వాటిని చోరీ చేసి తమ సంస్థపై ప్రతీకారం తీర్చుకోవాలని భావించాడు. దాదాపు 20 రోజుల పాటు సమయం కోసం వేచి చూశాడు. కాగా ఫిబ్రవరి 11వ తేదీన గోపన్‌పల్లి ఏటీఎంలో డబ్బు నింపేందుకు సీఎంఎస్ వాహనంతో డ్రైవర్ అజిత్‌కుమార్ రాగా సిబ్బంది ఏటీఎం లోపలికి వెళ్లారు. ఇదే సమయంలో సెక్యూరిటీ గార్డు బాత్‌రూమ్‌కు వెళ్లగా, ఇదే అదనుగా భావించిన అజిత్‌కుమార్ వ్యాన్‌తో అక్కడి నుంచి పరారయ్యాడు. సిబ్బంది ఫోన్ చేస్తే పక్కనే టీ తాగుతున్నానని చెప్పి రెండు గంటల పాటు మభ్యపెట్టాడు. ఈ క్రమంలో సీఎంఎస్ వాహనంతో అమీన్‌పూర్ గద్దర్ సర్కిల్ వరకు వెళ్లి, వ్యాన్‌ను వదలిపెట్టి, అందులో డబ్బుతో ఉన్న ఇనుప డబ్బాను తీసుకొని ఆటోలో పారిపోయాడు. లింగంపల్లి సర్కిల్ వరకు వచ్చి అక్కడి నుంచి మియాపూర్‌కు, అక్కడి నుంచి ఆర్‌టిసి క్రాస్ రోడ్డుకు బస్సులో వెళ్లాడు. అక్కడ లాడ్జీలో గది అద్దెకు తీసుకొని యాక్సా బ్లేడుతో ఇనుప బాక్సును తెరిచి, అందులో ఉన్న 56 లక్షల రూపాయల నగదును బ్యాగులో నింపుకొని బస్సులో అనంతపూర్ వెళ్లాడు. అక్కడి నుంచి బల్లారి, బెంగళూరు, అనంతపూర్ తదితర ప్రాంతాలు తిరుగుతూ హోటళ్లలో ఉంటూ మద్యం తాగుతూ జిల్సాలు చేయసాగాడు. తాను ఏక్షణమైనా పోలీసులకు దొరుకుతానని ముందే గ్రహించిన అజిత్‌కుమార్ చోరీ సొత్తును జల్సాలకే ఖర్చు చేయసాగాడు. కాగా చోరీ అనంతరం నిందితుడి కోసం 3 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టిన పోలీసులు చివరికి శంషాబాద్ వద్ద మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు రోజుకో ఊరు మారుస్తూ, దాదాపు 6 సెల్‌ఫోన్లు కొని, వాటి ద్వారా అనంతపూర్‌లో ఉండే తన సోదరికి ఫోన్ చేశాడు. సోదరి ఫోన్ మీద నిఘా పెట్టిన పోలీసులు చివరికి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జల్సాలకు ఖర్చు చేయగా మిగిలిన చోరీ నగదులో 34.90లక్షలను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్ బాలరాజు, డిఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# పెళ్లికిముందు లైంగిక సంబంధం

## తర్వాత జాతకాలు కలవడంలేదని తిరస్కరణ నిందితుడికి బెయిల్ నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మహిళతో పెళ్లికి ముందు లైంగిక సంబంధం పెట్టుకుని, ఆ తర్వాత జాతకం కలవడం లేదని చెబితే అత్యాచారం కేసు తప్పదని ఢిల్లీ హైకోర్టు తీవ్ర హెచ్చరికలు చేసింది. శారీరక సంబంధం పెట్టుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి జన్మకుండలి కలవడం లేదని పెళ్లికి నిరాకరించడం నేరంగా పరిగణించవచ్చని కోర్టు పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని పదే పదే నమ్మించి తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని ఒక మహిళ ఒక వ్యక్తిపై రేప్ కేసు పెట్టింది. ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు నిందితుడికి బెయిల్ నిరాకరించింది. నిందితుడిపై ఐపిసి సెక్షన్ 376, బిఎన్ఎస్ సెక్షన్ 69 కింద కేసులు నమోదయ్యాయి. నిందితుడు బాధితురాలికి పంపిన వాట్సాప్ మెసేజ్‌లో మన జాతకాలు కలిశాయి. పెళ్లికి అడ్డంకులు లేవు. రేపే పెళ్లి చేసుకుందాం అని పేర్కొన్నట్లు కోర్టు గుర్తించింది. దీంతో బాధిత మహిళ నిందితుడు, అతడి కుటుంబంపై పెట్టిన కేసును విత్ డ్రా చేసుకుంది. అయితే, మళ్లీ నిందితుడు జాతకాలు కలవడం లేదు, పెళ్లి కుదరదు అని చెప్పడాన్ని కోర్టు గుర్తించింది. నిందితుడు గతంలో చెప్పిన మాటలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నట్లు గుర్తించింది. ఈ కేసుపై న్యాయమూర్తి వ్యాఖ్యానిస్తూ జాతకాలు కలవడం ముఖ్యమైతే శారీరక సంబంధం ఏర్పడకముందే ఆ విషయాన్ని తేల్చుకోవాలని అన్నారు. ముందే పరిష్కారం అయిన విషయాన్ని మళ్లీ సాకుగా చూపడం కేవలం శారీరక సుఖం కోసమే తప్పుడు హామీ ఇచ్చినట్లు అర్థమవుతుందని కోర్టు అభిప్రాయపడింది.

# రాజ్యాంగ పరిమితుల్లో సమన్వయం బలోపేతం

## 27 యేళ్ల తర్వాత ఇసిఐ రౌండ్ టేబుల్ సమావేశం

## పాల్గొన్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి24:** భారత ఎన్నికల సంఘం(ఈసీఐ), రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల జాతీయ రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం ఢిల్లీలో జరిగింది. ఢిల్లీలోని భారత్ మండపంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్లతో కలిసి జాతీయ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఎన్నికల కమిషనర్లు డా. సుఖ్బీర్ సింగ్ సాంధూ, డా. వివేక్ జోషి హాజరయ్యారు.

ప్రారంభ ప్రసంగంలో ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇసిఐ రాష్ట్ర ఎన్నికల కమిషన్ల మధ్య రాజ్యాంగ పరిమితుల్లో సమన్వయం బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఎన్నికల జాబితాల నిర్వహణలో సమన్వయం, సాంకేతికత వినియోగం, ఉత్తమ పద్ధతుల పంచుకోవడం ద్వారా ఎన్నికల పారదర్శకత మరియు సామర్థ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని తెలిపారు. ఎన్నికల కమిషనర్ డా. సాంధూ మాట్లాడుతూ, రాష్ట్ర కమిషనర్లు పరస్పరం ఉత్తమ పద్ధతులను నేర్చుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో విశ్వాసం ముఖ్యమని, అందుకోసం ఇసిఐ,ఎస్ఈసీ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎన్నికల కమిషనర్ డా. వివేక్ జోషి మాట్లాడుతూ, డిజిటల్ సాంకేతికతల ప్రాముఖ్యతను వివరించారు. ఇసిఐఎన్ఈటీ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఇసిఐ, రాష్ట్ర కమిషన్ల మధ్య అనుసంధానం పెంచాలని సూచించారు.ఈ సమావేశంలో నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. సహకార సమాఖ్య వ్యవస్థ భావనను బలోపేతం చేస్తూ, శుద్ధమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని ప్రకటించారు. పంచాయతీలు మరియు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన చట్టాలను పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల చట్టాలతో సమన్వయం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఏ కన్‌ఫ్లూయెన్స్ ఆఫ్ డెమోక్రసీస్ అనే కొత్త ప్రచురణను విడుదల చేశారు. ఇందులో ఐఐసిడిఈఎం-2026 సమావేశానికి సంబంధించిన పూర్తి వివరాలను ఉన్నాయి. 27 సంవత్సరాల విరామం తర్వాత జరిగిన ఈ సమావేశం, ఈవిఎంలు,ఈసిఐఎన్ఈటీ, ఓటర్ల జాబితాల పంచకం వంటి అంశాల్లో సహకారాన్ని పెంచడానికి దోహదపడింది. ఈ సందర్భంగా జాతీయ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటన మేరకు శుద్ధమైన ఓటర్ల జాబితాలు ప్రజాస్వామ్యానికి పునాది. పారదర్శక ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. ఈసిఐఎన్ఈటీ, ఈవీఎం, ఓటర్ల జాబితాలు, ఐఐడిఈఎం వనరులను పంచుకోవడానికి చట్టబద్ధ విధానాలు రూపొందించాలి. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల చట్టాలను పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ ఎన్నికల చట్టాలతో సమన్వయం చేయాలి. అంతర్జాతీయ సమావేశాలలో రాష్ట్ర కమిషనర్లు పాల్గొనాలని సూచించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించాలని ప్రతిపాదించారు. ఈ సమావేశంలో వచ్చిన సూచనలను చట్టపరమైన సాంకేతిక బృందాలు పరిశీలించి, మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలి అని నిర్ణయించారు.

# వేడుకగా తిరుపతి నగర 896వ ఆవిర్భావ దినోత్సవం

**తిరుపతి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్తప్రతినిధి:** ఒకప్పుడు చిన్న గ్రామంగా ఉన్న తిరుపతిని పూర్వకాలంలో వెంకటనాథపురం, గోవిందపట్నం అని పిలిచే వారని చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి. తిరువెంగడం యాదవ రాజుల పాలనలో తిరుపతి అభివృద్ధి చెందిందని, నగరాన్ని సుసంపన్నంగా తీర్చిదిద్ది నట్లు చరిత్ర చెబుతోంది. కాలక్రమేణా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా వెలుగొందిన తిరుపతి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిం దని రాయలసీమ రంగస్థలం సంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, మేధా వులు తెలిపారు. క్రీస్తుశకం 1118 సంవత్సరంలో తిరుపతి ఆవిర్భవించినట్లు కొన్ని శాసనాలు స్పష్టంగా తెలియజేస్తున్నా, పవిత్రక్షేత్రం తిరుపతి నగర పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహిం చారు. రాయలసీమ రంగస్థలం కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకు న్నారు. వందలాది మంది కళాకారులు పురాణ పురుషుల వేషధారణలో తిరు నగర వీధుల్లో గోవింద నామసంకీర్తనలతో భజనలు, కోలా టాలు చేస్తూ విశేష ప్రదర్శనలు ఇచ్చారు. నగరమంతా ఆధ్యాత్మిక ఉత్సాహంతో మార్మో గింది. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం ఛైర్మన్ గుండాల గోపీనాధ్‌రెడ్డి, సంకీర్తన మండలి సభ్యులు వాసుదేవరెడ్డి,

మునినాధ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, భాస్కరాచారి, అన్నారెడ్డి రాజశేఖర్, హరినాథ్, మిట్టపల్లి బ్రహ్మానందం, సిద్దవరం వెంకటాద్రి, అరుణ, విగ్రహాల కళ్యాణి పాల్గొన్నారు.

# భక్తులకు మరిన్ని సేవలకు కార్యాచరణ

**తిరుమల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతోపాటు తిరుపతిలోని వివిధ విభాగాల్లో కొన్నేళ్ళుగా పేరుకుపోయిన నిరుపయోగమైన వస్తువులను, ఇనుప వస్తువులను ఇతరత్రా వాటిని తొలగించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. ఈ నిరుపయోగ వస్తువులు తరలించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. తిరుమల పద్మావతి అతిథి గృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యచౌదరి మాట్లాడుతూ టిటిడిలోని అన్ని విభాగాల్లో ఉన్న నిరుపయోగ వస్తువులను గుర్తించి పదిహేను రోజుల్లో నివేదిక అందించాలని ఆదేశించారు. ఆరు నెలలకోసారి ప్రతి విభాగంలో ఈ నిరుపయోగ వస్తువులను తొలగించేందుకు షెడ్యూల్ రూపొందిం చాలన్నారు. వేలంద్వారా ఆ వస్తువులను ఎప్పటికప్పుడు విక్రయించేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. అభిప్రాయ సేకరణ (ఫీడ్ బ్యాక్) వ్యవస్థ అద్భుత ఫలితాల నిస్తోందని, దీన్ని ఇదేవిధంగా కొనసాగించాలని తెలిపారు. కళ్యాణకట్ట, లగేజ్ సెంటర్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. భక్తులు విరాళాలు అందించేందుకు వీలుగా తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రిలో కూడా కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.



# మహిళా రైతుల క్రికెట్ టోర్నీ !

**నిన్నటి వంటగది వరకూ, పొలం పనులే ప్రపంచంగా బతికిన మహిళలు... ఇప్పుడు మైదానంలో బ్యాట్ బాల్ పట్టుకుని కనిపిస్తున్నారు. ఎంతో అనుభవం ఉన్నవాళ్లలా క్రికెట్ ఆడుతున్నారు. వీళ్ల ఆట చూసి అక్కడి ప్రజలంతా ప్రోత్సహిస్తున్నారు. అంతేనా, వికెట్ పడితే ఈలలు వేస్తున్నారు. క్యాచ్ పట్టుకుంటే... కేరింతలు కొడుతున్నారు. 'సైబేజ్ ఆశా ప్యాడీ కప్' పేరుతో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విశేషాలివి.**

ఆడవాళ్లకు అవకాశం ఇవ్వలే కానీ, అద్భుతాలు చేస్తారనడానికి ఈ మహిళల ఉదాహరణ. పుణె ఏర్పాటుభోర్, రాజ్ గఢ్ తాలూకాలో నిర్వహించిన సైబేజ్ ఆశా ప్యాడీ కప్ క్రికెట్ టోర్నీలో జరిగింది అద్భుతం. ఏటా వ్యవసాయ సీజన్ ముగింపు సందర్భంగా సైబేజ్ ఫౌండేషన్ దీన్ని ఏర్పాటు చేస్తుంది. ఈ చిన్న క్రికెట్ టోర్నమెంట్... ఇప్పుడు మహిళా రైతులకు పెద్ద వేదికగా మారింది. ఇందులో 35 మంది మహిళా జట్లు పాల్గొంటే.. 40 మంది జట్లు బరిలోకి దిగాయి. వీరంతా నిన్న మొన్నటి వరకూ ఇంటి బాధ్యతలు, పొలం కాలం గడిపిన సాధారణ మహిళలు, ఆటలు ఆడటం, పోటీల్లో పాల్గొనడం వంటివన్నీ కొత్తే



పక్కకి పెట్టే సింది. మహిళలు నాయకత్వం తీసుకోవడం, నిర్ణయాల్లో పాల్గొనడం చర్చలు

అయినా సరే... ధైర్యంగా ముందుడుగు వేశారు. ఆసక్తిగా ఆడే ఆడవాళ్లందరూ ఏకమై సాధన చేశారు. మైదానంలో సమస్యలను పరిష్కరించుకున్నారు. తమ గ్రామాలకు ప్రముఖులు. ఇదేమీ చిన్న విషయం కాదు... సాధికారత దిశగా పడిన కీలక అడుగు. నిజానికి ఇలాంటివన్నీ మగవాళ్లే చేస్తారని అనుకోవచ్చు... ఈ అనుభవం మాకు కేవలం మైదానంలోనే కాదు, జీవితంలోనూ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. మా జట్టు మొదటి బహుమతి గెలిచినా, దీనికంటే ఆడిన ఆనందమే పెద్దది. తొలిరోజుల్లో కొందరు పెద్దలు, కుటుంబ సభ్యులు మా ఆటపై అభ్యంతరం చెప్పారు. కానీ క్రమంగా వాళ్లే అభిమానులుగా మారారు. మైదానంలో ఉత్సాహంగా అరుస్తూ మమ్మల్ని ప్రోత్స హిస్తున్నారు. ఈ టోర్నమెంట్ గ్రామాల్లో పాత నియమాల కోసం

మొదలయ్యాయి అని గెలిచిన మహిళల జట్టు కెప్టెన్ స్వాతి జెండే. 'సుస్థిర వ్యవసాయ పద్ధతులు, గ్రామీణ ఐక్యత, సహకారం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి... మా సైబేజ్ ఫౌండేషన్ పనిచేస్తుంది. మేం నిర్వహించే క్రికెట్ టోర్నీలో ఏటా పురుషుల జట్లే పోటీపడతాయి. ఈసారి ఆడవాళ్లు ముందుకొచ్చారు. ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది' అంటారు సంస్థ నిర్వాహకురాలు రీతూ నధానీ. □

## పోషకాహారం అందటం లేదా?



మనలో చాలామంది వేళకు ఆహారం తీసుకుంటాం కానీ అందులో శరీరానికి అవసరమైన పోషకాలు ఉంటున్నాయా లేదా అని పెద్దగా పట్టించుకోం. బికాంప్లెక్స్ లాంటివి తక్కువైనప్పుడు విటమిన్ టాబ్లెట్లు లేదా న్యూట్రిషన్ సప్లిమెంట్లు తీసుకుంటాం. మనం విటమిన్ లోపంతో బాధపడకూడదంటే మంచి ప్రొటీన్ ఫుడ్ తీసుకోవాలి. అలాంటి హెల్త్ మిక్స్ పౌడర్ ఇంట్లోనే చేసుకోవచ్చు. అందుకోసం.. పెసలు, మినపప్పు, శనగపప్పు, రాగులు, జొన్నలు, కొర్రలు, ఉలవలు, గోధుమపిండి అర కప్పు చొప్పున, ఎర్రబియ్యం, పల్లీలు, బాదం, జీడిపప్పు పావు కప్పు చొప్పున, డ్రై జింజర్ పౌడర్ 2 చెంచాలు, యాలకుల పొడి చెంచా తీసుకోవాలి. మొదట అన్నీ నాణ్యమైనవాటిని ఎంచుకోవాలి. పెసలు మొదలైనవాటిని విడివిడిగా వేయించాలి. చల్లారాక మెత్తగా గ్రైండ్ చేసి.. డ్రై జింజర్ పౌడర్, యాలకుల పొడి జోడించాలి. ఈ పొడిని తడి లేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. తాగదలచుకున్న ప్పుడు.. గ్లాసు నీళ్లలో 2 చెంచాల పొడి, చెంచా బెల్లం పొడి

## సనాతన ధర్మ సంరక్షకుడై..

దేవుడిపై విశ్వాసం లోపించి, సనాతన ధర్మానికి హాని కలుగుతున్న సమయంలో ఆది శంకరులు అవతరించి వైదిక సంప్రదాయాన్ని పునరుజ్జీవింపజేశారు. ఆయన అద్వైత సిద్ధాంతాన్ని బోధించారు. జీవుడికి, దేవుడికి భేదం లేదని ప్రతిపాదించారు. ఏకసంథాగ్రాహి అయిన శంకరులు బాల్యంలోనే సమస్త విద్యలూ అభ్యసించారు. తండ్రి చిన్ననాడే దూరమైనా తనను కంటికి రెప్పలా కాపాడుకున్న తల్లిని ప్రాణప్రదంగా చూసుకున్నారు. సన్యాసి అయినా మాతృమూర్తి కడపటి క్షణాల్లో చెంతనే ఉన్నారు. అంతిమసంస్కారాలు చేసి ఆమె రుణం తీర్చుకున్నారు. శంకరాచార్యులు గోవింద భగవత్పాదులకు శిష్యరికం చేశారు. వారి ఆదేశం మేరకు బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యానం రాసేందుకు కాశీకి వెళ్లారు. తర్వాత బదరీనాథ్ కి ప్రయాణమయ్యారు. అక్కడ పన్నెండు సంవత్సరాలు ఉండి ఉపనిషత్తులు, భగవద్గీతకు వ్యాఖ్యానం రచించారు. శాఖోపశాఖలుగా చీలిపోయిన భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలను క్రోడీకరించి, ఆదిశంకరులు ఆరుగురు ఆరాధన మార్గాలను ఏర్పరిచారు. షణ్మత స్థాపనాచార్యుడిగా జగత్ ప్రసిద్ధులయ్యారు. ప్రస్తుతం ఉన్న షోడశోపచార పూజావిధానం, క్షుద్ర తాంత్రిక విధానాల్లో ఉపయోగించే శ్రీచక్రాన్ని ప్రసాదించినవారు ఆదిశంకరులే! అలాగే సకల దేవతామూర్తులకు సంబంధించిన స్తోత్రాలను మానవాళికి అందించిన ఘనత కూడా ఆ జగద్గురువుదే! ఆసేతు హిమాచలం పాదచారులై ఉండి వైదికమత ప్రాశస్త్యాన్ని చాటారు. దేశం నలుదిక్కులా నాలుగు మఠాలను స్థాపించారు. అందుకే శ్రీశంకరాచార్యుల రచనలు అధునాతన ప్రపంచంలో అద్భుతసృష్టికి నిదర్శనాలు. మనదేశ పవిత్రతను, పూర్వవైభవాన్ని పునరుద్ధరించిన మహానుభావుడు ఆదిశంకరులు అని కొనియాడారు. స్వామి వివేకానంద. □



## ఆదివాసీ మహిళల పొదుపు మంత్రం



ఆదివాసీ మహిళల పొదుపు మంత్రం పొదుపు, అప్పులు సకాలంలో తీర్చడంలో బాగా చదువుకున్నవాళ్లూ ఇబ్బంది పడుతుంటారు. అలాంటివాళ్లకి ఈ మహిళల్ని చూపించాలి. పొదుపుతో కుటుంబ ఆర్థిక అవసరాలను తీర్చుకోవడమే కాదు... ఎంతోమందికి ఆదర్శంగానూ వివరిస్తున్నారు. డెమిక్స్ ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం తుమ్మగూడ... మారుమూల ప్రాంతంలో ఉండే ఓ గూడెం. అక్కడివాళ్లంతా గోండు తెగకు చెందిన ఆదివాసీలే. అందరిదీ ఒకేమాట. ఒకే బాటగా సాగుతారు. 2024లో ఊళ్లో వినాయక లడ్డూ వేలం వేయగా రూ.20వేలు వచ్చాయి. ఆ మొత్తాన్నీ ఊరి పెద్దలు మహిళా సంఘాలకి ఇచ్చారు. 110 కుటుంబాలు ఆ ప్రాంతం లో 14 మహిళా సంఘాలు న్నాయి. నాగోబా మహిళా సంఘం ఆ డబ్బుల నిర్వహణ బాధ్యత తీసుకుంది. ప్రతి నెల 24న సమావేశం నిర్వహి చారు. అవసరమైన మహిళలకు రూ.50 నెలవారీ వడ్డీ చొప్పున రూ. వెయ్యి అప్పుగా ఇస్తారు. మరుసటి నెల సమావేశం నాటికి వడ్డీతో సహా తీర్చాలనేది నియమం. ఇప్పటివరకూ దీన్ని ఎవరూ మీరలేదు. అంతే కాదు, పాత బకాయి ఉండగా కొత్త అప్పు ఇవ్వరు. అలా రూ.20వేలతో మొదలైన వాళ్ల పొదుపు ప్రయాణం రూ.1.2 లక్షలకి చేరింది. ఇలా పోగేసుకుంటూ ఆర్థిక అవసరాలు తీర్చుకోవటమే కాదు, ఉపాధిగానూ మలుచుకుంటున్నారు. అక్రమాలకు తావులేకుండా బ్యాంకు తరహా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. లెక్కలన్నీ రాసి పెట్టుకుంటున్నారు. ఒకప్పుడు అవసరానికి అప్పు లభిస్తుందో లేదో అని భయముండేది. ఈ విధానంతో ఆ బెంగ తీరింది. అలాగని ఆడంబరాలకు తీసుకోము. తీసుకున్నవాళ్లం పక్కాగా తీర్చేస్తాం కూడా. మహిళలందరి సమ్మతితోనే ప్రతినెల బట్వాడా జరుగుతుంది. మా నిర్ణయాల్లో మగవాళ్ల జోక్యమూ ఉండదు. .



మెరిసే, ఆరోగ్యకరమైన చర్మం... ఏ అమ్మాయి కోరుకునేదైనా ఇదే! కాకపోతే సమస్యల్లా ఒకటే.. అం దుకు ఏం వాడాలి అంటే. ఫలానా క్రీమ్ లేదా సీరం బాగుంది అని ఎవరైనా అన్నారంటే అది మన చర్మానికి పడుతుందా అన్న సందే హం. పోనీ సహజ పదార్థాలు వాడితే అన్న ఆలోచన వెక్తి వచ్చిందా? అయితే బియ్యప్పిండి ఎంచుకోండి. ఇది ఏ చర్మం వాళ్లకైనా సరిపోతుంది... ఆధునిక అధ్యయనాలు చెబుతున్న మాట ఇది.

## బియ్యప్పిండి సహజ ఎక్స్‌ఫోలియేట్‌గా..

బియ్యప్పిండి సహజ ఎక్స్ ఫోలియేట్‌గా పనిచేస్తుంది. చర్మంలోని తేమను తొలగించకుండానే మృతకణాలనూ, జిడ్డునీ తొలగిస్తుంది. నిగారింపుని ఇవ్వడంతోపాటు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది అడ్వాన్సెస్ ఇన్ సోషల్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ హ్యుమానిటీస్ రీసర్చ్ అధ్యయనం. ఇది జిడ్డుని తొలగించి, యాక్నేని దూరం చేస్తుంది. చర్మాన్నీ బిగుతుగా మారుస్తుంది. బియ్యప్పిండిలో సహజ ఆంటి ఇన్ఫ్లమేటరీ గుణాలుం టాయి. ఇది ఎరుపుదనం, దురద, దద్దుర్లను దూరం చేస్తుంది. శరీరంలోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ ఫ్రీరాడికల్స్ తో పోరాడతాయి. తద్వారా వృద్ధాప్యఛాయల్నీ దరికి చేరనీయదు. స్పూను చొప్పున బియ్యప్పిండి, తేనె తీసుకుని బాగా కలపాలి. నీటితో కడిగిన ముఖానికి పట్టించి, మృదువుగా రుద్దండి. ఆపై పావుగంట వదిలేసి, చల్లని నీటితో కడిగితే సరి, మంచి స్క్రాబ్ల పనిచేస్తుంది. సెన్సిటివ్ స్కిన్ ఉన్నవాళ్లు బియ్యప్పిండికి తగినంత పెరుగు కలిపి ముఖానికి పట్టించండి. పదినిమిషాలయ్యాక కడిగేస్తే చాలు. బియ్య ప్పిండి, ముల్తానీ మట్టి సమపాళ్లలో తీసుకుని ఆపై రోజ్ వాటర్ కలపాలి. ఈ ప్యాక్ జిడ్డుచర్మం వాళ్లకి బాగా పనిచేస్తుంది

## తువ్వాలా? హెయిర్ డ్రయ్యరా?



తలను సహజంగానే ఆరబెట్టుకోవాలి లేదంటే కురులు రాలిపోతా యంటారు కొందరు. లేదు లేదు తువ్వాలుతో తుడిస్తే జుట్టు గడ్డిలా కనిపిస్తుంది. పైగా ఆరడానికి చాలా సమయం తీసుకుం టుంది కాబట్ట డ్రయ్యరే మేలంటారు మరికొందరు. ఇంతకీ రెండట్లో ఏది ఎంచుకవోడం మేలు? ఈ వాదన నాణేనికి మరోవైపు లాంటిదే. సరిగా వాడటం తెలియకపోతే రెండింటితోనూ సమస్యలొస్తాయి. కాబట్టి.. ఒక్కదానిపైనే ఆధారపడొద్దు. రెండింటి ప్రయోజనాలు అందుకోవడం మేలంటారు నిపుణులు. ✦తువ్వాలుతో తుడుచుకోవడం మంచిదే! అయితే అది గరుకుగా ఉండేదైతే మాడుతోపాటు కురుల కుదుళ్లపైనా చెడు ప్రభావం చూపుతుంది. కాబట్టి, ఉపయోగించేది మెత్తని కాటన్ టవలేనా అన్నది చూసుకోవాలి. ఇదైతే త్వరగా నీటిని పీల్చుకుంటుంది. అయితే దీంతోనైనా గట్టిగా రుద్దడం, దులుపుతున్నట్లుగా చేయడం లాంటివి వద్దు.

✦. నీరు కారడం పూర్తిగా ఆగిపోయాక డ్రయ్యర్‌తో ఆరబెడితే సరి. జుట్టు కుచ్చులుగా కనిపిస్తుంది. అయితే డ్రయ్యర్‌ని మాడుకి మరీ దగ్గరగా ఉంచొద్దు. హీట్ కాకుండా కూల్ మోడ్‌లో పెట్టి వాడితే ఇంకా మంచిది. బఆరబెట్టడం సులువు అవుతుందనో, అలల్లా కనిపిస్తుందనో కొందరు దువ్వెనతో దువ్వుతూ డ్రయ్యర్‌తో అరబెడు తుంటారు. ఇదీ ప్రయాదమే. చాలావరకూ ఆరాక మాత్రమే దువ్వెన తలలో పెట్టాలి. ల జలుబు వస్తుందనీ కొందరు డ్రయ్యర్లవైపు మొగ్గు చూపుతారు. ఇప్పుడెలాగూ వేసవే! వేగంగానే ఆరుతుంది కాబట్టి, సహజ పద్ధతికే ఓటేయడం మేలు. □

# అబ్బాయిలకు చిరాకు తెప్పిస్తా



విష్ణు విన్యాసం కథానాయిక నయన్ సారిక

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు హిలేరియస్ జాయ్‌రైడ్ విష్ణు విన్యాసంతో అలరించబోతున్నారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తోంది. ఇపటికే ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఫిబ్రవరి 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా హీరోయిన్ నయన్ సారిక విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. ఇందులో మనీషా అనే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. జీవితంలో చాలా బాధలు ఎదుర్కొన్న అమ్మాయి. ఒక పాయింట్ వచ్చిన తర్వాత జీవితాన్ని హాయిగా బ్రతకాలనుకునే అమ్మాయి. కాలేజీలో ఫ్యాకల్టీగా కనిపిస్తా. నా క్యారెక్టర్‌కి చాలా షేడ్స్ వుంటాయి. కొంచెం ఫీమేల్ డామినేటింగ్‌గా ఉంటుంది. ఫస్ట్ ఆఫ్‌లో అబ్బాయిలకి కాస్త చిరాకు కలిగిస్తుంది. కానీ దానికి కారణం ఏమిటో సెకండ్ హాఫ్‌లో రివీల్ అయిన తర్వాత ఆ క్యారెక్టర్‌ని అందరూ అర్థం చేసుకొని, ఇష్టపడతారు. టీజర్‌లో కాస్త బోల్డ్‌గా కనిపించా. ఆ సీన్లు క్యారెక్టర్‌కు కథ కు చాలా ఇంపార్టెంట్. విష్ణు క్యారెక్టర్ కూడా ఫ్యాకల్టీనే. ఇద్దరు లెక్చరర్ల మధ్య జరిగే ప్రేమ కథ. స్టూడెంట్స్, యూత్ చాలా బాగా కనెక్ట్ అవుతారు.

మాది మహారాష్ట్ర. నేను గ్రాడ్యుయేషన్ పూర్తి చేశా. తెలుగులోనే ఫస్ట్ సినిమా చేశా. నాటి నుంచి ఇక్కడే కొనసాగుతున్నాను. భవిష్యత్తులో కూడా తెలుగు సినిమాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తా. గంగం గణేశా, ఆయ్, క లాంటి వరుస విజయాలు రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. విష్ణు విన్యాసం కూడా నాకు మరింత మంచి పేరు తీసుకొస్తుందని భావిస్తున్నా. మంచి కథా బలం, పాత్ర బలం ఉన్న సినిమాలు చేయడానికి ప్రయత్నిస్తున్నాను. డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయాలనుంది. అలాగే మంచి పెర్ఫార్మన్స్, కొత్తదనం వున్న సినిమాలు చేయాలని ఉంది. విష్ణుతో పనిచేయడం వెరీ ఫన్ జర్నీ. ఆయన చాలా జోవియల్ పర్సన్. సరదాగా మాట్లాడుతుంటే వినడానికి చాలా హాయిగా ఉంటుంది. చాలా మాటలు గుర్తుండిపోతాయి. ఆయనతో కలిసి పనిచేయడం చాలా మంచి ఎక్స్పీరియన్స్.

డైరెక్టర్ మారుతి చాలా టాలెంటెడ్. ఆయన కథ చెప్పినప్పుడే చాలా ఎంజాయ్ చేశాను. తను చాలా క్లారిటీ ఉన్న ఫిలిం మేకర్. నా క్యారెక్టర్ కోసం చాలా గైడ్ చేశారు. నిర్మాతలు చాలా ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు. ప్రతి విషయంలో సపోర్ట్ చేశారు. సుమంత్ సినిమాకు కావలసిన ప్రతిదీ సమకూర్చారు. ఈ సినిమాలో రధన్ అద్భుతమైన పాటలు ఇచ్చారు. అలాగే బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా చాలా బాగుంటుంది. ఇందులో బ్రేకప్ సాంగ్ నాకు చాలా ఇష్టం. అలాగే మొదలే మొదలే పాట నా ఫేవరెట్. నిజానికి నేను లాయర్ అవుదామనుకున్నా. సినిమాలంటే చిన్నప్పటి నుంచి ఇష్టం ఉండేది. ఆ ఇష్టమే కెరియర్‌గా మారింది.

ప్రేక్షకులను నవ్వించడం నిజంగా కష్టం. విష్ణుకి ఆ కామెడీ టైమింగ్ చాలా నేచురల్‌గా వచ్చేస్తుంది.

ఆ విషయంలో ఆయన వెరీ టాలెంటెడ్. అలాగే ఆయన స్పాట్లో ఇంప్రవైజ్ చేసే విధానం కూడా చాలా బాగుంటుంది. ఆయన నేచురల్ పర్ఫార్మర్ కావడంతో మా పెర్ఫార్మన్స్ కూడా బెటర్ అయ్యింది. చిన్నప్పటి నుంచి టీవీలో ఫిలింఫేర్ అవార్డులు చూసే దాన్ని. అదే వేదిక మీద నేను అవార్డు అందుకోవడమనేది చాలా సంతోషాన్ని ఇచ్చింది.

## క్రిష్ దర్శకత్వంలో బాలయ్య వారసుడి ఎంట్రీ?



టాలీవుడ్‌లో గత దశాబ్ద కాలంగా వినిపిస్తున్న అతిపెద్ద ప్రశ్న.. నందమూరి మోక్షజ్ఞ ఎంట్రీ ఎప్పుడు?. ఆ నిరీక్షణకు తెరదించుతూ, నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ తేజ తన సినీ ప్రస్థానాన్ని ఒక సంచలన ప్రాజెక్టుతో ప్రారంభించబోతున్నాడనే వార్త ఫిల్మ్ నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. కేవలం ఒక మామూలు కమర్షియల్ సినిమాతో కాకుండా... లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు సృష్టించిన ఆదిత్య 369 మ్యాజిక్‌ను మళ్ళీ వెండితెరపై ఆవిష్కరిస్తూ, ఆదిత్య 999 మ్యాక్స్ అనే భారీ ఫ్రాంచైజీలోకి మోక్షజ్ఞ అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి దర్శకత్వ బాధ్యతలను క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి చేపట్టబోతున్నట్లు సమాచారం. గతంలో గౌతమీపుత్ర శాతకర్ణి వంటి చారిత్రాత్మక చిత్రంతో బాలయ్యకు మైలురాయి లాంటి విజయాన్ని అందించిన క్రిష్, ఇప్పుడు మోక్షజ్ఞను ఎలా ప్రెజెంట్ చేస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. సైన్స్ ఫిక్షన్ కథాంశానికి మాస్ ఎలిమెంట్స్‌ను జోడించి, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను రూపొందించేందుకు పక్కా ప్లాన్ సిద్ధమైనట్లు టాక్. టైమ్ ట్రావెల్ నేపథ్యంలో సాగే ఈ కథలో విజువల్ ఎఫెక్ట్స్ హాలీవుడ్ స్థాయిలో ఉండబోతున్నాయని సమాచారం. భారీ బడ్జెట్‌తో, ఎక్కడా రాజీ పడకుండా హై టెక్నికల్ వాల్యూస్‌తో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

# తెర

## ప్రకృతి నాకేదో సిగ్నల్స్ ఇస్తోంది




కోర్టు సినిమా ఫేమ్ హర్ష్ రోషన్, శ్రీదేవి అపల్లా జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ బ్యాండ్ మేళం టీజర్ విడుదలైంది. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ టీజర్, చిన్నప్పటి నుండి ప్రేమించుకునే జంట, పెళ్లి కోసం పడే ఆరాటం, ఫన్నీ సంఘటనలతో ఆకట్టుకుంటోంది. కోన వెంకట్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి సతీష్ జవ్వాజి దర్శకత్వం వహిస్తున్నారు. టీజర్ చూస్తుంటే, చిన్నప్పటి నుంచే ఒకరికొకరు పెళ్లి చేసుకోవాలనుకునే టీనేజ్ జంట కథగా తెలుస్తోంది. ప్రకృతి నాకేదో సిగ్నల్స్ ఇస్తోంది వంటి డైలాగ్స్‌తో టీజర్ చాలా ఫన్నీగా సాగింది. టీజర్‌లో పరిచయం చేసిన రాజమ్మ పాత్ర కూడా ఆసక్తికరంగా ఉంది. ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. కోన వెంకట్ సమర్పణలో కావ్య, శ్రావ్య నిర్మిస్తున్న ఈ సినిమాకు, సతీష్ జవ్వాజి దర్శకత్వం వహిస్తున్నారు.

తెలంగాణ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది.'నాకు పెళ్లి చేసేయండి నాన్న అనే డైలాగ్ మరియు ఫన్నీ సన్నివేశాలు యూత్‌ను ఆకట్టుకునేలా ఉన్నాయి.

## దేనికి లెక్క చేయని పవర్

నేచురల్ స్టార్ నాని, తన తదుపరి ప్రతిష్టాత్మక వెంచర్ నాని34 టైటిల్‌ని అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి బ్లడీ రోమియో అనే టైటిల్ పెట్టారు. యూనానిమస్ ప్రొడక్షన్స్, నిహారిక ఎంటర్టైన్మెంట్ బ్యానర్స్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. నాని పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అద్భుతమైన కామిక్‌నోయిర్ టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. డీప్ పర్పుల్స్, బ్లడ్ రెడ్స్‌తో నిండిన ఈ విజువల్ లాంగ్వేజ్, ఈ సినిమా యాక్షన్‌తో పాటు స్టైలిష్ ఎస్తెటిక్ ఫ్లేర్‌కి ప్రాధాన్యం ఇస్తుందని ప్రజెంట్ చేస్తోంది. ప్రోమోలో హీరోను కిచెన్‌లో పరిచయం చేస్తారు. వెన్నెల కిషోర్ వాయిస్ ఓవర్ కొనసాగుతున్న కొద్దీ, అతని రెసిపీలు నిజానికి అతని హింసాత్మక స్వభావానికి ప్రతీకలని రివీల్ అవుతుంది. చిటికెడు కరుణ..పిడికెడు కోపం లాంటి పదార్థాలను వంటకంగా చూపిస్తూ, తన



జీవితాన్ని ఓ మాస్టర్ చెఫ్‌లా ప్రజెంట్ చేశారు. సాధారణంగా కనిపించే ప్రెషర్ కుక్కర్ ఒక్కసారిగా టైమ్ బాంబ్‌లా పేలిపోవడం ద్వారా గ్యాంగ్‌స్టర్స్ డెన్‌ను ధ్వంసం చేయడం ఈ కాన్సెప్ట్‌కి క్లైమాక్స్‌గా నిలిచింది. నాని పాత్ర ఒక ఫైటర్‌గా కాకుండా, దేనికి లెక్క చేయని పవర్ లా బయటి రావడం అదిరిపోయింది. చివర్లో లండన్ నేపథ్యంతో వాష్‌రూమ్ నుంచి బయటకు వస్తూ, మండుతున్న కార్డ్‌తో సిగార్ వెలిగించే నాని షాట్ అతని రోమియో, డేంజర్ పర్సోనా ప్రజెంట్ చేసింది.

## అతిథులకు జపనీస్ డిన్నర్



టాలీవుడ్‌లో ఇప్పుడు మోస్ట్ హాట్ టాపిక్ ఏమిటంటే.. విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న వివాహం. విరోష్ పేరుతో ఫిబ్రవరి 26న ఉదయపూర్‌లోని ఐటీసీ మెమెంటోస్ ప్యాలెస్‌లో సన్నిహితుల మధ్య వీరిద్దరి మ్యారేజ్ జరగబోతుంది. మార్చి 4న హైదరాబాద్‌లోని తాజ్ హోటల్‌లో రిసెప్షన్ జరగనుంది. అయితే ఏం చేసినా తమకంటూ ప్రత్యేకత ఉండాలని కోరుకునే ఈ జంట.. పెళ్లికి వచ్చిన అతిథులకు పసందైన విందును ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన జపనీస్ డెలికసీస్‌ను అందించాలనుకోవడం వారి ప్రత్యేకతను తెలియజేస్తోందని భావిస్తున్నారు. ప్రీవెడ్డింగ్ ఈవెంట్‌లో కూడా జపనీస్ డిన్నర్‌తో పాటు పూల్ పార్టీ, వాలీబాల్ వంటి ఫన్ యాక్టివిటీస్ ఉండబోతున్నాయట.

ఆట



# తిలక్! తొందరపడకు

## ఛేజ్ మాస్టర్ కావాలంటే కోహ్లీలా ఆడు: కైఫ్

*వెస్టిండీస్ చేతిలో జింబాబ్వే చిత్తుగా ఓడింది. కరేబియన్ల నెట్ రన్‌రేట్ 5కు పైగా ఉంది. మరోవైపు టీమిండియాపై నెగ్గిన సౌతాఫ్రికా 3.8 నెట్ రన్‌రేట్ కలిగివుంది. ఈ పరిస్థితుల్లో సూర్యసేన సెమీస్ అవకాశాలు మిణుకుమిణుకు మంటున్నాయి. వెస్టిండీస్, జింబాబ్వేలపై విజయాలు సాధిస్తేనే సెమీస్ ఛాన్స్. ఫస్ట్ డౌన్‌లో వచ్చే తిలక్ వర్మ బాధ్యతగా 20 ఓవర్ల వరకూ ఆడాలని మాజీలు సూచిస్తున్నారు.*

**చెన్నై:** హైదరాబాదీ స్టయిలీష్ బ్యాట్స్‌మన్ తిలక్ వర్మ పొట్టి క్రికెట్‌లో టీమిండియా నమ్మకమైన బ్యాట్స్‌మెన్‌గా ఎదిగాడు. దుబాయ్‌లో జరిగిన ఫైనల్లో పాకిస్థాన్‌ను ఉతికిఆరేసి ఒంటిచేత్తో ఆసియాకప్‌ను అందించాడు. టీ20 ప్రపంచకప్‌లోనూ తిలక్ మార్కు ఇన్నింగ్స్‌లను ఫ్యాన్స్ ఆశించారు. దాన్ని నిలబెట్టుకునేలాగా మొదటి నాలుగు మ్యాచ్‌లు ఆడాడు. అమెరికాపై 25 రన్స్, నమీబియాపై 25 రన్స్, పాకిస్థాన్‌పై 25 రన్స్, నెదర్లాండ్స్‌పై 31రన్స్.. ఇలా నాలుగు మ్యాచ్‌ల్లో 106 రన్స్‌సాధించాడు. ఇవన్నీ కూడా తొలి వికెట్ తొందరగా పడినపుడు టీమిండియా ఇన్నింగ్స్‌ను నిలబెట్టినవే. కాకపోతే వాటిని బిగ్‌స్కోర్లుగా మలచలేకపోయాడు. సౌతాఫ్రికాపై సూపర్8 మ్యాచ్‌లో ఓపెనర్ ఇషాన్ కిషన్ డకౌట్ అయిన పరిస్థితుల్లో తిలక్ ఆడిన షాట్ విమర్శలపాలవుతోంది. ఇదే ఓటమికి నాంది పలికిందన్నది సునీల్ గవాస్కర్‌తో గొంతుకలిపే వారి వాదన.

నిజానికి ఫస్ట్ డౌన్ లో బ్యాటింగ్‌కు వచ్చే తిలక్ వర్మకు సొంత స్టయిల్ ఉంది. కోహ్లీలా ఫైటింగ్ స్పిరిట్ కనబరుస్తుంటాడు. అటాకింగ్ ప్లేతో పలు విజయాలు అందించాడు. సౌతాఫ్రికాపై చక్కని రికార్డు ఉంది. ఏడాదిన్నర కిందట సఫారీ బౌలర్లను వారి సొంతగడ్డపై ఉతికి ఆరేశాడు. సెంచూరియన్, జోహాన్నెస్ బర్గ్ టీ20ల్లో శతకాల మోత మోగించాడు. వరుస ఇన్నింగ్స్‌లో రెండు సెంచరీలు చేసిన ఏకైక ఇండియన్‌గా నిలిచాడు. అందుకేనేమో సౌతాఫ్రికాపై ఆడడాన్ని తిలక్ ఎంజాయ్ చేస్తుంటాడు. సౌతాఫ్రికాతో మ్యాచ్ అంటే ఓ కాన్ఫిడెన్స్. ఆ కాన్ఫిడెన్స్‌తోనే కాబోలు తొలి ఓవర్లో ఇషాన్ కిషన్ ఔట్ అయినా ముందుకు వచ్చి భారీ షాట్ ఆడే ప్రయత్నం చేశాడు. పొడగరి పేసర్ యాన్సెన్‌ను టార్గెట్ చేయబోయి వికెట్ కీపర్ చేతికి దొరికాడు. వరుసగా విఫలమవుతున్న ఓపెనర్ అభిషేక్ శర్మతో జత కడుతూ తిలక్ వర్మపై వేటు వేసి.. రిజర్వ్ బెంచ్‌లో ఉన్న సంజూ శాంసన్‌కు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

బాధ్యతగా ఆడాల్సిన తిలక్ వర్మ..ఇలా ఆడడంపై ఒకవైపు విమర్శలు వస్తున్నా..అతని సపోర్ట్ చేసేవారూ లేకపోలేదు. మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్.. తిలక్‌ను ఆటతీరును సమర్థిస్తూనే ఆలా ఆడాల్సింది కాదన్నాడు. తిలక్ తొందరపడకు.. ఛేజ్ మాస్టర్ కావాలంటే కోహ్లీలా ఆడు అంటూ విలువైన సలహా ఇచ్చాడు. ఛేజ్ మాస్టర్ అవ్వాలంటే.. 20 ఓవర్ల వరకూ ఆడాలన్నాడు. జట్టులో అభిషేక్, ఇషాన్, సూర్యకుమార్, హార్దిక్ పాండ్య, రింకూ సింగ్ రూపంలో అటాకింగ్ గేమ్ ఆడేవాళ్లు ఉన్నప్పుడు.. చివరివరకూ నిలబడేది ఎవరు? ఈ బాధ్యతను తిలక్ తీసుకోవాలని కైఫ్ వెల్లడించాడు. కైఫ్ సూచనను మిగతా మ్యాచ్‌ల్లో అమల్లోకి తెచ్చి తిలక్ భారీ స్కోర్లు సాధించాలని అతని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.



# పాక్ ధమాల్

## హ్యారీ బ్రూక్ సూపర్ సెంచరీ - సెమీస్‌లో ఇంగ్లాండ్



**కొలంబో:** టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌ను మరో ఓటమి వెక్కిరించింది. గెలిస్తేనే నిలిచే మ్యాచ్‌లో ధమాల్‌మంది. ఫర్హాన్ తప్పిస్తే బ్యాటింగ్ దంతా వైఫల్యమే. మరోవైపు హ్యారీ బ్రూక్ సూపర్ సెంచరీతో ఇంగ్లాండ్ రెండు వికెట్లతో నెగ్గింది. వరుస రెండు విజయాలతో సూపర్8 గ్రూప్-2 నుంచి సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది.

పాకిస్థాన్ నిర్దేశించిన 165 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్‌ను ఆరంభంలో షహీన్ అఫ్రిది బెంబేలెత్తించాడు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్(0), జాస్ బట్లర్(2), జాకబ్ బెతెల్(8) లను పదునైన బంతులతో అవుట్ చేశాడు. దీంతో ఇంగ్లాండ్ 35 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయింది. మిస్టరీ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ కూడా వస్తూనే టామ్ బాంటన్(2)ను అవుట్ చేశాడు.

### బ్రూక్స్ కెప్టెన్ ఇన్నింగ్స్

ఒకవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్‌లో హారీ బ్రూక్స్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. ధాటిగా ఆడుతూ సామ్ కుర్రాన్ అండగా స్కోరును వంద పరుగులు దాటించాడు. కుర్రాన్(16) కూడా తారిక్ చేతికి చిక్కాడు. మరోవైపు బ్రూక్స్ పాక్ బౌలర్లపై సిక్స్‌లు, ఫోర్లతో చెలరేగుతూ 28 బంతుల్లో హాఫ్‌సెంచరీ, 50 బంతుల్లో సెంచరీ సాధించాడు. టీ20ల్లో బ్రూక్స్ మొదటి శతకం అందుకున్నాడు. అతని ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, నాలుగు సిక్స్‌లు ఉన్నాయి. క్రీజ్‌లోకి వచ్చిన విల్ జాక్స్ కూడా బ్యాట్ ఝుళిపించాడు. బ్రూక్స్‌ను షహీన్ క్లీన్ బౌల్డ్ చేశాడు. మరో ఎండ్‌లో 28 రన్స్ చేసిన జాక్స్‌ను, ఓవర్టన్‌ను నవాజ్ అవుట్ చేయడంతో మ్యాచ్ ఉత్కంఠ రేపింది. జోఫ్రా అర్చర్ బౌండరీతో ఇంగ్లాండ్ మరో 5 బంతులుండగానే గెలుపొందింది.

అంతకుముందు టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ ఆరంభంలో తడబడింది. సయీమ్ అయూబ్(7)ను మూడో ఓవర్లో అర్చర్, తరువాతి ఓవర్లో కెప్టెన్ సల్మాన్ ఆఘా(5)ను డాసన్ అవుట్ చేశారు. 27 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ పాక్‌ను ఓపెనర్ షాహిబ్‌జాదా ఫర్హాన్ ఆదుకున్నాడు. బాబర్ ఆజమ్‌తో కలిసి మరో వికెట్ కోల్పోకుండా 50 మార్కు దాటించాడు. పవర్ ప్లేలో కేవలం 46 పరుగులు మాత్రమే వచ్చాయి. క్రీజ్‌లో కుదురుకున్నాక ఇద్దరూ బ్యాట్ ఝుళిపించారు. పది ఓవర్లకు పాక్ స్కోరు 70కు చేరుకుంది. ఆఖరుకు 46పరుగుల మూడో వికెట్ జోడీని ఓవర్టన్ విడదీశాడు. చక్కని బంతితో బాబర్ ఆజమ్(24 బంతుల్లో 25రన్స్)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. మరోవైపు ఫర్హాన్ దాటిగా ఆడుతూ విల్ జాక్స్ బౌలింగ్‌లో ఓ సిక్స్, ఓ సింగిల్‌తో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. జోరు మీదున్న ఫర్హాన్‌ను 16వ ఓవర్లో ఓవర్టన్ యార్కర్ బంతితో బోల్తా కొట్టించాడు. అతను చేసిన 63 పరుగుల్లో రెండు సిక్స్‌లు, 7 బౌండరీలు ఉన్నాయి. ఫకర్ జమాన్ 16 బంతుల్లో 25 రన్స్, షాదబ్ ఖాన్ 11 బంతుల్లో 23 రన్స్ ధాటిగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యారు. స్లాగ్ ఓవర్లలో పాక్ మరిన్ని వికెట్లు కోల్పోవడంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 164 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో డాసన్ మూడు వికెట్లు.. జోఫ్రా అర్చర్, ఓవర్టన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ ఓటమితో పాక్ సెమీస్ ఆశలు దాదాపు గల్లంతయ్యాయి. చివరి మ్యాచ్ శ్రీలంకతో ఆడనుంది.

# తొలి వన్డేలో భారత్ విమెన్స్‌కు షాక్



**బ్రిస్బేన్:** ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను భారత అమ్మాయిలు ఓటమితో ఆరంభించారు. టీ20 సిరీస్ నెగ్గిన జోష్‌ను తొలి వన్డేలో కొనసాగించలేకపోయారు. బ్రిస్బేన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో 6 వికెట్లతో ఆస్ట్రేలియా నెగ్గింది. 3 వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ విమెన్స్ టీమ్ ఆరంభంలో తడబడింది. ప్రతిక రావల్ (0), షెఫాలీ వర్మ(4) వరుస బంతుల్లో పెవిలియన్‌కు చేరారు. జేమీ రోడ్రిగ్(9) కూడా తొందరగానే అవుట్ కావడంతో భారత్ 52 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో స్మృతి మంధాన (58), కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (53) బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీలతో జట్టును ఆదుకున్నారు. వీరిద్దరి అవుట్ తర్వాత మరోసారి భారత్ వేగంగా వికెట్లు కోల్పయింది. లోయర్ ఆర్డర్‌లో కాశ్వీ గౌతమ్(43) 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో 200 మార్కు దాటింది. 48.3 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత భారత్ మళ్లీ వరుస క్రమంలో వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆఖర్లో కశ్వీ గౌతమ్ (43) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ 200 పరుగుల మార్కును దాటగలిగింది. ఆస్ట్రేలియా బౌలర్లలో యాష్ గార్డనర్ 3 వికెట్లతో రాణించింది.

215 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 38.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఓపెనర్లు అలిస్సా హీలీ (50), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (32) అద్భుత ఆరంభాన్నిచ్చారు. అనంతరం బెత్ మూనీ (76 నాటౌట్) అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టును గెలుపు తీరాలకు చేర్చింది. భారత బౌలర్లలో శ్రీ చరణి రెండు వికెట్లు, దీప్తీ శర్మ, క్రాంతి తలా వికెట్ సాధించారు.


రంజీట్రోఫీ ఫైనల్ : పటిష్ట స్థితిలో జమ్ము కశ్మీర్

# శుభమ్ అజేయ సెంచరీ



**హుబ్లీ:** తొలిసారి రంజీ ఫైనల్ చేరి చరిత్ర సృష్టించిన జమ్ముకశ్మీర్ అదే జోరు కనసాగిస్తోంది. హుబ్లీలో ఆరంభమైన రంజీ ట్రోఫీ ఫైనల్లో 8సార్లు ఛాపియన్‌ను సమర్థంగా ఎదుర్కొంది. శుభమ్ పండిర్ అజేయ శతకంతో తొలి రోజు ఆటముగిసేసరికి జమ్ము కశ్మీర్ 2 వికెట్లు కోల్పోయి 284 పరుగులు చేసింది.

టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన జమ్ము కశ్మీర్ ఆరంభంలోనే కమ్రాన్ ఇక్బాల్ వికెట్ కోల్పోయింది. ఈ వికెట్ ప్రసిధ్ కృష్ణ పడగొట్టాడు. మరో ఓపెనర్ యావర్ హసన్, శుభమ్ పండిర్ సమర్థంగా కర్ణాటక బౌలర్లను ఎదుర్కొన్నారు. ఇద్దరూ చెరో అర్ధసెంచరీతో జమ్ము కశ్మీర్ స్కోరును 150 మార్కు దాటించారు. అయితే 139 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి మరోసారి ప్రసిధ్ కృష్ణ తెరదించాడు. యావర్‌హసన్ 150బంతుల్లో 88రన్స్ చేశాడు. అతని స్థానంలో క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ పరాస్ డోగ్రా(9) కొద్దిసేపటికే గాయంతో రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. అబ్దుల్ సమద్ అండగా మరో వికెట్ పడకుండా శుభమ్ పండిర్ స్కోరును ముందుకు నడిపాడు. ఈ క్రమంలో శుభమ్(221 బంతుల్లో 117) సూపర్ శతకంతో ఆకట్టుకోగా, సమద్(67 బంతుల్లో 52) అర్ధశతకంతో క్రీజ్‌లో కొనసాగుతున్నాడు. జమ్ము కశ్మీర్ కోల్పోయిన రెండు వికెట్లు కూడా ప్రసిధ్ కృష్ణ పడగొట్టాడు.



# పసిడి తాకట్టురుణాలు రూ.162.7 లక్షలకోట్లు!

**ముంబయి, ఫిబ్రవరి 24:** భారతీయుల్లో బంగారం తాకట్టురుణాలవైపు ఎక్కువ మొగ్గుచూపిస్తున్నారు. సాంప్రదాయంగా లాకర్లలో నిక్షిప్తంచేసుకోవడం మానివేసారు. ఇపుడు బంగారం ధరలు శరవేగంగాపెరగడంతో తాకట్టుపై రుణాలు తీసుకోడానికే ఆసక్తిచూపుతున్నారు. తక్షణమే రుణసదుపాయం చేతిలోకి నగదు వచ్చిపడుతుండటం నెలవారీ వాయిదాల్లోకూడా చెల్లించుకుంటుండటంతో బంగారంరుణాల మార్కెట్ భారీగా పెరిగింది. మూడోత్రైమాసికంలో బంగారం తాకట్టురుణాలు రివ్వున పైకి ఎగిసాయి. వార్షిక పద్ధతిలోచూస్తే 90.3శాతం పెరిగినట్లు క్రిఫ్ హైమార్క్ సర్వేలో తేలింది. గోల్డ్‌రష్‌గా మారుతున్న ఈరుణాలు మరింతగా పెరుగుతున్నాయి. ఈ రుణ పోర్టుఫోలియో ఈ ఏడాది 162.7 లక్షలకోట్లుగా ఉంది. కుటుంబీకులవద్ద ఉన్న ఆభరణాలనుంచి కొత్త ఆన్వేషణలకు కూడా తాకట్టురుణాలే తీసుకుంటున్నారు. దీనికితోడు బ్యాంకులు కూడా రక్షిత భద్రత ఉన్న రుణాలకే ప్రాధాన్యం ఇస్తుండటంతో ఇవి భారీగాపెరిగాయి. జిఎస్టీ హేతుబద్ధీకరణతోపాటు పండగలసీజన్ కూడా ఇందుకు తోడయింది. అలాగే వాహనఫైనాన్సింగ్‌కూడా భారీగా పెరుగుతోంది. టూవీలర్ ఫైనాన్సింగ్ 46.7శాతంపెరిగినట్లు తెలుస్తోంది. ఆటోరుణాలు త్రైమాసికం వారీగాచూస్తే 22.1శాతంపెరిగాయి. పండగలసీజన్‌లోనే 14.7శాతంపెరిగింది. ఐదులక్షలకుపైబడిన రుణాలు మొత్తం బంగారంతాకట్టురుణాల్లో 36.5శాతంగా ఉనానయి. గత ఏడాదికంటే 24శాతంపెరిగాయి. ఇకగృహరుణాలపరంగాచూస్తే సగటు రుణం 33 లక్షలుగా ఉంది. హైఎండ్ ఆస్తులకోసం అయితే రూ.75 లక్షలవరకూ ఉన్నాయి. హోమ్‌లోన్‌పరంగా అయితే ప్రైవేటు బ్యాంకులే ఎక్కువ వాటా ఉన్నాయి. బిగ్‌హౌస్ లోన్ కేటగిరీలో ప్రైవేటు బ్యాంకులు 50.3శాతం గా ఉన్నాయి. గోల్డ్ రుణాల్లోకూడా 45.8శాతం వాటాతో ఉన్నట్లు తేలింది.

## ప్రభుత్వరంగ సంస్థల ఐపిఒలద్వారా రూ.1.79 లక్షలకోట్లు టార్గెట్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:** ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాలను ఐపిఒ ద్వారా విక్రయించి 2030 నాటికి మొత్తం రూ.1.79 లక్షలకోట్లు సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రైవైటీకరణ వ్యవస్థనుంచి పక్కకు తొలగి ఇపుడు తాజాగా ఐపిఒలు జారీచేయాలనినిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వసంస్థల్లోని ఆస్తులను మానిటైజ్‌చేయడంద్వారా వచ్చే నాలుగేళ్లలో 183.7 బిలియన్ డాలర్లు సమీకరించేందుకు నీతి ఆయోగ్ ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం కొన్ని ప్రభుత్వశాఖలను కూడా ఎంపికచేసింది. రైల్వేలు, విద్యుత్, పెట్రోలియం, సహజవాయువు, ఏవియేషన్, బొగ్గురంగాల్లో ముందు ఐపిఒలు తీసుకువచ్చేందుకు నీతి ఆయోగ్ నిర్ణయించింది. ప్రధాని నరేంద్రమోడీ రెండో విడతగా ప్రతిపాదించినన ఆలుగేళ్లప్రణాళికలో భాగమే ఈ ఐపిఒలని చెపుతోంది. తొలివిడతగా 2024-25లో 5.3 లక్షలకోట్లు సమీకరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఆరులక్షలకోట్ల లక్ష్యంలో 90శాతం సాధించింది. అతకుముందు ప్రైవేటీకరణద్వారా నిధుల సమీకరణలో ప్రభుత్వం సవాళ్లు, సమస్యలు ఎదుర్కొంది. అందుకోసం ఇటీవలే నగదీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించినా అనుబంధసంస్థల్లో మాత్రమే చేయగలిగింది. ఇపుడు ఐపిఒ రూటులో అయితే నిధుల సమీకరణ లక్ష్యం నెరవేరుతుందన్న భావనతో ఐపిఒమార్గాన్ని అనుసరిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను ప్రభుత్వం వాయిదా వేసింది. కొత్తప్లాన్‌ప్రకారం ఏడు రైల్వే కంపెనీల్లో ఐపిఒలద్వారా 2030 నాటికి రూ.83,700 నిధులు సమీకరించుకోగలుగుతామని ధీమాగా ఉంది స్టాక్ మార్కెట్ లిస్టింగ్స్‌ద్వారా కూడా ఈ ఆర్థికసంవత్సరంలో రూ.17 వేలకోట్లు సమీకరించే లక్ష్యంతో ఉంది. విద్యుత్‌సంస్థల అనుబంధ సంస్థలు కూడా రూ.31 వేల కోట్లు వచ్చేనాలుగేళ్లలో సమీకరించాలి.



## అసలు, వడ్డీ సహా కుంభకోణం మొత్తం చెల్లించిన ఐడిఎఫ్‌సి బ్యాంకు

### రూ.583 కోట్లు జమచేసామని బ్యాంకు ప్రకటన


**ముంబయి,ఫిబ్రవరి 24:** ఐడిఎఫ్‌సిలోని ఛండీగర్ శాఖల్లో ప్రభుత్వ విభాగాలఖాతాల్లో జరిగిన రూ.590 కోట్ల మోసానికి సంబంధించి బ్యాంకు ముందు ప్రిన్సిపల్ మొత్తం, వడ్డీతో సహా రూ.583 కోట్లు చెల్లించినట్లుప్రకటించింది. హర్యానా ప్రభుత్వశాఖల ఖాతాలన్నింటినీ ఉపసంహరించుకునేందుకు నిర్ణయించడంతో బ్యాంకు ముందు తనవంతు బాధ్యతగా తమ వద్ద జరిగిన మోసానికి సంబంధించిన మొత్తంతోపాటు వడ్డీనికూడా ఆయా ఖాతాలకు జమచేసింది. బ్యాంకు షేర్లు ఈ రీఫండ్‌తో కొంతమే రికవరీ అయ్యాయి. ముందురోజు 16శాతం క్షీణించిన షేర్లు రికవరీ వార్త వెలువడటంతో వెంటనే రికవరీ అయ్యాయి. బ్యాంకు పరంగా మొత్తం 100శాతం ప్రిన్సిపల్, వడ్డీ మొత్తాలను చెల్లించామని తెలిపారు. హర్యానా ప్రభుత్వం అంచనావేసిన 583 కోట్లు వెంటనే చెల్లించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజికి ఇచ్చిన ఫైలింగ్‌తో తెలిపింది. ఈ వారాంతంలోనే రూ.590 కోట్లు ఛండీఘర్‌బ్రాంచ్‌లోజరిగిందని గుర్తించింది. హర్యానా ప్రభుత్వ ఖాతాల్లోనే ఈమోసం జరిగింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నివేదికలు, బ్యాంకు ఖాతాల్లో మొత్తాలు పొంతన లేకపోవడంతో వెంటనే సంబంధిత నలుగురు సిబ్బందిని సస్పెండ్‌చేసింది.

## దేశంలో నాలుగు దశాబ్దాల్లో పదిరెట్లు పెరిగిన తలసరి ఆదాయం

**ముంబయి, ఫిబ్రవరి 24:** దేశంలోప్రజల తలసరి ఆదాయం గడచిన నాలుగు దశాబ్దాల్లో పదిరెట్లుపెరిగింది. 1981లో 274 డాలర్లు మాత్రమే ఉన్న తలసరి ఆదాయం 2024 నాటికి 2700 డాలర్లకు పెరిగిందని ఆర్‌బిఐ డిప్యూటి గవర్నర్ పూనమ్ గుప్తా తెలిపారు. జిడిపికంటే వేగంగా తలసరి ఆదాయం పెరుగుతోంది. స్వల్పస్థాయినుంచి 1991నాటికి 306 డాలర్లుగాచేరిందని, ఆ తర్వాత 2024 నాటికి ఒక్కసారిగా పదిరెట్లుపెరిగి 2700 డాలర్లుగా నమోదయిందని గుప్తా వెల్లడించారు. అభివృద్ధి అధ్యయనకేంద్రం (సిడిఎస్)లో జరిగిన 14వ వ్యవస్థాపక దినోత్సవం ప్రసంగంలో పూనమ్ గుప్తా పాల్గొని ప్రసంగించారు. సంస్థ సిడిఎస్‌ను 1970లో కెఎన్‌రాజ్ అనే ప్రొఫెసర్ ఏర్పాటుచేసారు. 1981నుంచి చూస్తే తలసరి ఆదాయం వృద్ధికి 23 ఏళ్లుపట్టిందని, 22 ఏళ్లకాలంలోచూస్తే ఐదురెట్లుపెరిగిందని, చివరకు ఒక్కసారిగా 2700 డాలర్లకు చేరుకుని పదిరెట్లకుపెరిగిందని గుప్తా వెల్లడించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ప్రకటించిన ఆర్థిక నివేదికలో తలసరి ఆదాయం 2025 నాటికి 2818డాలర్లు.

## రూ.4 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి భారీ నష్టాల్లోముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబయి, ఫిబ్రవరి 24:** అమెరికా వాణిజ్య విధానాలపై తాజాగా తలెత్తిన ఆందోళనలతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. గత నాలుగు రోజుల్లో ఎన్నడూ లేనంతగా అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు కుప్పకూలాయి. బ్యాంకింగ్, ఇన్‌ఫ్రా, ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాలు జరగడంతో సెన్సెక్స్ 1,068.74 పాయింట్లు నష్టపోయి 82,225.92 వద్ద ముగిసింది. మార్కెట్లలో ఇన్వెస్టర్ల సంపద రూ.4 లక్షలకోట్లకు క్షీణించింది. మెటల్స్, ఎఫ్ఎంసిజి రంగాలు మాత్రమే సానుకూలంగాముగిసాయి. నిఫ్టీ 288.35 పాయింట్లు తగ్గి 25,424.65 వద్ద స్థిరపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా 15 శాతం తాత్కాలిక టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించడంతో ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ రాజుకునే ప్రమాదం ఉందని ఇన్వెస్టర్లు గమనించారు. గతంలో ఆయన విధించిన టారిఫ్‌లు చట్ట విరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడంతో అంతర్జాతీయ మార్కెట్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీని ప్రభావం భారత మార్కెట్లపై కూడా ప్రతికూలంగా పడింది. ఈ అమ్మకాల ఒత్తిడిలో ఐటీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. అమెరికా టెక్నాలజీ వ్యయంపై ఆందోళనలు, బలహీనమైన గ్లోబల్ సంకేతాలతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 4.74 శాతం పతనమై 30,053.50 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో ఈ సూచీ రెండేళ్ల కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఐటీ తర్వాత రియాల్టీ రంగం 2.54 శాతం నష్టపోయింది.



అయితే, మెటల్ ఇండెక్స్ మాత్రం మార్కెట్ పతనంలోనూ కాస్త మెరుగ్గా నిలిచింది. విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 25,500-25,600 స్థాయి కీలక నిరోధకంగా ఉంది. దీనిపైన నిలదొక్కుకుంటేనే మార్కెట్ పుంజుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ 25,300 స్థాయికి దిగువకు పడిపోతే, అమ్మకాల ఒత్తిడి మరింత పెరగవచ్చని భావిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, ఏఐ టెక్నాలజీపై ఆందోళనల కారణంగా మార్కెట్లు సమీప భవిష్యత్తులో అస్థిరంగానే కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేసారు. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.21శాతం క్షీణిస్తే

స్మాల్‌క్యాప్ సూచీ 0.51శాతం పెరిగింది. డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా 90.95 రూపాయలుగా కొనసాగింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ ఏప్రిల్ సెటిల్‌మెంట్‌వి 0.48శాతం దిగజారి రూ.160,810గా కొనసాగింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 16 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 71.65 డాలర్లుగా కొనసాగింది.

# వాణిజ్యం

## బోర్డు ఛైర్మన్ ఎంపికపై నోయెల్‌టాటా అభ్యంతరం!



**ముంబయి, ఫిబ్రవరి 24:** టాటాసన్స్ బోర్డు మంగళవారం నాటి కీలక సమావేశంలో ప్రస్తుత ఛైర్మన్‌న టరాజన్ చంద్రశేఖరన్‌కు మూడోసారి పగ్గాలు అప్పగించడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. టాటాసన్స్ వైస్‌ఛైర్మన్, టాటా ట్రస్టుల ఛైర్మన్ నోయిల్ టాటాస వ్యయంగా అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తేలింది. 120 బిలియన్ డాలర్ల గ్రూపులో టాటాట్రస్టులే 66.4శాతం వాటాలతో ఉన్న సంగతి తెలిసిందే. లవణం నుంచి సాఫ్ట్‌వేర్, సెమికండక్టర్స్, ఎయిర్‌లైన్స్ ఆటోమొబైల్స్ సర్వస్వం విస్తరించిన ఈగ్రూపులో ఇపుడు అత్యున్నత పదవిపై అంతర్గత పోరాటం పెరిగింది. సహజసాంప్రదాయం ప్రకారం టాటాసన్స్ వాటాదారులు, బోర్డు ఉన్నతస్థాయిలో ఉన్న ఛైర్మన్ వంటి వారికి పునర్నియామకం, లేదా పదవీకాలం పొడిగింపు వంటివి ఏడాదికి ముందే ప్రకటిస్తాయి. ఎందుకంటే గ్రూపు సుస్థిరత నిరంతరాకంగా కొనసాగేందుకు వీలుగా ముందుగానే ప్రకటిస్తారు. అంతేకాకుండా వచ్చే కొత్తవారికి స్థిరపడేందుకు ఆయన వ్యూహాలు అమలుచేసేందుకు వీలుగా తగినంత వ్యవధి ఉంటుంది. ఇపుడు తాజాగా నోయల్ టాటా అభ్యంతరం అనూహ్యమలుపును తిప్పింది. బోర్డు ఇందుక సంబంధించి సవరణ క్లాజ్‌లను ఉపయోగిస్తోంది. టాప్ ఎగ్జిక్యూటివ్‌లకు 65 కే రిటైర్‌మెంట్ వయసు అని చెపుతోంది. చంద్రశేఖరన్‌కు ఒకవేళ మూడోసారి వస్తే 2032వరకూ కొనసాగుతారు. అప్పటికి ఆయన వయసు 70 ఏళ్లు పూర్తవుతాయి.

ఇపుడు గతంలో రతన్ టాటాకు ఎదురయిన సవాళ్లే ఇపుడు ఎదురవుతున్నాయి. సైరస్‌మిస్త్రీని తొలగించిన తర్వాత రతన్‌టాటా తప్పనిసరిగా బోర్డులోకి వచ్చారు. ఇపుడు తాజాగా మళ్లీ అదేపరిస్థితి వచ్చింది. కీలకం నిర్ణయం తీసుకునేందుకు మరికొంత వ్యవది పట్టే అవకాశం ఉందని బోర్డు సభ్యుల అంచనా. టాటాసన్స్ నికర ఆదాయం కూడా క్షీణించింది. రూ.43,893 కోట్లనుంచి 2025లో రూ.26,231.74 కోట్లకు తగ్గింది. డివిడెండ్ ఆదాయం ఎక్కువగా టిసిఎస్‌నుంచే వస్తోంది. 36,149.05 కోట్లకు పెరిగింది.

బోర్డు ఈసారి ఎక్కువ డివిడెండ్‌ను కూడాప్రకటించింది. ప్రతి వాటాకు రూ.64,900 ప్రకటించింది. అంతకుముందు ఏడాది రూ.35 వేలుగా మాత్రమే ఉంది. ఈనిర్ణయాలు కూడా ఇపుడు బోర్డు ఛైర్మన్ పదవి ఎంపికలో కీలకం అవుతున్నట్లు అంచనా.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.